అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

రాహుల్‌వి పిల్ల చేష్టలైతే...
మోదీ పెద్దరికం ఎక్కడ?

ఒత్తిడిలో యువత ఆత్మహత్యలు!

ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికపై నేడు
మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్
ప్రజంటేషన్ లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 149 | మంగళవారం | 29-04-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## మీ స్పందనేంటీ?

- అశ్లీల కంటెంట్‌పై ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్‌కు సుప్రీంకోర్టు నోటీసులు
- ఇది 'తీవ్ర ఆందోళనకరం' అని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** 'ఓవర్‌దిటాప్' (ఓటిటి), సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో లైంగిక అసభ్యకరమైన కంటెంట్ ప్రసారంపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఇది 'ఒక ముఖ్యమైన ఆందోళన' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై ప్రతిస్పందనను కోరుతూ కేంద్రం, ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్‌కు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయ్, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ ఈ అంశాన్ని పరిష్కరించడం లేదా చర్యలు తీసుకోవడం లెజిస్లేచర్ లేదా ఎగ్జిక్యూటివ్ పరిధిలోకి వస్తుందని తెలిపింది. 'ఇది మా పరిధిలో లేదు. ఇప్పటికే మాపై శాసన లేదా కార్యనిర్వాహక అధికారాలలో జోక్యం చేసుకుంటున్నామన్న ఆరోపణలు చాలా తరువాయి 2లో

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా?

- రజతోత్సవ సభలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కారు
- అభద్రతాభావంతో మాట్లాడుతున్నారు
- ఆయన చేసిన విధ్వంసంతోనే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం
- గులాబీ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- కెసిఆర్‌వన్నీ శాంపిల్ పథకాలే
- అభివృద్ధి సంక్షేమ పథకాలను చెప్పుకోవడంలో కొంత వెనకబడ్డాం
- రాహుల్ గాంధీకి నాకు మధ్య దూరం పెరిగిందనడం అవాస్తవం
- మీడియా ప్రతినిధులతో 'ఇష్టాగోష్టి'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రాన్ని పదేళ్లు పరిపాలించిన బిఆర్‌ఎస్ పాలకులు రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు ప్రసంగం పూర్తిగా ప్రభుత్వంపై, కాంగ్రెస్‌పై అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని, కెసిఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని సిఎం విమర్శించారు. బిఆర్‌ఎస్ సభలో కెసిఆర్ ప్రసంగంపై సిఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిదులతో సిఎం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కెసిఆర్ విమర్శలు ఇప్పుడు చేయడం కాదని, అసెంబ్లీకి వచ్చి చేయాలన్నారు. కెసిఆర్ చేసిన విధ్వంసంతోనే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అవసరాలకు అనుగుణంగా మాజీ సిఎం కెసిఆర్, ప్రధాని మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని సిఎం విమర్శించారు. అధికార యంత్రాంగాన్ని ప్రక్షళన చేశామని, కెసిఆర్ మాదిరిగా పథకాలను మొదలుపెట్టి వదిలేయబోనని, కెసిఆర్‌వి అన్నీ శాంపిల్ పథకాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేపడుతున్న సంక్షేమ పథకాలను చెప్పుకోవడంలో కొంత వెనుకపడ్డామని, దానిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగాన్ని

> "కొంత మంది పార్టీ నాయకులకు పదవులు రాలేదని నోరుజారుతున్నరు.అలాంటి వాళ్లకు అవకాశాలు ఉండవు. ఇష్టానుసారంగా మాట్లాడితే నేతలే నష్టపోతారు. నేను ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటా. కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతా. కెసిఆర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు వెళ్లి పరామర్శించా. అరెస్టుల విషయంలో తొందరపడితే ఏం జరిగిందో ఎపిలో చూశాం. రాహుల్ గాంధీతో నాకున్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వంటి నాయకత్వం అవసరం.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి




## ఉగ్రవాద సంస్థలను పాకిస్తాన్ ఎలా అనుమతిస్తుంది?

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ :** సార్వభౌమ దేశమైన పాకిస్తాన్ గడ్డపై ఉగ్రవాద సంస్థల పని చేసేందుకు ఏ విధంగా అను మతిస్తుందో పాక్ ప్రభుత్వం ఆలోచించుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఉగ్రవాద సంస్థలు భారతదేశంలోకి జొరబడి ప్రజలను చంపుతుంటే ఏ విధంగా మౌన ప్రేక్షకురాలిగా ఉంటుందని ప్రశ్నించారు. ఈ ఘటన విషయంలో పాకిస్తాన్ బాధ్యతేమిటి అని అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం నాడు ఆయన 'ఎఎన్‌ఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ మనం ఇరుగుపొరుగు దేశాలమని, ఇరుగు పొరుగుగా మనకు బాధ్యత ఉంటుందని, ఏదేమైనా ఇరుగుపొరుగుగా జీవించాల్సిందేనని, దీనిపై పాకిస్తాన్ ప్రభుత్వం ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజం ఆశిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని రాజా నిలదీశారు. భారత భూభాగంలోకి చొరబడి అమాయక ప్రజలను చంపుతున్న ఉగ్రవాద సంస్థలను ప్రోత్సహించడానికి, పోషించడానికి పాకిస్తాన్ భూభాగాన్ని ఏ విధంగా ఉపయోగిస్తారని నిలదీశారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి 05
సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ




## కెనడా పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతం

- 343కుగాను 170 స్థానాలు గెలుచుకున్న పార్టీకి అధికారం
- కెనడా లిబరల్‌పార్టీ పెట్టుబడిగా మారిన ట్రంప్ నోటి దురుసు

**ఒట్టావా :** కెనడా పార్లమెంటుకు కీలకమైన పోలింగ్ ప్రక్రియ సోమవారంనాడు ముగిసింది. ఉదయం 8.30 గటలకు పోలింగ్ ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రానికి తొలి ఫలితాలు వెలువడతాయి. మార్క్ కార్నీ అధికారం చేపట్టిన ఆరు వారాలకు ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ట్రంప్ సుంకాల బెదిరింపులు, ఆర్థికపరమైన సమస్యలు, కష్టాలు కెనడాను చుట్టుముట్టిన తరుణంలో ప్రజల తీర్పు అత్యంత కీలకంగా మారనున్నది. కెనడా హౌస్ కామన్స్‌లో ఉన్న 343 స్థానాలకుగాను 170 స్థానాలు గెలుచుకున్నపార్టీకి అధికారం దక్కుతుంది. జస్టిన్ ట్రూడో సారథ్యంలో అధికార లిబరల్‌పార్టీ ప్రతిష్ఠ అడుగంటింది. కానీ ట్రంప్ నోటి దురుసుతనం తర్వాత ప్రజల్లో ఆ పార్టీకి మద్దతు పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని కార్నీ దేశంలో తరువాయి 2లో

## మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు శాంతి చర్చల కమిటీ

- ఏర్పాటు యోచనలో కమిటీ
- ఈ అంశంపై తదుపరి చర్చల బాధ్యత జానారెడ్డి, కేశవరావు చూస్తారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- మాజీ మంత్రి జానారెడ్డితో భేటీ



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు వీలుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక శాంతి చర్చల కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై పార్టీలో తదుపరి చర్చల బాధ్యతను మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, మరో సీనియర్ నేత డాక్టర్ కె.కేశవరావు చూస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం మాజీ మంత్రి, పార్టీ తరువాయి 2లో

## తెలంగాణ రాష్ట్రానికి కెసిఆరే విలన్



- పాలనపై చర్చకు ఎక్కడికైనా వస్తాం
- మాజీ సిఎంకు ఫాంహౌజ్ దాటే ధైర్యముందా?
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సవాల్

ప్రజాపక్షం / హైదరాబాద్

'తెలంగాణ మొదటి, చివరి విలన్ కెసిఆర్. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధం. సమయం, వేదిక బిఆర్‌ఎస్ నేతలే నిర్ణయించండి. చర్చకు ఎక్కడికి రమ్మన్న వస్తాం? కెసిఆర్‌కు ఫాంహౌస్ దాటి వచ్చే ధైర్యం ఉందా' అని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ సవాల్ చేశారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కెసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని, కెసిఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనడానికి బిజెపిపై కెసిఆర్ రెండు నిమిషాల ప్రసంగమే నిదర్శనమన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తరువాయి 2లో

## లోకాయుక్త, ఉప లోకాయుక్తల ప్రమాణస్వీకారం

- లోకాయుక్తగా రాజశేఖర్‌రెడ్డి, ఉపలోకాయుక్తగా జగ్జీవన్ కుమార్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్:

రాజ్ భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి తో పాటు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లోకయుక్త, ఉప లోకాయుక్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. లోకయుక్తగా జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి, ఉప లోకయుక్త గా జగ్జీవన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉప లోకాయుక్త పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా తరువాయి 2లో

## గీత దాటొద్దు




- పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై పార్టీకనుగుణంగా మాట్లాడాలి
- సిడబ్ల్యుసి తీర్మానంతో పాటు పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత, ఎఐసిసి ఆఫీస్ బేరర్‌ల అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరి
- కాంగ్రెస్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై పార్టీ వైఖరికి అనుగుణంగా మాట్లాడాలని లేదంటే మాట్లాడకుండా ఉండాలని తమ నాయకులకు కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. సున్నితమైన ఈ అంశంపై ఇటీవల జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానంతో పాటు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, నాయకులు రాహుల్‌గాంధీ, సంబంధిత ఎఐసిసి ఆఫీస్ బేరర్‌లు వెల్లడించిన అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరిగా పరిగణించాలని తెలిపింది. కాంగ్రెస్ నాయకులు విజయ్ వడిత్తివార్, మణిశంకర్ అయ్యార్, శశి థరూర్, తారిఖ్ హమీదా కర్రా, సైఫుద్దీన్ సోజ్‌లు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ప్రతిపక్షంలో కొందరు నాయకులు 'పాకిస్తాన్ భాష' మాట్లాడుతున్నారని బిజెపి ఆరోపణ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇచ్చింది. పాకిస్తాన్ వ్యూహారచనతో జరిగిన పహల్గామ్ దాడి మన గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి అని సిడబ్ల్యుసి పేర్కొంది. నిఘా వైఫల్యాలను, భద్రత లోపాలను సమగ్రంగా పరిశీలించాలని కూడా విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ తరువాయి 2లో

## ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

రాష్ట్రపతి చేతుల మీదగా పురస్కారం అందుకున్న నాగేశ్వర్‌రెడ్డి (పద్మవిభూషణ్), బాలకృష్ణ (పద్మ భూషణ్), మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ)



మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ) | బాలకృష్ణ (పద్మ భూషణ్) | నాగేశ్వర్‌రెడ్డి (పద్మవిభూషణ్)

**న్యూఢిల్లీ :** తెలుగు సూపర్‌స్టార్ నందమూరి బాలకృష్ణ (బాలయ్య)సహా ముగ్గురు తెలుగు ప్రముఖులు రాష్ట్రపతి ద్రౌపదీముర్మ చేతుల మీదుగా సోమవారంనాడు పద్మ పురస్కారాలు అందుకున్నారు. ఎఐజి ఆసుపత్రి (ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి (వైద్యరంగం)కి పద్మవిభూషణ్, బాలకృష్ణ (సినీరంగం)కు పద్మభూషణ్, మాడుగుల నాగఫణిశర్మ (సాహిత్యరంగం)కు పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి అందజేశారు. వీరితోపాటు వివిధ కేటగిరీల కింద 71 మంది దేశ ప్రముఖులకు తొలి విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్ దర్బార్‌హాలులో ఘనంగా జరిగింది. వీరిలో మొత్తం నలుగురుకి పద్మ విభూషణ్, తరువాయి 2లో



పర్యాటకులను సురక్షితంగా తిప్పిపంపలేకపోయాం 05

- జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన
- పహల్గామ్ దాడికి వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం

## 'శ్రీ చైతన్య' రాంగ్ రూట్

- రిజర్వేషన్ ర్యాంకును జనరల్ ర్యాంకుగా పబ్లిసిటీ
- జెఇఇ మెయిన్స్‌లో 17వ ర్యాంకు ఇంటర్మీడియట్ ఫెయిల్
- ధనార్జనే ధ్యేయంగా అడ్మిషన్ల మార్కెటింగ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి




కరీంనగర్‌లోని శ్రీ చైతన్య కళాశాల రాంగ్ రూట్‌లో వెళ్తోంది. రిజర్వుడ్ కేటగిరీ ర్యాంకును జనరల్ ర్యాంకుగా పబ్లిసిటీ చేసుకుంటోంది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో సదరు ర్యాంకర్ ఫెయిల్ అయినా ధనార్జనే ధ్యేయంగా మార్కెటింగ్ చేస్తోంది. విద్యార్థి ఫెయిల్ అయిన విషయాన్ని యాజమాన్యం దాచిపెట్టి విద్యా ప్రమాణాలను గాలికొదిలేసింది. నాణ్యమైన విద్య పేరుతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. ర్యాంకులను పక్కన పెడితే కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించేంత విద్యను అందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కేవలం ర్యాంకులు, అడ్మిషన్లు , ఫీజులు, ధనార్జనే తరువాయి 12లో

## క్షేత్రస్థాయిలో చట్టాల అమలు బాధ్యత అధికారులదే

- దేశానికి రోల్ మోడల్‌గా 'భూభారతి'
- వివిధ రాష్ట్రాలలో రెవెన్యూచట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/ఎల్కతుర్తి



రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించామని, దేశానికి రోల్ మోడల్ గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా తరువాయి 12లో

## విజ్ఞప్తి

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ, ఫేస్– 3లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 400 గుడిసెలు తగలబడటం జరిగింది. ఈ గుడిసెలలో బడుగు బలహీనవర్గాల ప్రజలు గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వలన వారి నిత్యావసర వస్తువులు, దాచుకున్న డబ్బులు, బట్టలు, పిల్లల విద్యా సర్టిఫికేట్స్ అన్ని కాలీ బూడిదైనాయి. వారందరూ దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులై వున్నారు. వీరికి మానవతాదృక్పథంతో వస్తురూపంలోనైన, డబ్బు రూపంలోనైన సహకారం అందించాలని విజ్ఞపి. దాతల వివరాలు ఎప్పటికప్పుడు ప్రచురించబడును

ఫోన్‌పే: 9866996737
(రవీంద్రాచారి, భాగ్యమ్మ)

– ఆందోజు రవీంద్రాచారి,
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



# ప్రపంచం
WORLD NEWS

## మే 7న కొత్త పోప్ ఎన్నిక సమావేశం

**లండన్ :** రోమన్ క్యాథలిక్స్ మతగురువును ఎన్నుకునేందుకు మే ఏడో తేదీన కార్డినల్స్ రహస్య సమావేశం జరుగుతుంది. ఈ తుది ఫలితాలు వెల్లడి కావడానికి సుమారు మూడు రోజులు సమయం పట్టవచ్చు. సిస్టైన్ ఛాపెల్ గదిలో జరిగే ఈ రహస్య సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుండి వచ్చే 135 మంది కార్డినల్స్ పాల్గొంటారు. కార్డినల్స్ అంతర్గత సమావేశం ఒక్కసారి ప్రారంభమైన తర్వాత కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకూ బాహ్య ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు ఉండవు. వారంతా రహస్య బ్యాలెట్ ద్వారా కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. కార్డినల్స్ మొత్తం నాలుగుసార్లు కొత్త పోప్‌ను ఎన్నుకునేందుకు ఓటింగ్ చేసే అవకాశం ఉంటుంది. కొత్త పోప్ ఎన్నిక విజయవంతంగా పూర్తికాగానే వాటికన్ సిటీలో బయట పొగ గొట్టం నుండి తెల్లటి పొగ వెలువడుతుంది. పోప్ ఎన్నిక జరిగిందనడానికి ఇది సూచన. ఎన్నికలు జరగకపోతే నల్లటి పొగ చిమ్నీ నుండి వస్తుంది. ఈ విషయం తెలుసుకోవడం కోసం బయట ఎంతోమంది ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటారు.

### మే 8 నుండి 10 వరకూ


# ఉక్రేన్‌లో రష్యా కాల్పుల విరమణ



**మాస్కో :** ఉక్రేన్‌లో రెండు రోజుల పాటు రష్యా కాల్పుల విరమణ ప్రకటించింది. కుర్స్క్‌ను విముక్తి చేశామని, స్వాధీనం చేసుకున్నామని రష్యా ప్రకటించిన నేపథ్యంలో మే 8వ తేదీ అర్ధరాత్రి నుండి మే 10వ తేదీ అర్ధరాత్రి వరకూ ఉక్రేన్‌లో కాల్పుల విరమణ చేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. మాతృభూమికోసం జరిగిన గొప్ప యుద్ధంగా దీనిని ఆయన అభివర్ణించారు. 1942–45లో జర్మనీతో జరిగిన గొప్ప యుద్ధంతో కుర్స్క్‌లో జరిగిన యుద్ధాన్ని పుతిన్ పోల్చి చెప్పారు. అల్‌జజీరా వార్తాసంస్థ ఈ విషయం ప్రకటించింది. ఎందుకంటే మే తొమ్మిదో తేదీన రష్యాలో విజయోత్సవ సభ జరుగుతున్నది. ఈ సభకు ఉత్తర కొరియా సర్వాధినేత కిమ్ జోంగ్ కూడా హాజరవుతున్నారు. బహుశా ఆరోజున రెండు దేశాల సైనికులు ఉమ్మడి కవాతులు నిర్వహించి విజయోత్సవంలో పాల్గొంటారు. కుర్స్క్‌ను విముక్తి చేయడంలో ఉత్తర కొరియా సేనలు గొప్ప పాత్ర నిర్వహించాయని పుతిన్ ప్రశంసించారు. ఇక ఈ విజయోత్సవం తర్వాత ఎప్పుడైనా ఉత్తర కొరియా సేనలు రష్యా నుండి వైదొలగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కిమ్ జోంగ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన ఉత్తర కొరియా వీరోచిత సైనికుల స్మృత్యర్థం ఒక స్మారక చిహ్నం నిర్మిస్తామని ప్రకటించారు. ఈ యుద్ధంలో పాల్గొన్న సైనికుల కుటుంబాలకు తమ దేశం ఎంతో ప్రాధాన్యం ఇచ్చి వారికి ప్రత్యేక రక్షణలు ఇస్తుందని కిమ్ చెప్పారు.

**క్రిమియా అచ్చంగా రష్యాకే?**

యుద్ధ ఒప్పందంలో భాగంగా క్రిమియా ప్రాంతాన్ని రష్యాకు స్వాధీనం చేసేందుకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరిస్తారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రేన్‌లో శాంతి ఒప్పందానికి జెలెన్‌స్కీ, పుతిన్ చాలా చేరువలో ఉన్నారని ట్రంప్ కలవరిస్తున్న తరుణంలో ఆయన ఈ మేరకు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకసార్లు జెలెన్‌స్కీ ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించారు. వాటికన్‌సిటీలో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా జెలెన్‌స్కీతో ట్రంప్ సమావేశమై ఈ ఒప్పందం గురించే ఎక్కువగా చర్చించి ఉంటారని భావిస్తున్నారు. మరోవైపు జెలెన్‌స్కీ నుండి ఏదైనా శుభవార్త వస్తుందని రష్యా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది. రష్యాతో ప్రత్యక్ష చర్చలకు ఉక్రేన్ ఏవైనా సంకేతాలిస్తుందని ఎదురుచస్తున్నట్లు రష్యా అధికార ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ చెప్పారు. వారు కనీసం ఏవైనా చర్యలన్నా తీసుకోవాలన్నారు. లేకపోతే ట్రంప్ ద్వారానైనా పరోక్ష సంకేతాలు వస్తాయని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.



# ఉక్రేన్ యుద్ధంలో పాల్గొన్నాం

కిమ్ ధృవీకరణ

మీ త్యాగాలు ఎన్నటికీ మరచిపోం : పుతిన్

**మాస్కో :** ఉక్రేన్ చెర నుండి కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేసేందుకు తమ సైనిక బలగాలను రష్యాకు అండగా పంపామని ఉత్తరకొరియా ప్రభుత్వం సోమవారంనాడు అధికారికంగా మొదటిసారి ధృవీకరించింది. ఆదివారంనాడు రష్యా ప్రకటించింది. కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేయడంలో ఉత్తర కొరియా సైనికులు ఎంతగానో సహాయం అందజేశారని, వారి భాగస్వామ్యంతో రష్యా సైన్యాలు ఈ విజయం సాధించాయని మొదటిసారి రష్యా బహిరంగ ప్రకటన చేసిన ఒక రోజు తర్వాత ఉత్తర కొరియా కూడా దానిని ధృవీకరించింది. అదేవిధంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ కూడా ఒక ప్రకటనలో ఉత్తర కొరియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉక్రేన్ చేసిన త్యాగాలను ఎన్నటికీ రష్యా మరచిపోదని పేర్కొన్నారు. రష్యా భూభాగాన్ని తమ మాతృభూమిగా భావించిన ఉత్తర కొరియా సైనికులు ప్రాణ త్యాగాలతో రష్యాను రక్షించేందుకు కృషి చేశారని



వెబ్‌సైటులో ఒక ప్రకటన పోస్టు చేశారు. ఉత్తరకొరియా హీరోయిజాన్ని, వారి త్యాగాలను రష్యా ప్రజలు ఎన్నటికీ మరచిపోరని పేర్కొన్నారు. ఈ విధంగా ఉక్రేన్–రష్యాలు పరస్పరం బహిరంగ ప్రకటనలతో ప్రశంసించుకున్నాయి. చారిత్రకంగా రష్యా–ఉత్తరకొరియా మధ్య ఉన్న బంధం గత ఏడాది సైనిక ఒప్పందంతో మరింత బలపడింది. ఐతే కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేశారన్న విషయాన్ని ఉక్రేన్ తిరస్కరించింది. ఇంకా పోరాటం కొనసాగుతోందని పేర్కొంది. తొలుత వెలువడిన సమాచారం ప్రకారం, ఉక్రేన్ యుద్ధంలో పాల్గొనేందుకు కిమ్‌జోంగ్ ప్రాథమికంగా 14,000 మంది సైన్యాలను పంపారు. ఐతే సుమారు 4,000 మంది కొరియా సైనికులు యుద్ధంలో మరణించారని జెలెన్‌స్కీ చెప్పారు. ప్రాణనష్టం తర్వాత మరో 3,000 మంది సైనికులను ఉక్రేన్‌పై యుద్ధానికి ఉత్తర కొరియా తరలించింది. అమెరికా ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం ఉక్రేన్ యుద్ధంలో 1,200 మంది ఉత్తర కొరియా సైనికులు మరణించారని అంచనా. కానీ అటు ఉత్తర కొరియాగానీ, ఇటు రష్యాగానీ ఎంతమంది ఉత్తర కొరియా సైనికులు యుద్ధంలో పాల్గొన్నారన్న విషయం ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఉక్రేన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో ఉత్తర కొరియా సైన్యాలు, చైనా సైన్యాలు రష్యాకు సహకరిస్తున్నాయని, ఈ రెండు దేశాల సైన్యాలూ రష్యా తరపున యుద్ధంలో పాల్గొంటున్నాయని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అనేకసార్లు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను రష్యా ఏనాడూ ఖండించలేదు. కానీ చైనా మాత్రం ఉక్రేన్ అధ్యక్షుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తమ దేశం ఎప్పుడూ శాంతికి, ప్రాదేశిక సమగ్రతలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.

## వచ్చే ఏడాది జూన్‌లోపు బంగ్లా ఎన్నికలు

మహ్మద్ యూనుస్

**ఢాకా :** వచ్చే ఏడాది జూన్ లోపు బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని ఆ దేశా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు మహ్మద్ యూనుస్ చెప్పారు. మొన్నటివరకూ దేశంలో ఎన్నికలు వచ్చే జనవరిలోపు లేదా డిసెంబరు లోపు అని చెబుతూ వచ్చిన యూనుస్ ఇప్పుడు కొత్తరాగం అందుకున్నారు. ఎన్ని సంస్కరణలను ఎక్కువమంది అంగీకరిస్తున్నారు లేదా అంగీకరించడంలేదు అనే విషయంపైనే ఎన్నికల గడువు ఆధారపడి ఉంటుందన్నారు.

సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన పరిధి ఎక్కువగా ఉంటే ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఈ పరిధిని కుదించగలిగితే రాబోయే డిసెంబరు నెలలోనే ఎన్నికలు జరుగుతాయని అల్ జజీరా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యూనుస్ చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడితే వచ్చే ఏడాది జూన్ లోపు పార్లమెంటు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. దేశంలో పార్లమెంటుకు తదుపరి జరిగే ఎన్నికలు బంగ్లాదేశ్ చరిత్రలో ఎన్నడూలేనంత అత్యుత్తమ స్థాయిలో నిర్వహించాలని సంకల్పించామనీ, అందుకు తగినట్లు ఏకాభిప్రాయసాధన, ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తున్నారా? అని ప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదనీ, ఇప్పటివరకూ వారు స్పందించలేదనీ, దీనిపై ఎన్నికల సంఘం ఇతరులు ఎలా స్పందిస్తారో చూడాలన్నారు. తాతాల్కి ప్రభుత్వ పాలనాగడువు పూర్తయిందా? అని ప్రశ్నించగా తాత్కాలిక ప్రభుత్వమే ఇప్పటికీ ఇంకా తమ సమస్యలకు ఒక మంచి పరిష్కారంగా ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. తాత్కాలిక ప్రభుత్వం పదవిలో ఉండకూడదని ఎవ్వరూ కోరుకోవడంలేదన్నారు.

## పిఎల్ఒ కొత్త నాయకుడు హుస్సేన్ అల్ షేక్

**రమల్లా :** పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ వయోవృద్ధుడైపోతూ ఉండటంతో తన స్థానంలో కొత్త నాయకుడి పేరును ఆయన ప్రతిపాదించారు. తన తర్వాత వారసుడుగా ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా హుస్సేన్ అల్ షేక్‌ను నియమించారు. దీర్ఘకాలంగా హుస్సేన్ షేక్ ఆయన వద్ద పనిచేస్తూ అపార అనుభవం గడించారు. ఐతే పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ తరపున ఆయనే ఖచ్చితంగా తదుపరి అధ్యక్షుడు అవుతాడన్న హామీ కూడా ప్రస్తుత పరిస్థితులలో లేదు. ఐతే ఆయన అధ్యక్ష బాధ్యతలు చేపట్టే విషయంలో ప్రధాన పోటీదారుడుగా ముందుపీఠిన ఉండే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుత అధ్యక్షుడు అబ్బాస్‌కు 89 సంవత్సరాల వయసు. పాలస్తీనా ప్రజలకు నిజమైన అధీకృత వ్యవస్థగా ప్రపంచవ్యాప్తంగా పిఎల్‌ఓకు గుర్తింపు ఉంది. పిఎల్ఓ కార్యనిర్వాహకవర్గంలో 16 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో అల్ షేక్ కూడా ఒకరు. మరోవైపు గాజాలో ఆహార కొరతవల్ల ప్రజలు కరువు పరిస్థితుల్లోకి వెళ్ళిపోయారు. మార్చి రెండో తేదీ నుండి పాలస్తీనాలోకి ఆహారం, ఇతర సరఫరాలు రాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. పాలస్తీనాలో 20 లక్షలమంది ప్రజలు బయట దేశాల నుండి వచ్చే ఆహార సరఫరాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

## యెమెన్‌లో అమెరికా దాడి

68 మంది ఆఫ్రికా శరణార్థులు మృతి

**సనా :** యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా అమెరికా చేసిన తాజా దాడుల్లో 68 మంది మరణించారు. ఐతే వీరంతా ఆఫ్రికాకు చెందిన వలస శరణార్థులు. వీరందరికీ హౌతీలు శరణార్థ శిబిరంలో ఆశ్రయం కల్పించారు. అమెరికా సోమవారం చేసిన దాడుల్లో ఈ వలస ప్రజలు మరణించారు. హౌతీల ఆధీనంలో ఉన్న వాయువ్య యెమెన్‌లో జరిగిన ఈ దాడుల్లో మరో 40 మంది గాయపడ్డారు. ధ్వంసమైన భవంతులు, ఆ శిథిలాల్లో మరణించి పడి ఉన్న ప్రజలు, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్న దృశ్యాలను అల్ మషీరా ఛానల్ చూపించింది. ఐతే ఈ చర్యపై ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం, అమెరికా సైనికవర్గాలు వెంటనే ఎలాంటి ప్రకటనలూ చేయలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఆదేశాల మేరకు మార్చి 15వ తేదీ నుండి యెమెన్‌లోని హౌతీలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటివరకూ 800 హౌతీ లక్ష్యాలను దెబ్బతీశామని అమెరికా సైన్యం ప్రకటించిన కొద్ది గంటలకే హౌతీలవైపు నుండి ఈ వార్తలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా బీరూట్ లక్ష్యంగా ఇజ్రాయెల్ కూడా సోమవారంనాడు దాడులు చేసింది.



**ఇజ్రాయెల్ దాడిలో 27 మంది మృతి**

గాజాలో ఇజ్రాయెల్ సోమవారం చేసిన దాడుల్లో 27 మంది మరణించారు. ఏప్రిల్‌నెలలో ఇజ్రాయెల్ సైన్యం విరామం లేకుండా రోజువారీ దాడులు చేస్తూ కనీసం 20 లేదా 30 మంది పాలస్తీనియన్లను చంపుతున్నది. మరోవైపు మార్చి రెండో తేదీ నుండి ఇజ్రాయెల్ సైన్యం అమలు చేస్తున్న ఆంక్షల కారణంగా గాజా ప్రాంతంలో ఇరవై లక్షలమంది ప్రజలు నీరు, ఆహారం లేక అల్లాడుతున్నారు. వారు ఆహారంకోసం వేటాడుతున్నారు. బయట నుండి సరఫరాలు రాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుపడి కరువు పరిస్థితులు సృష్టించింది. ఇది ఇజ్రాయెల్ యుద్ధ వ్యూహంలో ఒక భాగమని పాలస్తీనా ప్రభుత్వం విమర్శించింది.

## కెసిఆరే విలన్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కెసిఆర్‌కు గుండెల్లో గుబులు మొదలైందన్నారు. కెటిఆర్, హరీష్‌రావు, కవిత ఆడుతున్న మూడు ముక్క లాటతో కెసిఆర్‌కు మతి భ్రమించిందని, తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్ శకం ముగిసిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోతే దరిద్రం పోయిందని ప్రజలు ఆనందం గా ఉన్నారన్నారు. కెసిఆర్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో విధ్వంసం పాలైందని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, దేశ చరిత్రలో అతి తక్కువ కాలంలో ఎక్కువ దోచుకున్న కుటుంబం కెసిఆర్‌దేనని విమర్శించారు. తెలంగాణలో ఆర్థిక విధ్వంసం సృష్టించి పలాయనం చిత్తగించిన కెసిఆర్ మాటల్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన కెసిఆర్‌కు జన్మభూమి పేరిట తెలంగాణ పేరు పలకడం విడ్డూరమన్నారు. ఉద్యమ జెండాను దింపితే రాళ్లతో కొట్టి చంపండి అన్న కెసిఆర్‌కు పదేళ్లలో అమరవీరులు త్యాగం, ఉద్యమకారులు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ భిక్షతో కెసిఆర్ సిఎం అయ్యారని, తిన్నింటి వాసాలు లెక్క పెట్టడం, తెలంగాణ సెంటి మెంట్‌ను వాడుకోవడం కెసిఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రైతుబంధు పేరుతో దళారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూములు కెసిఆర్ అండ్ కో అప్పనంగా దోచిపెట్టారన్నారు.

లాభాల్లో ఉన్న తెలంగాణాను రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కెసిఆర్‌ను ప్రజలు క్షమించరన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయని, సభలో అసలు మహిళలే కనిపించలేదని, వరంగల్ సభలో కెసిఆర్ ప్రసంగంలో పసలేదని, బిసి కుల గణన, ఎస్‌సి వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కెసిఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేష్‌కుమార్ ప్రశ్నించారు. కుటుంబ కొట్లాట వేగలేక రజతోత్సవ సభ పేరిట కెసిఆర్ హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. టిఆర్ఎస్ పార్టీ పేరులోంచి తెలంగాణ పదాన్ని తొలగించినప్పుడు కన్నతల్లిని జన్మభూమిని మించిన స్వర్గం లేదనే మాట కెసిఆర్‌కు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బిజెపిపై కెసిఆర్ విమర్శలు నెమలి పిచ్చంతో కొట్టినట్లు ఉందని మహేష్‌కుమార్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్ర పన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయన్నారు. కెసిఆర్ ప్రసంగంతో బిజెపి, బిఆర్ఎస్ ఒకటేనని మరోసారి రుజువైందన్నారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి జాతీయ స్థాయిలో రాష్ట్రంలో అస్తిత్వం కోల్పోయిన కెసిఆర్ అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని దోచుకుని బిజెపికి సాగిలపడి రాష్ట్రానికి తీవ్ర అన్యాయాలు చేశారన్నారు. కెసిఆర్ పది ఏళ్లలో చేయాలేనిది కాంగ్రెస్ 15 నెలల్లో చేసి చూపిందని, బిఆర్ఎస్ పదేళ్లలో 60 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 60 వేల కుపైగా ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన, ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీని అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో మహిళలు సంతోషంగా ఉన్నారని, అందుకే మహిళలు బిఆర్ఎస్ మీటింగ్‌కు రాలేదన్నారు.

## మీ స్పందనేంటీ?

(మొదటి పేజీ తరువాయి)

మోపబడుతున్నాయి అని జస్టిస్ బిఆర్.గవాయ్ జ్యుడీషియరీపై ఇటీవలి ఆరోపణల దాడులను స్పష్టంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరై తన వాదనలు వినిపించారు. ప్రభుత్వం దీనిని వ్యతిరేక వ్యాజ్యంగా పరిగణించడం లేదని ధర్మాసనానికి స్పష్టం చేశారు.'దయచేసి ఇక్కడ పర్యవేక్షించండి. 'వాక్‌స్వాతంత్ర్యాన్ని సమతుల్యం చేసే ఆర్టికల్ 19 (2) ఏదైతే ఉందో దాని పట్ల తగిన జాగ్రత్త వహించడం ద్వారా మేము బయటకు వస్తాం' అని తుషార్ మెహతా అన్నారు.

కొన్ని విషయాలు అసభ్యకరమైనవే కాకుండా 'వికృతమైన వక్రబుద్ధితోకూడినవి' కూడా అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. దీనికి సంబంధించి కొన్ని నిబంధనలు ఉనికిలో ఉన్నప్పటికీ మరికొన్ని ఆలోచనలు కూడా ఉన్నాయన్నారు. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వాదిస్తూ ఇది విరుద్ధ వ్యాజ్యం కాదని, ఓటిటి, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో లైంగిక అసభ్యకరమైన కంటెంట్ ప్రసారంపై నిషేధం విధించాలని లేవనెత్తిన 'ఒక తీవ్రస్థాయి ఆందోళన' అని అన్నారు. ఆ కంటెంట్‌ను ఎలాంటి తనిఖీలు లేకుండా, పరిమితులు విధించకుండా ప్రదర్శించబడుతున్నాయని పిటిషనర్ల న్యాయవాది విష్ణు శంకర్ జైన్ చెప్పారు. దీనిపై జస్టిస్ బిఆర్.గవాయ్ స్పందిస్తూ 'మిస్టర్ సొలిసిటర్, దీనిపై మీరు ఏదో ఒకటి చేయాలి' అని మెహతాకు చెప్పారు.

సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలు వీటిని ఎక్కువగా బహిర్గతం చేస్తున్నారని చెప్పారు. కొంత కంటెంట్ వికృతంగా ఉన్న మాట వాస్తవమేనని అంగీకరిస్తూ గౌరవనీయ వ్యక్తులు కూడా కలిసి కూర్చుని చూడలేరని తుషార్ మెహతా ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కార్యక్రమాలు కేవలం 18ఏండ్ల వయసు పైబడిన వారికి మాత్రమే కానీ వాటిని నియంత్రించలేకపోతున్నామన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం పిల్లలు సెల్‌ఫోన్లు వాడటాన్ని ప్రస్తావించింది. 'వారు (పిల్లలు) బాగా సెల్‌ఫోన్లకు అలవాటు పడ్డారు. వారు సరైన వెబ్‌సైట్‌కు చేరుకుంటే మంచిదే' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి సమాధానమిచ్చారు. ధర్మాసనం 'ఆ విషయమై చివరితేదీన' మనం పిటిషనర్ల న్యాయవాది జైన్‌కు చెప్పాము. ఇది లెజిస్లేచర్ లేదా ఎగ్జిక్యూటివ్‌కు సంబంధించినది' అని గుర్తుచేసింది. ఇటీవల ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్, బిజెపిఎంపి నిషికాంత్ దూబే ఇరువురూ న్యాయవ్యవస్థ శాసన, కార్యనిర్వాహక వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నదని న్యాయవ్యవస్థపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయడాన్ని ధర్మాసనం స్పష్టంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.అనంతరం కేంద్రానికి, ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్, ఇతరులకు నోటీసులు జారీచేయాలన్న పిటిషన్ల అభ్యర్థనలపై స్పందించాలని నోటీసులు జారీచేయనున్నట్లు ధర్మాసనం చెబుతుండగా ఇతరులకు నోటీసులు జారీచేయాల్సిన అవసరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి విన్నవించగా వారిని కోర్టు ముందు ఉండనివ్వండి అని జస్టిస్ బిఆర్.గవాయ్ చెప్పారు. వారిపై కూడా సామాజిక బాధ్యత ఉంది కదా అని జస్టిస్ గవాయ్ అన్నారు.

## ఎన్నికలు ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

ఆకస్మిక ఎన్నికలు ప్రకటించారు. కెనడాదేశాన్ని అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని, కెనడాదేశ ప్రజలు అందుకు ఎంతగానో సుముఖంగా ఉన్నారనీ ట్రంప్ అధికారంలోకి వచ్చాక నోరుపారేసుకున్నారు. దీంతో ఈ ఎన్నికల ప్రచారంలో అధికారపార్టీ దీనిని ప్రధానాంశంగా చేసుకుని ప్రయోజనం పొందుతున్నది. కెనడా ప్రజలు దేశ ఐక్యతారాగం వినిపిస్తున్నారు.

2015 నుండి రెండు విడతలుగా అధికారంలో కొనసాగుతున్న లిబరల్‌పార్టీ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఈ ఏడాది జనవరిలో పదవికి రాజీనామా చేశారు. ఐతే 2023 నుండి దేశంలో పుంజుకుంటున్న కన్జర్వేటివ్‌పార్టీ ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత వెనకబడింది. ట్రంప్ ప్రకటనల జోరుతో లిబరల్ పార్టీ ఒపీనియన్ పోల్స్‌లో భారీస్థాయిలో ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని తన రేటింగ్ పెంచుకోవడం ప్రారంభించింది. అందువల్ల ఈ పార్టీకే ఎన్నికల్లో ఎక్కువ గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయని అంచనావేస్తున్నారు. కన్జర్వేటివ్‌పార్టీ తరపున పియర్ పోయిలీవ్రే, ఫెడరల్ పొలిటికల్ పార్టీ బ్లాక్ క్యుబెకోయిస్ పార్టీ తరపున వైవ్స్–ఫ్రాంకోయిస్ బ్లాంఛెట్‌లు ప్రధానమంత్రి పదవికోసం మార్క్ కార్నీతో పోటీపడుతున్నారు. 2021 సెప్టెంబరులో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్‌పార్టీ (ఎల్‌పిసి) కి 160 సీట్లు, 32.62 శాతం ఓట్లు లభించగా ప్రస్తుతం ఆ పార్టీ తరపున 152 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. గత ఎన్నికల్లో 119 స్థానాలు గెలుచుకున్న కన్జర్వేటివ్‌పార్టీ (సిపిసి) ఈసారి గట్టి పోటీ ఇస్తోంది. బ్లాక్ క్యుబెకోయిస్‌పార్టీ (క్యూబి) కి 2021లో 32 సీట్లు మాత్రమే లభించాయి. ప్రస్తుత ప్రధానమంత్రి మార్క్ జోసెఫ్ కార్నీ ఆర్థిక రంగ నిపుణుడు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల ప్రకటన చేశారు. ట్రంప్‌కు తగిన గుణపాఠం చెబుతామని ప్రతిజ్ఞ చేశారు.

## మాపై నిందలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షళన చేశామని, అధికారుల విషయంలో కొంత సమన్వయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అధికారులు సంపాదన మార్గంగా ఉన్నారని, అలాంటి వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా వివిధ అంశాలపై పట్టు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భూభారతి, ధరణి అంశాలపై నవీన్ మిట్టల్‌కు పూర్తి అవగాహన ఉందని సిఎం ఉదహరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారుఎంఎల్‌ఎలు ప్రజల్లోకి వెళ్ళండి

కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళతాయని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సిఎల్‌పిలో చెప్పినా ఎంఎల్‌ల పనితీరు మారలేదని, ఎంఎల్‌ఎలు హైదరాబాద్ చుట్టూ తిరగడం సరైంది కాదన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. తనను నమ్మిన వారికి వెన్నంటి ఉంటానని, నమ్మని వారి బాధ్యత తనపై ఉండదన్నారు. కొంత మంది పార్టీ నాయకులకు పదవులు రాలేదని నోరుజారుతున్నారని, అలాంటి వాళ్లకు అవకాశాలు ఉండవని, ఇష్టానుసారంగా మాట్లాడితే నేతలే నష్టపోతారని సిఎం హెచ్చరించారు. తాను ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని, కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానన్నారు. అద్దంకి దయాకర్కు ఎంఎల్‌సి ఇస్తానని చెప్పానని, అనుకున్న ప్రకారమే ఇప్పించానన్నారు. కెసిఆర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు తాను వెళ్లి పరామర్శించానని, ఎవరూ చావును కోరుకోరు కదా అన్నారు. అరెస్టుల విషయంలో తొందరపడితే ఎపిలో ఏం జరిగిందో చూశామని సిఎం వ్యాఖ్యానించారు.

## శాంతి చర్చల కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకులు, 2005లో నక్సలైట్లతో జరిపిన చర్చలలో క్రియాశీల పాత్ర పోషించిన కె.జానారెడ్డితో సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కేశవరావు కూడా పాల్గొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చల పునరుద్ధరణ, కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రక్రియకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలు, ఆపరేషన్ కగార్ తదితర కీలక అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డి వారితో చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో మావోయిస్టులతో శాంతి చర్చల పునరుద్ధరణ, కాల్పుల విరమణ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో చర్చలు జరిగినప్పుడు హోంమంత్రిగా పనిచేసిన జానారెడ్డి అనుభవాన్ని ఈ సందర్భంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. శాంతి చర్చల కమిటీ ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలోనే జానారెడ్డి సలహాలు తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తాజా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో శాంతి చర్చల సమయంలో ఉమ్మడి ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా ఉన్న దిగ్విజయ్ సింగ్‌తో కూడా సిఎం రేవంత్ ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. మావోయిస్టుల సమస్యను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా పరిగణిస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

**ఆపరేషన్ కగార్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి**

'ఆపరేషన్ కగార్'పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, ఈ విషయంపై పార్టీలో జాతీయ విధానం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జానారెడ్డిలతో శాంతి చర్చలపై సమావేశం అనంతరం ఆయన తనను కలిసిన మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలపై రేవంత్‌రెడ్డి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు.

రేవంత్‌రెడ్డితో ఆదివారం భేటీ అయిన శాంతి చర్చల కమిటీ సభ్యులు మావోయిస్టులతో శాంతి చర్చలు, ఆపరేషన్ కగార్‌కు సంబంధించిన పలు విషయాలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయడానికి తమ కేబినెట్‌లోని మంత్రులతో చర్చించిన తర్వాతే ఓ నిర్ణయానికి వస్తామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## గీత దాటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ సిడబ్ల్యుసి 2025 ఏప్రిల్ 24న సమావేశమై పహల్గామ్‌లో దారుణ ఉగ్రదాడిపై తీర్మానం చేసిందని గుర్తు చేశారు. అదే రోజు సాయంత్రం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పార్టీ అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు తామంతట తాముగా మీడియాతో మాట్లాడారని, వారు కాంగ్రెస్ అభిప్రాయాలను ప్రతిబింబించలేదని చెప్పారు. అత్యంత సున్నితమైన ప్రస్తుత సమయంలో సిడబ్ల్యుసి తీర్మానం, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ అభిప్రాయాలు, అధీకృత ఎఐసిసి ఆఫీస్ బేరర్‌ల అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరిగా భావించాలని పేర్కొన్నారు. ఈ మేరకు జైరామ్ రమేశ్ సోమవారం నాడు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. తరువాత ఆయన పిటిఐతో మాట్లాడుతూ పరిస్థితులను బట్టి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు పార్టీ వైఖరిని తెలియపరుస్తుంటారని, ఇతర నాయకులు పార్టీ వైఖరిని వ్యక్తం చేయాలని లేదంటే సున్నితమైన ఈ అంశంపై వ్యాఖ్యానించకుండా ఉండాలని అన్నారు.

## అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

పదిమందికి పద్మభూషణ్ పురస్కారాలు అందజేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జనవరి 25వ తేదీన కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన మొత్తం 139 మంది దేశ ప్రముఖులకు పద్మ అవార్డులు ప్రకటించగా, మిగిలినవారికి మలి విడతలో అందజేస్తారు. మరణించిన ప్రముఖులు సుజుకీ మోటార్స్ మాజీ అధిపతి ఒసాము సుజుకీ (పద్మ విభూషణ్), ప్రముఖ గాయకుడు పంకజ్ ఉద్ధాస్ (పద్మభూషణ్), బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్‌మోదీ (పద్మభూషణ్)ల తరపున వారి బంధువులకు ఈ పురస్కారాలు అందజేశారు. మలయాళ రచయిత, చిత్ర దర్శకుడు ఎం.టి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం)కు పద్మవిభూషన్ అవార్డు లభించింది. ప్రముఖ నటుడు శేఖర్ కపూర్, వాయులీన కళాకారుడు లక్ష్మీ నారాయణ సుబ్రమణియం, మాజీ హాకీ ఆటగాడు పి.ఆర్.శ్రీజేశ్,తమిళ నటుడు ఎస్.అజిత్‌కుమార్, పంకజ్ పటేల్ (ఛైర్మన్, జైడస్ లైఫ్ సైన్సెస్),భారత్–అమెరికన్ ఇంజనీరు వినోద్ ధామ్‌లకు పద్మవిభూషణ్ పురస్కారాలు అందజేశారు.

## ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

బిఎస్ జగ్జీవన్ కుమార్, హెచ్ఆర్‌సి ఛైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్, హెచ్ఆర్‌సి సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్‌ను నియమించింది. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా వీరి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలకు గత శనివారం గవర్నర్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి వైస్ చైర్‌పర్సన్‌గా శాంతికుమారి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరో రెండు రోజుల్లో (ఈనెల 30న) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ పొందనున్న శాంతికుమారిని హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి) వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ (డిజి)గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈనెల 30వ తేదీతో పదవీవిరమణ పొందనుండగా, కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. దీంతో పదవీవిరమణ పొందనున్న శాంతికుమారిని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## భూదాన్ భూముల కుంభకోణంలో.. కదులుతున్న డొంక

రియల్టర్ల ఇళ్లపై ఇడి దాడులు
ఐఎఎస్, ఐపిఎస్, బిఆర్ఎస్ నేతలపై ఆరోపణలు
తెలంగాణలో బయటపడ్డ అతి పెద్ద కుంభకోణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూదాన్ భూముల కుంభకోణం కేసులో డొంక కదులుతోంది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు సోమవారం రంగారెడ్డి, హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్ల ఇళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్, యాకుత్‌పురా ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో అనేక కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను ఇడి అధికారులు సేకరించారు. ఈ కేసులో ఇడి అధికారులు రూ.1.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రూ.2.89 కోట్లు విలువైన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దాడుల సమయంలో పాతబస్తీలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇడి దాడులని తెలియగానే అంద రు ఊపిరి పీల్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న 103 ఎకరాల భూదాన్ భూముల అక్రమ విక్రయాలకు సంబంధించినది. ఈ భూములు అసలు బూదాన్ యజ్ఞ బోర్డు ఆధీనంలో ఉండగా, అవి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించబడ్డాయి. ఈ భూముల విలువ అనేక కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఈ ఉదంతంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రైవేట్ డెవలపర్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ భూముల విక్రయాల్లో నకిలీ పత్రాలు సృష్టించి, అవి ప్రభుత్వ భూములుగా చూపించి, ప్రైవేట్ కంపెనీలకు విక్రయించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఐఎఎస్ అధికారి డి. అమోయ్ కుమార్, అప్పటి తహసీల్దార్ ఆర్.పి. జ్యోతి, ఆర్డీవో వెంకటాచారి తదితరులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాగే బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఏ మర్రి జనార్ధన్ రెడ్డి, వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డి, ఇతర డెవలపర్లు కూడా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇడి ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకుని, భూదాన్ భూముల విక్రయాలపై స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసింది. అలాగే, ప్రభుత్వం ఈ కేసును పరిశీలించడానికి ముగ్గురు ఐఎఎస్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. భూదాన్ యజ్ఞ బోర్డు కూడా స్వతంత్ర విచారణ ప్రారంభించి, సంబంధిత భూములపై పట్టా పాస్‌బుక్‌లను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

ఈ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. ఇడి, భూదాన్ యజ్ఞ బోర్డు, తెలంగాణ హైకోర్టు చర్యల ఆధారంగా, భవిష్యత్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లా నాగారం పరిధిలోని సర్వే నంబర్ 181, 182లో ఉన్న 102.2 ఎకరాల భూదాన్ భూములపై వివాదం నెలకొంది. ఈ భూముల్లో 50 ఎకరాలు భూదాన్ బోర్డుకు చెందినవిగా పేర్కొనబడినప్పటికీ, అవి ఖాదురు న్నీసా అనే మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేయబడినట్లు ఇడి గుర్తించింది. ఈ ప్రక్రియలో ఆర్డీవో, తహసీల్దార్, ఇతర అధికారులు అన్యాయంగా వ్యవహరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇడి దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**భూములు కొనుగోలు చేసిన అధికారుల పూర్తి జాబితా**

1) బత్తుల హేమలత (C/o బత్తుల శివధర్ రెడ్డి ఐపిఎస్ 20 గుంటలు)
2) ప్రియాంక రతన్ (C/o దివంగత రాజీవ్ రతన్ ఐపిఎస్ 16 గుంటలు)
3) రవి గుప్త (ఐపిఎస్ 16 గుంటలు)
4) ముదిరెడ్డి నితీష్ రెడ్డి (S/o మహేందర్ రెడ్డి ఐపిఎస్ 20 గుంటలు)
5) తాటిపర్తి పావని రావు (C/o టి.ప్రభాకర్ రావు ఐపిఎస్ 16 గుంటలు)
6) రేఖ షరాఫ్ (C/o ఉమేష్ షరాఫ్ ఐపిఎస్ 16 గుంటలు)
7) రాజర్షి సాహా (ఐపిఎస్ 8 గుంటలు)
8) స్వాతి లక్రా (ఐపిఎస్ 16 గుంటలు)
9) మిట్టీ సతితి సుహానా (C/o మిట్టీ శ్రీనిబసు 8 గుంటలు)
10) నందిని మాన్ (C/o విక్రమ్ సింగ్ మాన్ ఐపిఎస్ 8 గుంటలు)
11) డాక్టర్ జ్ఞాన్ ముద్ర (C/o సోమేష్ కుమార్ IAS 20 గుంటలు)
12) బి.కె. రాహుల్ హెగ్డే (స్వయం8 గుంటలు)
13) సవ్యసాచి ప్రతాప్ సింగ్ (C/o గోవింద్ సింగ్ 8 గుంటలు)
14) జి. ఓం అనిరుధ్ (C/o సుధీర్ బాబు ఐపిఎస్ నాట్ స్పెసిఫైడ్)
15) ఇందు రావు కావేటి (C/o లక్ష్మీ నారాయణ రావు కావేటి 16 గుంటలు)
16) న్యాలకొండ సింధు రెడ్డి (C/o న్యాలకొండ ప్రకాష్ రెడ్డి20 గుంటలు)
17) ఐశ్వర్య రాజ్(C/o వికాస్ రాజ్ 20 గుంటలు)
18) వెన్నవెల్లి రాధిక(C/o కమలాసన్ రెడ్డి 16 గుంటలు)
19) రీతా సుల్తానా (C/o సందీప్ కుమార్ సుల్తానా 20 గుంటలు)
20) వసుంధర సిన్హా (C/o అంజనీ కుమార్ 20 గుంటలు)
21) ముత్యాల వినీల (C/o స్టీఫెన్ రవీంద్ర ఐపిఎస్ 8 గుంటలు)
22) అజిత్ కుమార్ మొహంతి (C/o ఖేస్త్రబాసి మొహంతి 20 గుంటలు)
23) నవీన్ మిట్టల్ (సెల్ఫ్ 20 గుంటలు)
24) సౌమ్య మిశ్రా (సెల్ఫ్ 16 గుంటలు)
25) రాహుల్ బుసి రెడ్డి (S/o బి. జనార్దన్ రెడ్డి ఐఎఎస్ 16 గుంటలు)
26) తరుణ్ జోషి (సెల్ఫ్ ఐపిఎస్ 16 గుంటలు)
27) పీర్ల వరుణ్ (పీర్ల విశ్వ ప్రసాద్ 16 గుంటలు)
28) తోట శ్రీనివాసరావు (S/o తోట సాయి బాబా ఐపిఎస్ నాట్ స్పెసిఫైడ్)
29) కొండూరు శ్రీనాథరాజు (S/o కొండూరు సత్యనారాయణ 20 గుంటలు)
30) మహేష్ భగవత్ (సెల్ఫ్16 గుంటలు)
31) రేణు గోయల్ (కమాండర్ జితేందర్ కుమార్ గోయల్ 20 గుంటలు)
32) అజయ్ జైన్ (సెల్ఫ్ 20 గుంటలు)
33) అమిత కుమార్ (C/o అనిల్ కుమార్ 20 గుంటలు)

## మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం వెంటనే అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వంతీసుకువస్తున్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన జరిగే సమ్మెలో వంట కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమపావని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కేవలం రూ.3వేలు మాత్రం వేతన ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వమైతే కేవలం రూ.600లు మాత్రమే ఇస్తున్నారని, ప్రధాన మంత్రి అన్నీ మాట్లాడుతారు కానీ వంట కార్మికులు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కనీస వేతనాలు అందించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. గత 8 నెలలుగా వంట బిల్లుల, అల్పాహారం బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు, పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. మేడే సందర్భంగా ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటాల రాములు, తోపునూరి చక్రపాణి, కార్యదర్శులు ధర్మల రామ్మూర్తి, మీస లక్ష్మణ్, ముంతాజ్, నిమ్మటూరి రామకృష్ణ, పోలపోలు వెంకటేష్, రాష్ట్ర సమితి సభ్యులు, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, జాడే నాందేవ్, పద్మ, సరస్వతి, సుమలత, యశ్వంత్, ఇస్రు, రేఖ, కాంతమ్మ, సోఫియా, సంఘీత, సరిత, సాయమ్మ, లక్ష్మి , పాల్గొన్నారు.

## మూడు నెలల్లో 250 మంది మావోయిస్టులు లొంగుబాటు

ఐజి చంద్రశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోందని నార్త్ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో మావోయిస్టుల ఉనికి పెద్దగా లేదని అన్నారు. ఆపరేషన్ కగార్ ప్రభావం కూడా తక్కువే అని చెప్పారు. మూడు నెలల్లో 250 మావోయిస్టులు లొంగిపోయారని స్పష్టం చేశారు. అయినా ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులో తెలంగాణ పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల వరుసగా లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించామని అన్నారు. వారు తిరిగి మావోయిస్టు పార్టీ వైపు పోకుండా ఉండేందుకు నిఘా పెట్టామని తెలిపారు. సరిహద్దులో పెట్రోలింగ్‌తో పాటు తనిఖీలు విస్తృతం చేశామని తెలిపారు.

## 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలి

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి : బి.వి.రాఘవులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న మారణ హోమాన్ని తక్షణమే నిలిపివేయాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై కొనసాగిస్తున్న ఈ హత్యా కాండను తీవ్రంగా ఖండిస్తున్నామని, మావోయిస్టుల చర్చల ప్రతిపాదికన మేరకు ఆ పార్టీ ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలను జరపాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సోమవారం సిపిఐ(ఎం) రాష్ట కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం అప్రజాస్వామికమన్నారు. సైన్యం తమ సొంత ఆస్తిగా ఆయన మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని, మావోయిస్టులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీలపై జరుగుతున్నదాడిని ఆపేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 370 పేజీల ఎన్‌డిఎస్‌ఎ నివేదిక తీవ్రమైన లోపాలను, పలు కీలక అంశాలను ఎత్తిచూపిన ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అందులో దానిపై సమగ్రంగా చర్చించాలని కోరారు. జనాభా ప్రాతిపదిక డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలతో పాటు పంజాబ్, పలు రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇది జనాభా నియంత్రణను విజయవంతంగా చేపట్టిన రాష్ట్రాలను నేరం చేసినట్టుగా చూపి సీట్లు తగ్గించడమే అవుతుందని, డీలిమిటేషన్ వెనుక బిజెపి రాజకీయ లబ్ది ఉందని విమర్శించారు. ఆయా రాష్ట్రాల్లో ఇప్పుడున్న నిష్పత్తి ప్రకారం ఎంపి సీట్లనుపెంచాలన్నారు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక తరగతుల వారిని సామాజిక అణచివేతలకు, సాంఘిక బహిష్కరణకు గురిచేస్తున్న విడిసిలపై రాష్ట్ర ప్రభు త్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాళ్లరాంపూర్లో రూ.5లక్షలు ఇవ్వలేదనే కారణంతో గీతకార్మికులను వీడీసీ గ్రామ బహిష్కరణ చేయడం, దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం క్షమించరాని నేరమన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ పరిధిలో 700 మంది పేదలకు ప్రభుత్వం ఇండ్ల పట్టాలిచ్చిందని, వాటిలోకి పేదలు వెళ్లకుండా ఆర్ఎఫ్ సి యాజమాన్యం అడ్డుకోవడం సరిగాదని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని కోరారు.

## బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుండి కిష్టాపురం వరకు నీరు అందించాలి

సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చెందాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం దృఢసంకల్పంతో కృషి చేస్తుందని అదేవిధంగా కరువు కాటకాలు ఫ్లోరైడ్ మహమ్మారితో వెనుకబడ్డ మునుగోడు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించనున్న అదనపు బ్లాక్‌లకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యం పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి మునుగోడు మండలం కిష్టాపురం చెరువు వరకు 15కిలోమీటర్లు కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతిపాదన ఉందన్నారు. ప్రాజెక్టు ప్రతిపాదన ప్రకారం కృష్టాపురం చెరువు వరకు బ్రాహ్మణ ప్రాజెక్టు కెనాల్ ద్వారా నీరు అందించడం ద్వారా ఆప్రాంతంలో ఉన్న ఐదు గ్రామాలలో వేల ఎకరాల భూమి సాగుతో పాటు ప్రజలకు తాగునీరు అందించిన వారు అవుతారని అందుకు ప్రభుత్వం కిష్టాపురం వరకు వెల్లంల ప్రాజెక్టు నీరు అందించాలని కోరారు. అదేవిదంగా ఉమ్మడి నల్లగొండలో జిల్లా కలెక్టరేట్‌లో ప్రజలకు కావలసినటువంటి సౌకర్యం కోసం అదనపు భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం అభినందనీయం అన్నారు. పరిపాలన అనేది చాలా ముఖ్యమైంది ప్రభుత్వ పనుల కోసం వస్తున్న ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో పనులు సులువుగా సాగుతాయని ఆ దిశగా అదనపు భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్న జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డిలకు వ్యక్తిగతంగా, జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ వస్తే ప్రజలు ఏదైతే ఆశించామో ప్రజల ఆలోచనలను అమలు చేయడంలో గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని పెండింగ్ ప్రాజెక్టులో పూర్తి చేయడంలో తీవ్రమైన అన్యా యం చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంకు వివిధ ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన ప్రజలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాలలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలకు పట్టలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అదేవిధంగా నిర్మాణంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి ఇవ్వాలని కోరారు.

## కెసిఆర్ తప్పల మీద తప్పలు చేశారు: మాజీ ఎంపి విహెచ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ తప్పుల మీద తప్పులు చేశారని మాజీ ఎంపి వి.హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో కెసిఆర్ పదేళ్లు డిక్టేటర్ పాలన చేశారని తెలిపారు. పార్టీలో ఉన్న వాళ్ళు వెళ్ళిపోతారేమో అని భయపడి కెసిఆర్ వరంగల్‌లో బిఆర్ఎస్ సభ పెట్టారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్‌పై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా..? అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. కెసిఆర్‌ను ప్రజలు తిరస్కరించడం వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రగతి భవన్, సెక్రటేరియట్ కట్టాలనే మంచి ఆలోచన కెసిఆర్‌కి వచ్చింది, కానీ ప్రజలను ఎవ్వరిని అక్కడికి రానివ్వలేదన్నారు. అప్ కి బార్ కిసాన్ సర్కార్ అని మహారాష్ట్ర వెళ్లి కెసిఆర్ కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఏం గతి పట్టిందో ఆయన తెలుసుకోవాలన్నారు. హర్యానా, పంజాబ్ వెళ్లి డబ్బులు పంచి వచ్చాడని కూడా ఆరోపించారు. ఆయన హయంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేశారని హనుమంతరావు గుర్తు చేశారు. యూత్ కాంగ్రెస్‌లో కెసిఆర్, చంద్రబాబు నా దగ్గర పని చేశారని వాళ్లకు సిఎం అయ్యే అవకాశాలు వచ్చాయని తనకు రాలేదని అన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ముస్తాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం మరో అంతర్జాతీయ వేడుకలకు సిద్ధం అవుతోంది. 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి హైదరాబాద్ నగరం అన్ని ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేస్తోంది. మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నగరంలో ఈ ప్రతిష్ఠాత్మకమైన అందాల పోటీలు జరగనున్నాయి. ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 140 దేశాలకు చెందిన అందమైన మహిళలు తరలిరానున్నారు. పోటీలో పాల్గొనే కంటెస్టెంట్స్ మే 6,7 తేదీల్లో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కాగా మిస్ వరల్డ్ పోటీల ప్రాముఖ్యతను చాటేందుకు ప్రస్తుత మిస్ వరల్ క్రిస్టినా పిస్కోవాతో పాటు మిస్ ఇండియా 2023 విజేత నందిని గుప్తా ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పోటీలు ప్రారంభం కావడా నికి కేవలం 8 రోజులే సమయం ఉండటంతో, ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. నగరంలో అంతర్జాతీయ స్థాయికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచంలోని అందమైన మహిళలందరూ ఒకే వేదికపై సందడి చేయనున్న ఈ పోటీలు హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయి. ఈ అద్భుతమైన వేడుక కోసం నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికపై నేడు మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదికపై మంగళవారం ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనుంది. రాష్ట్ర సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఇరిగేషన్ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికలోని అంశాలను మీడియాకు వెల్లడించనున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయగా మేడిగడ్డ బ్యారేజీ అభివర్ణించారని, అయితే అది వారి హయాంలోనే పనికి రాకుండా పోయిందని, ఇందుకు సంబంధించి ఎన్‌డిఎస్‌ఎ తన తుది నివేదికలో పొందపర్చిన పూర్తి అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## టిజిఇఆర్‌సి సభ్యులుగా రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావు నియామకం

ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టిజిఇఆర్‌సి) సభ్యులుగా రఘు కంచర్ల, (టెక్నికల్) చెరుకూరి శ్రీనివాస రావు(ఫైనాన్స్)లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తెలంగాణ విద్యుత్ ఉద్యమంలో కె.రఘు ముఖ్యపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన టిజెఏసిలో కన్వీనర్‌గా పని చేశారు. చత్తీస్‌గడ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం వల్ల జరిగే నష్టాన్ని, విద్యుత్ రంగంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వ లోపాలను, నిర్లక్ష్యాలను ఎత్తి చూశారు. అందుకు ఆయనపై బదిలీ వేటు వేసింది. గిరిజన ప్రాంతాల్లో మినీ హైడ్రాల్ పవర్ ప్రాజెక్టులను చేపట్టారు. విద్యుత్ రంగానికి సంబంధించి తెలంగాణలో విద్యుత్ రంగం పట్ల నిర్లక్ష్యం, తెలంగాణ విద్యుత్ రంగ అభివృద్ధి, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపైన విశ్లేషణల పుస్తకాలను రచించారు.

## ఉద్యోగ సర్వీస్‌ను కాపాడుకోవాలి

నూతన ఇంజనీర్లకు మంత్రి సీతక్క పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగా వచ్చిన ఉద్యోగాన్ని సర్వీస్ మొత్తం కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిహెచ్‌ఎంసిలో నూతనంగా నియామకమై వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ల రెండవ బ్యాచ్ కింద ఆరురోజుల శిక్షణ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియాలో జరిగిన ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఇంజనీర్లకు అవసరమైన జిహెచ్‌ఎంసికి సంబంధించిన కార్యకలాపాలపై సీనియర్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ ప్రొఫెసర్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. కాలేజీల నుండి డైరెక్ట్‌గా ఉద్యోగంలోకి వచ్చినందున అపారమైన భవిష్యత్ ఉంటుందని మంత్రి అన్నారు. వచ్చిన ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రజలకు మంచి సేవలను అందించాలన్ని మంత్రి సీతక్క వారికి సూచించారు. పేదరిక నిర్మూలనా సంస్థ సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర గణనీయమైనదన్నారు. రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు, పేదలకు నిర్మించేగృహ నిర్మాణాలతో పాటుగా, స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా నిర్మించబోయే ప్రతి భవన నిర్మాణం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుతాయన్నారు. ఒక గురుతరమైన బాధ్యతను నిర్వహించే ఈ పనులన్ని ఇంజనీరింగ్ అధికారులుగా నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల రిక్రూట్ చేసుకున్న ఇంజనీరింగ్ అభ్యర్థులందరికీ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ద్వారా శిక్షణ ఇస్తున్నందుకు తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీలు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే బిఆర్ఎస్ సభ

కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన ఉనికిని కాపాడుకునేందుకే వరంగల్‌లో బిఆర్ఎస్ వజ్రోత్సవ సభను పెట్టిందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఎద్దేవ చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కెసిఆర్ తెలంగాణ నినాదం నుండి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన జరగాలి అని మా పార్టీ నేతలే వెనక నిలబడి నడిపించారు. కాంగ్రెస్ నాయకత్వం వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేది కాదు.. ఇది వాస్తవం విమర్శ కోసం చెప్పడం లేదన్నారు. కెసిఆర్ పదేళ్లు సిఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులు అయితే తన ప్రసంగంలో గతాన్ని మర్చిపోయి మాట్లాడారన్నారు.రాహుల్ గాంధీ పై కెసిఆర్ మాట జారాదన్నారు. కాంగ్రెస్‌లో డుబ్లికెట్ గాంధీలు అనడం ఆశ్చర్యంగా అనిపించిందన్నారు. కెసిఆర్ అంటే నాకు గౌరవం ఉంది.. పరిపూర్ణత చెందిన నాయకుడు అని నేను భావిస్తా .. కానీ ఈ వయసులో ఇంత దిగజారి మాట్లాడుడం అవసరమా..? అని ప్రశ్నించారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల.**

సీల్డ్ కొటేషన్స్ — తేదీ : 26.04.2025

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట పట్టణములో ఒక్క(1) పనికి అంచనా విలువ: రూ.31.00 లక్షలు సొంత్ నిధుల నుండి చేయుటకు గాను సీల్ కొటేషన్స్ కోరడమైనది స్వీకరించు తేదీ: 28-04-2025 నుండి తేదీ: 01-05-2025, తదుపరి వివరముల కొరకై రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయత్ రాజ్ కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్ రాజన్న సిరిసిల్ల

DIPR R.O. No. : 908-PP/CL/ADVT/1/2025-26, Date: 28-04-2025

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము,దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/132/2025 — బహిరంగ వేలము ప్రకటన-3 — తేదీ : 28.04.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 06.05.2025 మంగళవారం రోజున ఉదయం గం.11:00లనుండి దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేదీ: 19.06.2025 నుండి తేదీ: 18.06.2026 వరకు |
| 2. | కిరాణం మరియు ఆటబొమ్మలు అమ్ముకొనుహక్కు | రూ. 50,000/- | తేదీ: 15.06.2025 నుండి తేదీ: 14.06.2026 వరకు |
| 3. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | |
| 4. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ. 20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 929-PP/CL/ADVT/1/2025-26, Date: 28-04-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఏప్రిల్ 29

# గుభాళింపు తగ్గిన గులాబీ

భారతీయ (ఇంతకుపూర్వం 'తెలంగాణ') రాష్ట్ర సమితి వ్యవస్థాపక రజతోత్సవ బహిరంగ సభ ఒకనాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమానికి పటుగొమ్మలాంటి వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. అయితే 14 ఏళ్లు ఉద్యమపార్టీగా, దాదాపు దశాబ్దకాలం పాలక పార్టీగా విరాజిల్లిన తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) 2023(అసెంబ్లీ), 2024(లోక్‌సభ) ఎన్నికల షాక్ నుంచి తేరుకుని కాలు చెయ్యి కూడదీసుకునే తొలి ప్రయత్నంగా ఈ సభను చూడవచ్చు. అధినాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మళ్లీ జనంలోకి రావటానికి దీన్ని అంకురార్పణగా భావించవచ్చు. 'నేను మళ్లీ బయలుదేరుతా' అని ఆయనే స్వయంగా ప్రకటించారు కూడా. బిఆర్ఎస్ అధికారానికి దూరమైనా గణనీయమైన ఓటు బలం ఉంది. నాయకుని వాగ్ధాటిలో కరకుదనం తగ్గినా జనాకర్షకశక్తి అట్లనే ఉంది. డబ్బుకు కొదవలేదు. పట్టుదలతో జన సమీకరణ చేశారు. ఈ సభ ఆ పార్టీ కార్యకర్తలకు టానిక్కులా పనిచేస్తుంది – సందేహం లేదు. ఎల్కతుర్తిలో సభా ప్రారంభం గంట ఆలస్యమై చీకట్లు కమ్ముకున్నా, అనేక గంటలముందు సభాస్థలికి చేరుకున్న తండోపతండాల జనాలు ఓపిగ్గా తమ నేతకోసం ఎదురుచూస్తున్నా నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలతో కాలక్షేపం అందించారేగాని వేదికనలంకరించిన 500మంది నాయకులలో ఎవరూ ప్రసంగించటానికి సాహసించలేదు. రజతోత్సవ ప్రారంభోత్సవ సభను కేవలం కెసిఆర్‌కు రిజర్వు చేశారు.

కెసిఆర్ గంటపాటు చేసిన ప్రసంగంలో ఓ 5–6 నిముషాలు మినహా సమయాన్నంతా తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయటానికి, తమను అధికారం నుంచి ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారపట్టటానికి ఉపయోగించారు. అందువల్ల తొలి సగభాగానికి సభికులనుంచి స్పందన కరవైంది. ఆ విషయాన్ని గ్రహించిన కెసిఆర్, 'ఇక వస్తున్నా – మీకు కావలసింది చెబుతా' అనగానే హర్షధ్వానాలు. ఇక 18మాసాల కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. నెం.1 రాజకీయ స్థానంకోసం ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న పోటాపోటీ రాజకీయంలో రాష్ట్రానికి 'నెంబర్ 1 విలన్ కాంగ్రెస్' అని కెసిఆర్ ముద్ర వేశారు. అంటే తమ ప్రథమ శత్రువు కాంగ్రెస్ అని తేల్చిపడేశారు. 8 లోక్‌సభ సీట్లు, దాదాపు 34శాతం ఓట్లు పొంది, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంకోసం అర్రులు చాస్తూ, కేంద్ర నాయకుల ప్రత్యక్ష మార్గదర్శకంలో కుల, మత విభజనలకు ఆజ్యం పోస్తున్న బిజెపి పట్ల తమ వైఖరిని నాలుగుమాటల్లో తేల్చిపారేశారు. '...భజ్రాజమానం–భజగోవిందం'అన్నారు. బిజెపి రాష్ట్రానికి ఏమిచ్చింది. 150 మెడికల్ కాలేజీల్లో మోదీ ప్రభుత్వం ఒక్కటైనా తెలంగాణకు ఇచ్చిందా? ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇచ్చిందా?' 11 ఏళ్లలో 11 రూపాయలు తెచ్చారా? అని ప్రశ్నించి వదిలేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శ ప్రధానంగా దాని సంక్షేమ వాగ్దానాలు – వాటి అమలులో వైఫల్యంపై సాగింది. వాగ్దానాలు నెరవేర్చలేక ప్రతిదానికీ బిఆర్ఎస్‌ని నిందిస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. సంవత్సరంన్నర గడిచిపోయింది. ఒక్క కొత్త ప్రాజెక్టు అయినా నిర్మించారా అంటూ తాము మూడేళ్లలో చేబట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులను ప్రస్తావించారు. నల్లాల నీళ్లు ఇచ్చుడులో విఫలం, కరెంటు ఇచ్చుడులో విఫలం, రైతు రుణమాఫీలో, రైతు బంధు, రైతు బీమా అమలులో విఫలం అని దెప్పిపొడిచారు. ఒక్కొక్క కాంగ్రెస్ వాగ్దానాన్ని ప్రస్తావిస్తూ అమలు చేశారా అంటూ సభికులను ప్రశ్నించారు. తాము రాత్రింబవళ్లు కష్టపడి నిర్మించుకున్న బంగారు తెలంగాణను నాశనం చేస్తున్నారని వాపోయారు.

సుపరిపాలన అందించి, ప్రజలకు ఇన్ని సత్కార్యాలు అందజేస్తే వారెందుకు 'ఇక చాలు మీ పాలన' అంటూ మూడోసారి అధికారం నిరాకరించారో – మాటమాత్రంగానైనా కెసిఆర్ ప్రస్తావించలేదు. కాకపోతే కాంగ్రెస్ పార్టీ శుష్కవాగ్దానాలతో ప్రజలను మోసం చేశారనే ధ్వని ఆయన ప్రసంగంలో అంతర్లీనంగా సాగింది. కాంగ్రెస్ పాలకపార్టీ, బిఆర్ఎస్ ముఖ్య ప్రతిపక్షపార్టీ గనుక వాటిమధ్యనే వైరం ప్రధానంగా ఉంటుంది. అయితే దక్షిణాదిపై పట్టుకు వ్యూహాలు పన్నుతున్న బిజెపి ప్రమాదాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే – తర్వాత చింతించి లాభం ఉండదు, ఆలోచించాలి. ఇది బిఆర్ఎస్ రజతోత్సవ సంవత్సరం గనుక జిల్లాల్లో జరిపే సభలు కూడా ఇదే బాణీలో సాగుతాయి. ఇందులో కొత్తేమీ లేదు – రోజూ ముఖ్యనాయకులు వినిపిస్తున్నదే. కాని పార్టీని ఓటర్లు తిరస్కరించేందుకు దారితీసిన కారణాలపై అంతర్మథనం, ఆత్మవిమర్శ ఎక్కడ, ఎప్పుడు? రాజకీయ పార్టీకి ఇది అవసరం. 'మా తళుకు తగ్గలా, వాళ్ల మోసంలో జనాలు పడ్డారు' అనుకుంటూ, నిందిస్తూ పోతే భవిష్యత్ చీకటికావచ్చు. తస్మాత్ జాగ్రత్త.

# రాహుల్‌వి పిల్ల చేష్టలైతే...మోదీ పెద్దరికం ఎక్కడ?


ఎం. కోటేశ్వరరావు

రామాయణంలో రాముడికి ప్రఖ్యాతి ఎలా వచ్చిందంటే ప్రధాన కారకుడు రావణ పాత్రధారి అని కొందరు అంగీకరించకపోవచ్చు. సీత గీత దాటకపోతే రామకథే లేదు అన్నవారు కూడా ఉన్నారు. అలాగే రాహుల్ గాంధీకి బిజెపి నేతలు, వారి కనుసన్నలలో నడిచే మీడియా పెద్ద ఎత్తున ప్రచారం కల్పిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికి అంతకు ముందు లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే పెద్ద సంఖ్యలో ఓట్లు పెరగటం, సాయంత్రం 5.30 నుంచి 7.30 మధ్యలో 65లక్షల ఓట్లు పోల్ కావటం గురించి గతంలో చేసిన విమర్శలు లేదా ఆరోపణలనే రాహుల్ గాంధీ మరోసారి చేశారు. అది అమెరికాలోని బోస్టన్ నగరంలో పునశ్చరణ చేయటాన్ని బిజెపి తప్పు పడుతూ దేశద్రోహం అన్నట్లుగా దాడికి దిగింది. మన గడ్డమీద ఎన్నయినా అనుకోవచ్చుగానీ విదేశాల్లో మన రాజ్యాంగ సంస్థలను విమర్శించటం ఏమిటి అంటూ మనోభావాలను ముందుకు తెచ్చింది. దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం, వాటి మీద దాడి చేయటంలో బిజెపి తీరు అనితర సాధ్యం. ఎన్నికల కమిషనర్లు, ప్రధాన కమిషనర్ నియామక కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉన్న పద్దతిని మార్చి సిజె స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టారు. అంటే ముగ్గురిలో రెండు ఓట్లు అధికారంలో ఉన్న వారికి ఉంటాయి గనుక ఇష్టం వచ్చిన వారిని నియమించుకోవచ్చు, అలాంటి వారు ఎలా పని చేస్తారో వేరే చెప్పనవసరం లేదు. రాహుల్ గాంధీ చెప్పినట్లు అలా నియామకం పొందిన వారు రాజీపడక ఏం చేస్తారు, నియమించిన వారికి వ్యతిరేకంగా వ్యవహరించగలరా ? వారేమైనా టిఎన్ శేషన్ వంటి చండశాసనులా?



ఈ పూర్వరంగంలోనే ఎన్నికల కమిషన్ రాజీపడుతున్నదని, వ్యవస్థలోనే లోపం ఉన్నదని రాహుల్ గాంధీ బోస్టన్‌లో చేసిన వ్యాఖ్యలను బిజెపి వివాదం కావించింది.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పోలింగ్ గురించి ఎన్నికల కమిషన్ గతంలోనే తన చర్యను సమర్థించుకున్నది. మొత్తం 9.7కోట్ల మంది ఓటర్ల గురించి కేవలం 90 అప్పీళ్లు మాత్రమే వచ్చినందున జాబితా సరైనదే అని ఎన్నికల కమిషన్ సమర్ధించుకుంది, 30లక్షల మంది కొత్త ఓటర్లు నమోదైతే ఆ స్థాయిలో ఫిర్యాదులు రాలేదెందుకని ఎదురు ప్రశ్నించింది.రెండు గంటల సమయంలో 65లక్షల ఓట్లు వేయటం ఎలా సాధ్యమని రాహుల్ గాంధీ ప్రశ్న, వీడియో చిత్రాలను కూడా అడిగేందుకు వీల్లేకుండా చట్టాలను సవరించారని పేర్కొన్నారు. వీటికి సమాధానం లేదు. రిగ్గింపు ఎప్పుడు ఎలా చేస్తారో మనకు తెలియదా !

రాహుల్ గాంధీవి పిల్లచేష్టలని, విదేశీ గడ్డ మీద ఆధారం లేని ఆరోపణలు చేస్తున్నట్లు బిజెపి ధ్వజమెత్తింది. విదేశీ పర్యటనల్లో విమర్శలు చేయటం కొత్త కాదు, గతంలో కూడా చేశారు. ఆ మాటకు వస్తే వయసులో పెద్దమనిషి, ఒక ప్రధానిగా నరేంద్రమోదీ చేసిందేమిటి ? పెద్దలు నడిచిన బాటనే పిల్లలూ అనుసరిస్తారు. ఒక రాజకీయ నేత తన ప్రత్యర్ధి పార్టీ లేదా ప్రభుత్వం, వ్యవస్థల గురించి స్వదేశంలో విమర్శించి విదేశాల్లో పొగడాలా, ఆ పని చేస్తే సమావేశాలకు వచ్చిన వారు గడ్డి పెట్టరా లేదా నేను మాట్లాడను అని నోరుమూసుకోవాలా ? నరేంద్రమోదీ అదే చేశారా ? కాంగ్రెస్‌ను స్వదేశంలో విమర్శించినట్లే విదేశాల్లోనూ ధ్వజమెత్తారు. ఆ పార్టీనే కాదు, అవినీతిదేశం అంటూ జాతి పరువునే తీశారు.

## మోదీ అవాకులు – చవాకులు

2015లో జర్మనీ వెళ్లినపుడు కాంగ్రెస్ పార్టీ వదలివెళ్లిన చెత్తనంతా శుద్ధి చేయాల్సి ఉందని మోదీ చెప్పారు. భారత్ అంటే కుంభకోణాల దృశ్యమని, దాన్ని తాను నైపుణ్య దేశంగా మార్చనున్నట్లు కెనడాలో చెప్పారు. ఓమన్‌లో కూడా అదే చెప్పారు. కాంగ్రెస్ పాలనా కాలమంతా కుంభకోణాల మయమని, తప్పుడు పాలనా పద్దతులను సరిదిద్దేందుకు తాను ఎంతో కష్టపడుతున్నట్లు చెప్పుకున్నారు. గత జన్మల్లో ఏ పాపం చేశామో భారత్‌లో పుడుతున్నామని జనాలు చెప్పుకుంటున్నారని దక్షిణ కొరియా సియోల్‌లో మోదీ సెలవిచ్చారు.ఇలాంటి పరిస్థితిలో తెలివైన వారు దేశం వదిలేసి వేరే చోటకు పోదామని అనుకున్నారు అలాగే వెళ్లారు.ఇప్పుడు నేను గట్టి విశ్వాసంతో చెప్పగలను, అన్ని జీవన రంగాలకు చెందిన ఆ తెలివైన వారు, ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా వారు విదేశాల్లో పెద్ద మొత్తాలను సంపాదిస్తున్నప్పటికీ వారంతా తిరిగి రావటానికి, తక్కువ ఆదాయాలకు కూడా సిద్దపడి భారత్‌లో స్థిరపడటానికి రావాలని చూస్తున్నారని మోదీ చెప్పారు. చైనాలోని షాంఘై నగరంలో భారత సంతతి సమావేశంలో మాట్లాడుతూ గతంలో మీరు భారత్ గురించి సిగ్గుపడేవారు, ఇప్పుడు (తాను ప్రధాని అయిన తరువాత) దేశం గురించి గర్వపడుతున్నారన్నారు. ప్రతిపక్షం మీద ధ్వజం, స్వంతడబ్బా ప్రతిచోటా కనిపిస్తుంది. 2014లో ఎన్నిక తరువాత న్యూయార్క్ పర్యటనలో మీరు ఓట్లు వేసి ఉండకపోవచ్చుగానీ ఫలితాలు వచ్చినపుడు మీరంతా పండగ చేసుకున్నారని ప్రవాస భారతీయులతో చెప్పారు. ప్రధానిగా 70దేశాలు తిరిగారని 50చోట్ల తన ప్రత్యర్థుల మీద రాజకీయ దాడి చేశారని పరిశీలకులు చెబుతున్నారు. అప్పుడు అది విదేశీ గడ్డా స్వదేశీ అడ్డా అన్నది గుర్తుకు రాలేదా ? రాహుల్ గాంధీ కూడా అదే బాటలో నడుస్తూ విమర్శలు చేస్తున్నారు. తేడా ఏమిటంటే మోడీ మాట్లాడిన వాటిని గోడీ మీడియా పెద్దగా ప్రచారంలో పెట్టలేదు, చర్చల రచ్చ చేయలేదు, అంతే ! మీరు ఎక్కడికి వెళితే అక్కడికి మా నెట్‌వర్క్ వస్తుందనే హచ్ కుక్క ప్రకటన మాదిరి నరేంద్రమోడీ ఏ విదేశ పర్యటన చేస్తే తాము కూడా ఒక సీనియర్ నేతను అక్కడకు పంపుతామని, అక్కడేమైనా తప్పుడు ప్రచారం, ఆరోపణలు చేస్తే అదే స్థాయిలో సమాధానం చెబుతామని, దేశాన్ని కించపరుస్తూ,ప్రతిపక్షం మీద ఆరోపణలతో మాట్లాడుతున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ అని 2015లోనే కాంగ్రెస్ నేత ఆనందశర్మ విమర్శించారు. మోడీ ప్రధానిగా దేశాలు తిరుగుతున్నారు తప్ప ఆర్ఎస్ఎస్ ప్రచారక్ లేదా బిజెపి ప్రతినిధిగా కాదన్నారు.

## విచక్షణ లోపించిన వ్యాఖ్యలు

రాజ్యాంగ వ్యవస్థలను కించపరుస్తున్నారంటూ రాహుల్ గాంధీ మీద ధ్వజమెత్తుతున్న బిజెపి నేతలు ఏం చేస్తున్నారో దేశంతో పాటు ప్రపంచమంతా చూస్తోంది. అత్యున్నత న్యాయస్థానం తీర్పులనే వారు సవాలు చేస్తున్నారు. పార్లమెంటు సుప్రీం అంటూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ మరోసారి వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి, గవర్నర్లు తమ దగ్గరకు వచ్చిన బిల్లుల మీద మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని లేకుంటే వాటిని ఆమోదించినట్లు పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉపరాష్ట్రపతి విమర్శించారు. అది ప్రజాస్వామిక శక్తులపై అణుక్షిపణి వంటిదని వర్ణించారు. సుప్రీం కోర్టుకు అలాంటి అధికారం లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టసభలు ఆమోదించిన బిల్లులను తిప్పి పంపే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు ఉంది. అయితే వాటిని తిరిగి చట్టసభలు మరోసారి ఆమోదించి పంపితే చట్టాలుగా ఆమోద ముద్రవేయటం తప్ప తిరస్కరించే అధికారం లేదు. అయితే రాష్ట్రపతి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు నెలల తరబడి తిప్పి పంపకుండా ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతున్న పూర్వరంగంలో తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఆ తీర్పు ఇచ్చింది. న్యాయవ్యవస్థ సూపర్ పార్లమెంటుగా వ్యవహరించజాలదని జగదీప్ తప్పుపట్టారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత రాష్ట్రపతి, గవర్నర్లదైతే, రాజ్యాంగం ప్రకారం పాలన సాగుతున్నదా లేదా అన్న భాష్యం చెప్పేందుకు సుప్రీం కోర్టుకు అధికారం ఉంది.చట్టసభలు చేసిన నిర్ణయాలను కాదనే హక్కు లేదు గానీ, అవి నిబంధనల మేరకు జరుగుతున్నాయా లేదా అన్నది నిర్ణయించవచ్చు. ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్టం గురించి సుప్రీం కోర్టు విచారిస్తున్నది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దాని పరిధికి మించినా లేక ప్రభుత్వానికి ఇష్టం లేకపోయినా షాబానో తీర్పు మాదిరి పార్లమెంటులో బిల్లు పెట్టి దాన్ని రద్దు చేసే దమ్ము బిజెపి కేంద్ర ప్రభుత్వానికి ఉందా అన్నది సమస్య. ఉపరాష్ట్రపతి చెప్పినట్లుగా దేశానికి పార్లమెంటు, రాష్ట్రాలకు అసెంబ్లీలు ఉన్నతం, అవి ఆమోదించిన బిల్లులను నెలల తరబడి గవర్నర్లు తొక్కిపట్టటాన్ని ఏమనాలి, తానే స్వయంగా అలాంటి పనికి పాల్పడింది గుర్తులేదా, అప్పుడు అసెంబ్లీ సుప్రీం అన్న జ్ఞానం మేల్కో లేదా ?

ఉపరాష్ట్రపతి సుప్రీం కోర్టు మీద ధ్వజమెత్తటంతో కాబోయే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ సున్నితంగా బిజెపి నేతలకు చురకలు అంటించారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్‌లో హింస కారణంగా అక్కడకు పారామిలిటరీని పంపాలంటూ రాష్ట్రపతికి ప్రవర్తకాది లేఖ జారీ చేయాలన్న పిటీషన్‌పై స్పందించారు. ఇప్పటికే మేము కార్యనిర్వహణ పరిధిని ఆక్రమిస్తున్నామన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నాం. అందువలన ఈ వినతిని తిరస్కరిస్తున్నామని ప్రకటించారు.కోర్టు పేరుతో పశ్చిమబెంగాల్లో కేంద్ర బలగాలను దించాలన్న ఎత్తుగడ పిటీషనర్ వినతిలో ఉంది.మమతా బెనర్జీని సమర్ధించనవసరం లేదుగానీ విష్ణు శంకర్ జైన్ అనే న్యాయవాది ఈ పిటీషన్‌కు ముందు రాష్ట్రపతి పాలన విధించాలని 2021లో కూడా కేసు వేశారు. పార్లమెంటూ కాదు, కార్యనిర్వాహక వ్యవస్థా కాదు రాజ్యాంగమే ఉన్నతమైనదని జగదీప్ ధంకర్ వ్యాఖ్యల మీద రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ స్పందించారు. సిబల్ ప్రస్తుతం సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, గతంలో కేంద్రమంత్రిగా పనిచేశారు.

## దూబేపై చర్య ఏదీ?

నోటి తుత్తర బిజెపి నేతల్లో నిషికాంత్ దూబే ఒకరు. వక్ఫ్ చట్ట సవరణ చెల్లుతుందా లేదా అన్నదాని గురించి విచారణ జరుపుతున్న సుప్రీం కోర్టు దేశంలో మత యుద్ధాలను రెచ్చగొడుతున్నదని, తన హద్దులను దాటుతున్నదని నోరుపారవేసుకున్నాడు. తరువాత ఎన్నికల కమిషన్ మాజీ ప్రధాన అధికారి ఎస్‌వై ఖురేషీ ముస్లిం కమిషనర్ తప్ప ఎన్నికల కమిషనర్ కాదని వదరుబోతుతనంతో మాట్లాడారు.దూబే వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బిజెపి ప్రకటించటం ఒక నాటకం తప్ప మరొకటి కాదు. అలా ప్రకటించిన తరువాతే ఖురేషీ గురించి మాట్లాడాడు. ఎందుకంటే వక్ఫ్ చట్టాన్ని ఖురేషీ విమర్శించారు.తానుగా అధికారికంగా చేయలేని వ్యాఖ్యలను దూబే వంటి వారితో బిజెపి చేయించటం దానికి వెన్నతో పెట్టిన విద్య. దూబే అంతటితో ఊరుకోలేదు, దేశం హిందువులదని, గిరిజనులు, జైనులు, బౌద్దులు వారితో కలసి ఉన్నారని కూడా సెలవిచ్చారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడటానికి దూబె పెట్టింది పేరు, అగ్రనేతల మనసులో ఉన్నదాన్ని వెల్లడించిన దూబే మీద ఎలాంటి చర్య ఉండదని, తప్పనిసరైతే ఏదో మమఅనిపిస్తారని ఒక ఎంపి వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. సుప్రీం కోర్టు గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను కోర్టు ధిక్కరణ నేరం కింద దూబేపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్న వారి తరఫు లాయర్ అనాస్ తన్వీర్ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి లేఖ రాశారు, బిజెపి చర్యతీసుకుంటుందా ?

# ప్రపంచంలో మూడోస్థానం ఎవరికోసం?

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధి వాపా (లేక) బలుపా అని బేరిజు వేసుకుని ముందుకు సాగడం ఉత్తమం... ఎందుకంటే ఇటీవల ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే, మన భారత దేశ వాస్తవ అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది.. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధనలో మన దేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ

**ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధనలో మనదేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహారలోపంలో 111వ స్థానం లో, మహిళా రక్షణలో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పోవర్టీ లో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి... ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదొవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యం గా పేద, మధ్య తరగతి ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి...!? ఇది మన అందరిని వెంటాడుతున్న ప్రశ్న...ఈ ప్రశ్నకు బదులేది...!? నేటి పాలకులు సమాధానం చెప్పాలి...**

స్థానంలో, పోషకాహారలోపంలో 111వ స్థానం లో, మహిళా రక్షణలో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పోవర్టీ లో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి... ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదొవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యం గా పేద, మధ్య తరగతి ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి...!? ఇది మన అందరిని వెంటాడుతున్న ప్రశ్న...ఈ ప్రశ్నకు బదులేది...!? నేటి పాలకులు సమాధానం చెప్పాలి...

నేటికీ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.. అనేక విశ్వవిద్యాలయాలు అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేక విలవిలలాడుతున్నాయి.. దాదాపు ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మనదేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒకపూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే, తేటతెల్లం అవుతుంది.. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు మండుతున్నాయి. ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి పరిస్థితు ల్లో దేశం త్వరలో 'మూడో ఆర్థిక వ్యవస్థగా' మారి నా ఎవరికి లాభం!?.... కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామిక వేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి.. కార్పోరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి.

దేశానికి అన్నం అందించే అన్నదాతల ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు కనపడటం లేదు.. కేవలం నాలుగు రహదారులు, ఆరు విమానాశ్రయాలు, పది పదంతస్తుల ఆకాశహర్మ్యాలు నిర్మించి, యాభై, డెభై అడుగుల విగ్రహాలు , సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరి కం తగ్గుతుందా...!? పాలకులారా ఆలోచన చేయండి... ప్రశ్నించే గొంతుకలను అణచివేయ డం ద్వారా వాస్తవాలు ఎల్లకాలం దాచలేరు.. గతంలో 8% శాతం, 9% శాతం ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతుంది అని గ్రహించాలి.. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగా నికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఉంది.. 'చైనా' వలే స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు ఊబిలో కూరుకు పోకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి.. కుల, మత, వర్గ, భాష, లింగ వివక్షతలు తొలగించడానికి కృషి చేయాలి. భారత రాజ్యాంగ ఆశయాలు ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక విధానానికి అనుగుణంగా పాలన చేయాలి. అంకెలు, సంఖ్యలు చూసి మురిసిపోవడం మానాలి. వాస్తవంగా దేశ ప్రజలు తలసరి ఆదాయం పెరిగి, ఆయురారోగ్యాలతో, సంతోషంగా 'ఫిన్లాండ్ వలే ఉండే విధంగా చూసుకోవాలి.. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంటే దేశ ప్రజలు అందరూ సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి... అంతేకాని కొందరు బడా పారిశ్రామిక సంస్థలు, వేత్తలు, కార్పోరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే, దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసిపోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే, దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం.

ఐ.ప్రసాదరావు, 6305682733


# ఒత్తిడిలో యువత ఆత్మహత్యలు!


మేకిరి దామోదర్
573666650

మన దేశ భవిష్యత్తు యువతరం చేతిలోనే ఉంది. ఏ దేశ ప్రగతికైనా సమర్థ యువ మానవ వనరులే కీలకం. అలా వారు వర్తమానమనే అపురూప బహుమానాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కసారి కోల్పోతే తిరిగి తెచ్చుకోలేని శక్తి సామర్థ్యాలు, కాలం విలువ తెలుసుకొని యువత మసులుకోవాలి. ప్రపంచంలో దేన్నైనా కొనగలం ఒక్క సమయాన్ని తప్ప. అందుకే యువతరం ఆధునిక టెక్నాలజీ మాయలో స్మార్ట్ ఫోన్లో కాలం వృథా చేయడమో, డ్రగ్స్‌కో, మద్యానికో, ఈజీ మనీకోసం బెట్టింగ్ జూదం లాంటి వ్యసనాలకు బానిస కారాదు! విద్యార్థులకు, యువతకు చదువు సంపద ఒక్కటే జీవితం కాదు. నీకంటూ ఏదో ఒక నైపుణ్యం కలిగి ఉంటావు. అదేమిటో తెలుసుకో ఆత్మవిశ్వాసంతో ఆచరించిన మరుక్షణం నీకు తిరుగుండదని గట్టిగా నమ్మండి. ఈ రోజుల్లో సామాజిక స్పృహ, మానవీయ విలువల్ని పెంచే మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మీ శక్తి సామర్థ్యాలేమిటో తెలుసుకొని లక్ష్యాన్ని ముద్దాడాలి. ప్రభుత్వాలు వారిలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, స్వయం ఉపాధితో ఇంకొందరికి జీవనోపాధి కల్పించాలి. తద్వారా మెరుగైన ఆర్థిక ప్రగతికి దోహదపడాలి. అలా నైతిక విలువలతో సామాజిక బాధ్యతతో మెలిగేలా తయారు చేయాలి. ఇతరుల నమ్మకాలను, విలువలను గౌరవించినప్పుడే సమాజం శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రగతి పథం లో పయనించడానికి సాధ్యమౌతుంది. ఇలాంటి వేళ 'యువతరం ఎదుర్కొనే సమస్యలను పరిశీలిద్దాం' ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చుట్టు ముడుతున్న ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు తదితర కారణాలతో యువత మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవుతోందని 'యంగ్ లైవ్స్ ఇండియా' అధ్యయనం వెల్లడించింది.

గత నాలుగైదేళ్లలో పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ మానసిక అనారోగ్య లక్షణాలు పెరుగుతున్నాయని తెలిపింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 59 శాతం మంది, ఏదో ఒక సమస్యతో ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు వివరించింది. తెలుగు రాష్ట్రాల్లోని యువతలో ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం పై ఈ అధ్యయనం నిర్వహించారు.

'నివేదికలో వెల్లడైన అంశాలు'..ఎపితో పోలిస్తే తెలంగాణ యువతలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నత వర్గాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఈ పరిస్థితులు ఎక్కువ. పేదరికం, తల్లిదండ్రుల్లో తక్కువ అక్షరాస్యత, వెనుకబడిన అణగారిన వర్గాల కుటుంబాల్లోని యువత ఎత్తుకు తగిన బరువు లేక బలహీనంగా ఉన్నారు. ఆహార అభద్రత పరిస్థితులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. చదువుకున్న, ధనిక కుటుంబాల్లోని యువతలో ఊబకాయం లక్షణాలు ఉన్నాయి. పోషకాహార సమస్యలున్న కుటుంబాలు 38శాతం ఉన్నట్టు వెల్లడయింది. ఎత్తుకు తగిన బరువు లేని యువత, అదే సమయంలో అధిక బరువుతో బాధపడుతున్న యువత సమానంగా ఉన్నారు. యువతలో మధుమేహం, గుండె సంబంధిత తదితర నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల కారణంగా మరణాల రేటు ఆందోళన కలిగిస్తుంది. 22 ఏళ్ల యువతలో 21 శాతం మంది, 29 ఏళ్ల యువతలో 13 శాతం మంది ఊబకాయం, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితులు యువతలో హృద్రోగ సమస్యల పెరుగుదలకు కారణమవుతున్నాయి. తెలంగాణలో హృద్రోగ సంబంధిత ముప్పు 22 ఏళ్ల యువతలో 7.94శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 15.51 శాతం ఉంది. ఏపీలో 22 ఏళ్ల యువతలో 9.22 శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 22.73శాతం ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు 2021లో ప్రతి లక్ష మందిలో 1974 మంది ఉంటే.. ఇప్పుడు మరో 11 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 15శాతం మందిలో స్వల్ప, మధ్య స్థాయి మానసిక ఆందోళన, నిరాశ లక్షణాలు కనిపించాయి. వీరిలో ప్రతి 10 మందిలో 6గురు సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నట్లు అధ్యయనం గుర్తించింది.



**మానసిక ఆరోగ్యం శాతాల్లో...**

మధ్య స్థాయి ఒత్తిడి 22ఏళ్ల యువతలో ఎపి 54.13/తెలంగాణ 67.97/.. 29ఏళ్ల యువతలో ఎపిలో 51.85/ తెలంగాణలో 71.34/ మానసిక ఆందోళన 22 ఏళ్ల యువతలో ఏపీలో 5.96/ తెలంగాణలో 14.84/.. 29 ఏళ్ల యువతలో ఎపిలో 10.93/ తెలంగాణలో 20.52/ నిరాశ, నిస్పృహ 22 ఏళ్ల యువత ఎపిలో 7.14/ తెలంగాణలో 14.53/.. 29 ఏళ్ల యువతలో ఎపిలో 7.04/ తెలంగాణలో 17.26...

ఇలా మానసిక ఒత్తిడిలో యువతరం ఉన్నారని యంగ్ లైవ్స్ ఇండియా అధ్యయనం వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అలా ఉంటే... మన దేశంలో మానసిక సమస్యలతో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. 2020–22 మధ్య కాలంలో ఇలా ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య ఏకంగా 44శాతం పెరిగిందని జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్ సీ ఆర్ బీ) తెలిపింది. ఇలా మానసిక ఆరోగ్యం బాగాలేక ప్రాణాలు తీసుకుంటున్న ప్రతి ఐదుగురిలో ముగ్గురు 1845 సంవత్సరాల మధ్య వయస్కులు కావడమే గమనార్హం. మానసిక అనారోగ్యంతో ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు 18–45 సంవత్సరాల వయసులోనే అధికం. ఇంకా వెలుగులోకి రాని మహిళల ఆత్మహత్యలు ఉంటున్నవి. నానాటికి ఆత్మహత్య రేటు పెరుగుతోంది..

మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు18–45 సంవత్సరాల మధ్య వయస్కులేనని ఎన్ సీ ఆర్ బీ నివేదిక తెలిపింది. 2018 తో పోలిస్తే 2022లో దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య 27శాతం పెరిగింది. దీనితో పాటే ప్రతి లక్ష జనాభాకు ఆత్మహత్య రేటు కూడా పెరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుటీవో) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా 7.2 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారు.15 – 29 సంవత్సరాల మధ్య వయస్సున్న వారిలో మరణాలకు మూడో అతి పెద్ద కారణం 'ఆత్మహత్యే'. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఆత్మహత్యలలో 73శాతం పేద, ఓ మోస్తరు ఆదాయం కలిగిన దేశాల్లో జరుగుతున్నవే. ఈ పరిణామాల దృష్ట్యా 2017లో కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య రక్షణ చట్టాన్ని రూపొందించింది. ఎలాంటి వివక్షకు తావు లేకుండా నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచ డం దీని ప్రధాన లక్ష్యం.. అయితే ఇది సరిగా అమలు కావడం లేదు, పైగా ఆత్మహత్య చేసుకున్న వారి వివరాలు సేకరించడం, దానిని వర్గీకరించడంలో కూడా పరిమితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఆత్మహత్యలు చాలా వరకు వెలుగులోకి రావడం లేదు.ప్రపంచ దేశాల్లోనే యువ జనాభా ఎక్కువ కలిగిన దేశం మనది. ఆ యువ శక్తికి మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం. అది చేజారితే యువతరం ఏది సాధించలేదు. యువత మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వాలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ దేశ ప్రగతికి తోడ్పడేలా పాలన విధానాలు ఉండాలి. 'నష్టం జరిగిన తర్వాత సలహా ఇవ్వడం అంటే! మరణానంతరం మందు ఇవ్వడం లాంటిదే. ఈ విశ్వంలో విలువ కట్టలేనిది ఏదైనా ఉందంటే అది 'ప్రాణం' ఒక్కటే.

కావున యువత నిరాశ, నిస్పృహకు లోను కాకూడదు. మిమ్మల్ని అవహేళన చేసిన వాళ్లే మీ గురించి గొప్పగా చెప్పుకునే రోజులు వస్తాయని గట్టిగా నమ్మాలి.. మీ జీవితాన్ని చక్కదిద్దుకోవాలి. యువత సన్మార్గంలో వెళ్తే అంతకంటే పెద్ద బహుమతి మరొకటి ఉండదు. ప్రభుత్వాలు అందుకు సంపూర్ణ సహకారం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## హజ్ యాత్రికులకు నుసుక్ కార్డ్ తప్పనిసరి

**న్యూఢిల్లీ :** ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. హజ్ కోసం వెళ్లే తొలి బ్యాచ్ యాత్రికులు ఈనెల 29న లక్నో ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరనున్నారు. ఈ నేపథ్యంలోనే భారత హజ్ కమిటీ యాత్రికులకు మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని సమయాల్లో తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. దీంతో పాటుముఖ్యమైన పత్రాలు, గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలని చెప్పింది. 'యాత్రికల వద్ద నుసుక్ కార్డ్ లేకపోతే సౌదీ అరేబియా ప్రభుత్వం నిలిపివేస్తుంది. మక్కా, మదీనా, మీనా, అరాఫత్ స్థానిక అధికారులు యాత్రికులను అడ్డుకుంటారు. ఇలాంటి ఇబ్బందులు పడకూడదంటే తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను తమ వద్దే ఉంచుకోవాలి' అని ఉత్తర్‌ప్రదేశ్ హజ్ కమిటీ కార్యదర్శి ఎస్‌పి తివారీ తెలిపారు. యాత్రికుల సౌకర్యం కోసం హజ్ సువిధ 2.0 అనే యాప్‌ను రూపొందించామని, దీనిని గూగుల్, యాపిల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని హజ్‌కమిటీ చెప్పింది. విమానంలోని సౌకర్యాలతో పాటు వీసా సంబంధిత వివరాలు ఉంటాయని తెలిపింది. మక్కాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్, జిపిఎస్, ప్రార్థనా సమయం, ఫిర్యాదులు, బ్యాగేజీ ట్రాకింగ్ లాంటి వివరాలు ఉంటాయని వెల్లడించింది.

## ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం : నౌకాదళానికి 26 రఫేల్ యుద్ధ విమానాలు



**న్యూఢిల్లీ :** భారత నౌకాదళానికి అత్యాధునిక రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలు సమకూర్చేందుకు ఫ్రాన్స్‌తో కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం కింద రూ.64,000 కోట్లు భారత ప్రభుత్వం ఖర్చుపెడుతున్నది. ఈ మేరకు 26 రఫేల్ యుద్ధ విమానాలను దశలవారీగా 2030 నాటికి ఫ్రాన్స్ ప్రభుత్వం భారత నావికాదళానికి అందజేస్తుంది. భారత్‌-ఫ్రాన్స్ దేశాలు ఎవరి జోక్యం లేకుండా ప్రభుత్వస్థాయిలో ఈ ప్రత్యక్ష ఒప్పందం చేసుకున్నాయని రక్షణమంత్రిత్వశాఖ సోమవారంనాడు ప్రకటించింది. భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఫ్రాన్స్ సాయుధబలగాల మంత్రి సెబాస్టియన్ లెకోర్నూ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన ప్రతులను రెండు దేశాలకు చెందిన రక్షణశాఖ ఉన్నతాధికారులూ ఇచ్చిపుచ్చుకునానరని రక్షణమంత్రిత్వశాఖ పేర్కొంది.

ఈ ఒప్పందం ప్రకారం ఈ యుద్ధ విమానాల విడిభాగాలను కలిపి విమానాలు తయారు చేయడం, వాటిని నిర్వహించడం, మరమ్మతులు చేయడం, ఇంజన్లను ఓవరాయిలింగ్ చేయడం. సెనర్స్‌ను రెడీగా ఉంచడం వంటివన్నీ భారతదేశంలోనే చేస్తారు. అదేవిధంగా ఈ ఒప్పందం ప్రకారం ఈ యుద్ధవిమానాల సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా భారత్‌కు బదిలీ చేయడానికి తద్వారా దేశీయ ఆయుధాలను సమీకృతం చేయడానికి వీలుగా ఒప్పందం చేసుకున్నారు. ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి భారీ యుద్ధ నౌకలపైనుండి ఈ యుద్ధ విమానాలను ప్రయోగిస్తారు. ఫ్రాన్స్‌కు చెందిన రక్షణరంగ దిగ్గజం దస్సాల్ట్ ఏవియేషన్ సముద్రయుద్ధ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ రాఫెల్ యుద్ధ విమానాలను తయారు చేస్తుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జాతీయ భద్రతపై పనిచేసే మంత్రివర్గ కమిటీ సమావేశం తర్వాత ఫ్రాన్స్‌తోఈ భారీ రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం జరిగింది. 2023 జులైనెలలో భారత రక్షణమంత్రిత్వ శాఖ ఈ భారీ ఒప్పందానికి సంబంధించిన ప్రాథమిక ఆమోదానికి సమ్మతి తెలియజేసింది. దీనికిముందుగా అనేకవిడతలుగా చర్చలు జరిగాయి. ఈ ఒప్పందం కింద భారత నౌకాదళం మరింత బలోపేతం అవుతుంది. అదేవిధంగా నౌకా దళానికి వీటి వినియోగంలో ఎలాంటి సమస్యలూ రాకుండా ఇతర రకాలుగా అనేక విడిభాగాలను కూడా సరఫరా చేస్తారు. వీటి పనితీరును చాలా స్పష్టంగా నిర్ధారించేందుకు అనేక విధాలుగా పరీక్షలు చేసి అందజేస్తారు. ఇప్పటికే ఈ యుద్ధ విమానాలను భారతదేశం ఉపయోగిస్తోంది. కాకపోతే సముద్ర యుద్ధ అవసరాలకు అనుగుణంగా వీటిలోకొద్దిగా మార్పులుంటాయి. అదేవిధంగా ఈ ఒప్పందంవల్ల భారత వాయుసేన, నౌవికాదళం రెండూ ఉమ్మడిగా పనిచేయడానికి యుద్ధ కార్యకలాపాలు, వ్యూహాలు, దాడులు ఉమ్మడిగా నిర్వహించడానికి వీలు కలుతుంది. కొత్తగా యుద్ధ విమానాల సేకరణవల్ల ఉమ్మడి కార్యకలాపాల సామర్థ్యం ఇనుమడిస్తుంది. భారత విమాన వాహక నౌకల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. రక్షణవ్యవస్థకు కొత్తబలం, జవజీవాలు కలుగుతాయి.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి

### పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడిపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సిపిఐ ఎంపి పి. సందోష్ కుమార్ లేఖ రాశారు. పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చడం వల్ల పార్టీలకు అతీతంగా సభ్యులంతా కలిసి ఉగ్రవాడి మృతులకు సంతాపం తెలియజేయడానికి, దేశ సంకల్పాన్ని వ్యక్తపరచడానికి వీలు కల్పిస్తుందని రాజ్యసభ ఎంపి అన్నారు. ఈ దాడి బాధితుల బంధువులకు తీవ్ర దుఃఖాన్ని కలిగించడమే కాకుండా దేశ సామూహిక మనస్సాక్షిని కూడా కదిలించిందన్నారు. ఈ క్లిష్ట సమయాల్లో ప్రజా గళాన్ని వినిపించే పార్లమెంటులో ప్రగాఢ దుఃఖాన్ని వ్యక్తపరచడానికి, బాధితులకు నివాళులర్పించడానికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించడానికి సంఘీభావంగా కలిసి రావడం అత్యంత అవసరమని అన్నారు. ఈ విషాదం తీవ్రత దృష్ట్యా వీలైనంత త్వరగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలను విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశం పార్టీలకు అతీతంగా సభ్యులు ఒకే గొంతుతో మృతులకు సంతాపం తెలియజేయడానికి, దేశ సంకల్పాన్ని వ్యక్తపరచడానికి, ఉగ్రవాద చర్యల ద్వారా మనకు హాని కలిగించడానికి ప్రయత్నించే వారిపై భారతదేశం ఐక్యంగా, స్థితిస్థాపకంగా, దృఢంగా ఉందని స్పష్టమైన, బలమైన సందేశాన్ని పంపడానికి వీలు కల్పిస్తుందని సందోష్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ప్రజల స్ఫూర్తి, ఆకాంక్షలను ప్రతిబింబించడానికి, రాజకీయ విభజనలకు అతీతంగా ముందుకెళ్లాలన్నారు. జాతీయ సంతాప సమయంలో ప్రజాస్వామ్య అత్యున్నత వేదిక నుండి సకాలంలో సమష్టిగా సంఘీభావం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తన అభ్యర్థనను పరిశీలించాలని పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రిని కోరారు.

## రెచ్చగొడుతున్న పాక్ సైన్యం



### పూంచ్, కుప్వారా జిల్లాల్లో ఎల్‌ఒసి వెంబడి కాల్పులు
### వరుసగా నాల్గోరోజూ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్‌లో ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అయితే పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. వరుసగా నాల్గొవ రోజు కూడా కాల్పులకు పాల్పడింది. పూంచ్, కుప్వారా జిల్లాల్లో ఎల్‌ఓసి వెంట పాకిస్తాన్ దళాలు కాల్పులకు తెగబడ్డాయని ఆర్మీ అధికారులు సోమవారం తెలిపారు. ఏప్రిల్ 27–28 రాత్రి, కుప్వారాష పూంచ్ జిల్లాలకు ఎదురుగా ఉన్న ప్రాంతాలలో ఎల్ఓసి వెంబడి పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయని రక్షణశాఖ ప్రతినిధి చెప్పారు. అయితేపాక్ కాల్పులపై భారత దళా లు వేగంగా, సమర్థవంతంగా స్పందించాయన్నారు. ఎవరికీ నష్టం వాటిల్లినట్లు వార్తలు అందలేదన్నారు. పాకిస్తాన్ సైన్యం గురువారం రాత్రి, అలాగే ఏప్రిల్ 2526, ఏప్రిల్ 26–27 మధ్య రాత్రులలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి ఉన్న వివిధ భారతీయ స్థానాలపై కాల్పులు జరిపింది. భారత సైన్యం దీటుగా సమాధానం చెబుతోంది. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను వేటాడతామని భారత్ ప్రకటించిన నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యాన్ని హై అలర్ట్‌లో ఉంచారు. పహల్గామ్ దాడితో సరిహద్దు సంబంధాల దృష్ట్యా, భారత్ గత బుధవారం 65 ఏళ్ల నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారీ భూ సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేయడం, పాకిస్తాన్ సైనిక దళాలను బహిష్కరించడం వంటి శిక్షాత్మక చర్యలను ప్రకటించింది. అట్టారీ భూ సరిహద్దు ద్వారా దేశంలోకి ప్రవేశించిన పాకిస్తానీయులను మే 1 నాటికి వెళ్లిపోవాలని భారత్ ఆదేశించింది. దీని ప్రతిస్పందనగా, పాకిస్తాన్ గురువారం అన్ని భారతీయ విమానయాన సంస్థలకు తన వైమానిక స్థలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. న్యూఢిల్లీతో వాణిజ్యాన్ని నిలిపివేసింది. సింధు జలాల ఒప్పందాన్ని భారతదేశం సస్పెండ చేయడాన్ని పాకిస్థాన్ తిరస్కరించింది. ఒప్పందం ప్రకారం పాక్‌కు చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి తీసుకునే ఏవైనా చర్యలు 'యుద్ధ చర్య'గా పరిగణించబడతాయని పేర్కొంది. పహల్గామ్ దాడిపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్రమోడీ గురువారం హంతకులను భూముపై ఏ మూలకు ఉన్నా వెంబడిస్తామని చెప్పారు. ప్రతి ఉగ్రవాదిని, వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి, ట్రాక్ చేసి శిక్షిస్తామని ప్రకటించారు.

## దేశ గౌరవానికి హాని సమయంలో బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రసంగమా?

### ప్రధాని మోడీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శనాస్త్రాలు



**జైపూర్ :** పర్యాటకులను బలిగొన్న పహల్గామ్ ఉగ్ర దాడిపై చర్చించేందుకు ఏర్పాటైన అఖిల పక్ష సమావేశానికి హాజరు కానందుకు ప్రధానినరేంద్రమోడీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం తూర్పారపట్టారు. జైపూర్‌లో 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే ప్రసంగిస్తూ, 'దేశ గౌరవానికి హాని కలిగినప్పుడు మీరు (ప్రధాని మోడీ) బీహార్‌లో ఎన్నికల ఉపన్యాసం ఇస్తుండడం దేశం దురదృష్టం' అని అన్నారు. 'అన్ని పార్టీల నేతలు అఖిల పక్ష సమావేశానికి హాజరయ్యారు. కానీ ప్రధాని మోడీ ఆ సమావేశానికి రాకపోవడం శోచనీయం. బీహార్ ఏమైనా దూరంగా ఉన్నదా? ప్రధాని అఖిల పక్ష సమావేశానికి వచ్చి, ప్రభుత్వ ప్రణాళికను వివరించి ఉండవలసింది. ఆయనకు మా నుంచి కావలసిన సహాయం ఏమిటి?' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రధానిపై మరింతగా ఖర్గే విరుచుకుపడుతూ 'మోడీ ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత ఇచ్చారు. అటువంటి వ్యక్తులు దేశాన్ని బలహీనపరుస్తారు. 56 అంగుళాల ఛాతీ కుంచించుకుపోయింది' అని విమర్శించారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో ఉత్తర ప్రదేశ్‌ను గుజరాత్‌గా మార్చడానికి 56 అంగుళాల ఛాతీ కావాలని అన్న సంగతి విదితమే. దేశమే సర్వోన్నతం కనుక ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్లు ఖర్గే తెలియజేశారు. 'దేశం సర్వోన్నతం, ఆ తరువాతే పార్టీలు, మతం వస్తాయి. దేశం కోసం అంతా సమైక్యం కావాలి' అని ఆయన పేర్కొన్నారు, కాంగ్రెస్ సమైక్యత గురించి మాట్లాడుతుంటే బిజెపి దానిని విడదీయడం గురించి మాట్లాడుతుంటుందని ఆరోపించారు. 'ఈ దేశంలో రాజ్యాంగం సుప్రీం. మన ప్రజాస్వామ్యం రాజ్యాంగం కింద నడుస్తుంటుంది' అని చెప్పారు. కాంగ్రెస్ నాయకులపై దాడులపైన, దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపైన ప్రభుత్వాన్ని ఖర్గే తీవ్రంగా విమర్శిస్తూ, 'కాంగ్రెస్ వృద్ధి చెందుతున్నప్పుడల్లా ఈ వ్యక్తులు దానిని అణచివేయజూస్తుంటారు. మేము అణచివేతకు గురయ్యేవారం కాము' అని అన్నారు. బిజెపి నేతలు ప్రతి ఒక్కరినీ బలహీనపరచజూస్తున్నారని, కానీ ప్రజలపై 'తప్పుడు' కేసులు బనాయించడం ద్వారా వారు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచజాలరని ఖర్గే అన్నారు.

## ఢిల్లీ జెఎన్‌యు విద్యార్థి సంఘం ప్రెసిడెంట్‌గా నితీష్ విజయం

### ఎబివిపి అభ్యర్థి శిఖా స్వరాజ్‌ని ఓడించిన ఎఐఎస్‌ఎ అభ్యర్థి నితీష్
### నాలుగింటిలో 3 సెంట్రల్ ప్యానెల్ పోస్టుల్లో 'వామపక్ష' అభ్యర్థులదే గెలుపు

**న్యూఢిల్లీ :** ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఢిల్లీలోని జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీ స్టూడెం ట్స్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికలలో వామపక్ష అభ్యర్థులు విజయం సాధించి జెఎన్‌యులో మరోసారి తమ పట్టును నిలబెట్టుకున్నారు. సెం ట్రల్ ప్యానెల్ పోస్టులు నాలుగింటిలో వామపక్ష అభ్యర్థులు మూడింటిని కైవసం చేసుకున్నారు. అయితే జెఎన్‌యు విద్యార్థి సంఘం ఎన్నికలలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డి.ఎస్.ఎఫ్) ఒకే కూటమిగా పోటీచేసి అధ్యక్ష, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ పోస్టులను గెలుచుకోవడం విశేషం. ఋఇదిలాఉంటే ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)జెఎన్‌యులో9సంవత్సరాలసుదీర్ఘకాలవిరామం తర్వాత జాయింట్ సెక్రటరీ పోస్ట్‌ను గెలుచుకుని ఎట్టకేలకు తమ ఉనికిని ప్రదర్శించారు. ఈ ఏడాది జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వామపక్ష కూటమిలో చీలిక కనిపించింది. ఏఐఎస్‌ఏ, డిఎస్‌ఎఫ్ ఒకే కూటమిగా పోటీచేశాయి. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, బిర్సా అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బిఎపిఎస్‌ఏ), పిఎస్‌ఏలతో సంకీర్ణాన్నిఏర్పరచుకున్నాయి.ఏప్రిల్ 25(శుక్రవారం)న జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. జెఎన్‌యుఎస్‌యు ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన ఎన్నికల ఫలితాల ప్రకారం ఏఐఎస్‌ఏకు చెందిన నితీష్‌కుమార్ 1,702 ఓట్లతో జెఎన్‌యుఎస్‌యు ప్రెసిడెంట్‌గా గెలుపొందారు. నితీష్ సన్నిహిత పోటీదారు ఎబివిపికి చెందిన శిఖా స్వరాజ్ 1,430 ఓట్లను సాధించి రెండవ స్థానంలో నిలువగా, ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు ఇచ్చిన తయబ్బా అహ్మద్ 918ఓట్లను సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఏఐఎస్‌ఏతో జతకట్టిన డిఎస్‌ఎఫ్ అభ్యర్థి మనీషా 1,150 ఓట్లను సాధించి జెఎన్‌యుఎస్‌యు వైస్ ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. ఎబివిపిఅభ్యర్థి నిట్టు గౌతమ్‌పై మనీషా గెలుపొందారు. నిట్టు గౌతమ్‌కు 1,116 ఓట్లు లభించాయి. జనరల్ సెక్రటరీగా డిఎస్‌ఎఫ్‌కు చెందిన మున్‌తెహా ఫాతిమా1,520ఓట్లను సాధించి ఎబివిపి అభ్యర్థి కునాల్ రాయ్‌పై గెలుపొందారు. కునాల్‌రాయ్ 1,406 ఓట్లను సాధించారు. అయితే ఎబివిపి అభ్యర్థి వైభవ్ మీనా 1,518 ఓట్లు సాధించి జెఎన్‌యుఎస్‌యు జాయింట్ సెక్రటరీ పదవిని దక్కించుకున్నారు. వైభవ్ మీనా ఏఐఎస్‌ఏకు చెందిన నరేష్ కుమార్‌పై గెలుపొందారు. జాయింట్ సెక్రటరీ పదవికి పోటీపడిన నరేష్‌కుమార్‌కు 1,433ఓట్లు లభించగా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (పిఎస్‌ఏ) అభ్యర్థి నిగమ్‌కుమారి1,256ఓట్లుదక్కించుకునిమూడోస్థానంలో నిలిచారు.

## నీట్ యుజి పరీక్ష నిర్వహణపై కేంద్రం అలర్ట్

**న్యూఢిల్లీ :** వైద్య విద్య కోర్సులో ప్రవేశాల కోసం ఉద్దేశించిన నీట్ యుజి పరీక్షను మే 4న పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పరీ క్ష సందర్భంగా ఎటువంటి లోపాలకు తావులేకుండా అన్నిరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని కలెక్టర్లు, ఎస్‌పిలతో వరుస సమావేశాలను నిర్వహిస్తోంది. గతేడాది నీట్ పరీక్ష పేపర్ లీక్ అవ్వడం, ఇతర అవాంతరాల కారణంగా పలుపరీక్షలు రద్దవ్వడంతో కేం ద్రం ఈసారి పటిష్ట చర్యలు చేపట్టింది. 'నీట్ యుజి పరీక్షను సజావుగా నిర్వహించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కలెక్టర్లు,ఎస్పీలతో వరుస సమావేశాలు జరిగాయి. భద్రత, నిర్వహణ గురించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చే శారు. కేంద్రాల వద్ద ఎన్‌టిఏ నియమించిన భద్రతతో పాటు జిల్లా పోలీసుల బహుళ స్థాయి తనిఖీలుఉంటాయి. ప్రశ్నాపత్రాలు, ఒఎంఆర్ షీట్లు వంటి సామగ్రి రవాణా పూర్తిగా గోప్యంగా పోలీసుల పర్యవేక్షణలో జరుగుతుంది. లీకేజీ, ఛీటింగ్‌ను అడ్డుకునేందుకు కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లను పోలీసులు పర్యవేక్షిస్తారు.

## 16 పాక్ యూట్యూబ్ చానెళ్లను నిషేధించిన కేంద్రం

### భారత్‌పై విషం కక్కుతున్న పాక్ చానళ్లు.. డాన్, జియో న్యూస్ వంటి యూటూబ్ వార్తా చానెళ్లపై నిషేధం.. పహల్గామ్ దాడిపై బిబిసి వార్తకు కూడా ఖండన




**న్యూఢిల్లీ :** భారత్ గురించి 'తప్పుడు, రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను' ప్రసారం చేస్తున్నాయనే ఆరోపణపై 16 పాకిస్తానీ యూ ట్యూబ్ చానెళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని, అదే సమయంలో పహల్గామ్ దాడిపై బిబిసి ప్రసారం చేసిన వార్తకు కూడా కేంద్రం తీవ్ర స్థాయిలోఅభ్యంతరం వ్యక్తం చేసిందని అధికారులు సోమవారంవెల్లడించారు. జమ్మూకాశ్మీర్‌లోని పర్యాటక పట్ట ణం పహల్గామ్ మైదాన ప్రాంతంలో ఈ నెల 22ప ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ (ఎంహెచ్‌ఎ) సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. ఆ దాడిలో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులు హతులైన విషయం విదితమే. ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొన్న బిబిసి ప్రసారం చేసే వార్తలను విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) పర్యవేక్షించనున్నదని అధికారులు తెలిపారు. కేంద్రం నిషేధించిన పాక్ యూట్యూబ్ చానెళ్లలో డాన్ న్యూస్, ఇర్షాద్ భట్టి, సమా టివి, ఎఆర్‌వై న్యూస్, బిఒఎల న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రెఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్, జిఎన్‌ఎన్, ఉజెయిన్ క్రికెట్, ఉమర్ చీమాఎక్స్‌క్లూజివ్, ఆ స్మా షిరాజి, మునీబ్ ఫారూఖ్, సునో న్యూస్, రజినామా ఉన్నాయి. జ మ్ముకశ్మీర్ పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో భారత్‌పైన, సైన్యం,భద్రతాసంస్థలపైన రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను, అసత్య, తప్పుదోవ పట్టించే కథనాలను ప్రసారం చేస్తున్నందుకుపాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని అధికారులు వివరించారు.

### బిబిసి భారత్ అధిపతికి విదేశాంగశాఖ లేఖ

పహల్గామ్‌లో ఇటీవలి భీకరఉగ్ర దాడికి సంబం ధించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ బిబిసి ప్రచురించిన ఒక కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ దాడిని 'తీవ్రవాదుల దాడి'గా అభివర్ణించడాన్ని కేంద్రం ఆక్షేపిస్తూ, బిబిసి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ఈ మేరకు బిబిసి భారత్ విభాగం అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. 'కశ్మీర్‌లో దాడి తరువాత భారతీయులకు వీసాలను పాకిస్తాన్ రద్దు చేసింది' అనే శీర్షికతో బిబిసి ప్రచురించిన కథనంలో పహల్గామ్ ఘటనను ఉగ్రవాద చర్యగా పేర్కొనడానికి బదులు 'మిలిటెంట్ దాడి' అని ప్రస్తావించడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని, బాధితుల పట్ల అగౌరవాన్ని సూచిస్తుందని కేంద్రం తన లేఖలో పేర్కొన్నది. ఉగ్ర దాడి తీవ్రతను తగ్గించి చూపే యత్నం చేశారని ప్రభుత్వం విమర్శించింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని బిబిసికి సూచిస్తూ, ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా విదేశాంగ శాఖ తన లేఖతో పాటు పంపింది. 'ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడంపై బిబిసికి ఒక లేఖ పంపడమైంది. ఎంఇఎ విదేశీ ప్రచార విభాగం బిబిసి వార్త పంపే తీరును పర్యవేక్షించనున్నది' అని అధికారి ఒకరు తెలియజేశారు. ఆ రోజు పట్టపగలు, రద్దీగా ఉన్న ప్రాంతంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఆ ఘటనను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి కూడా.


## పర్యాటకులను సురక్షితంగా తిప్పి పంపలేకపోయాం..

### జమ్ము కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన



**జమ్మూ :** పహల్గామ్ సమీపం బైసరన్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన కాల్పుల హత్యాకాండను వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీరు శాసనసభ సోమవారంనాడు ఒక తీర్మానం చేసింది. రాష్ట్రానికి అతిథులుగా వచ్చిన పర్యాటకులకు తమ ప్రభుత్వం రక్షణ ఇవ్వలేకపోయిందనీ, వారికి కాపాడుకోలేకపోయిందని శాసనసభలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీరు ప్రజలు అసాధారణరీతిలో వీధుల్లోకి వచ్చి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేశారని, మృతుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించి సంతాపాలు తెలియజేశారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జమ్మూ కశ్మీరుకు రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరించమని తాను కేంద్రాన్ని కోరలేననీ, మరో సందర్భం చూసి అడుగుతాననీ అన్నారు. దేశవ్యాప్తంగా వెళ్ళి చదువుకుంటున్న కశ్మీరీ విద్యార్థులు, వివిధ ప్రాంతాలలో పర్యటనలు చేస్తున్న కశ్మీరీయుల భద్రతకు పూర్తి భరోసా ఇవ్వాలని, వారి భద్రతకు, గౌరవ మర్యాదలకు భంగం కలగకుండా వేధింపులు లేకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు భరోసా ఇవ్వాలని కూడా తీర్మానంకోరింది.సంయమనంపాటించి హింసనువిద్వేషాన్నితిరస్కరించాలనిఅన్నిపార్టీలకు, సంస్థలకు, సంఘాలకు, పౌర గ్రూపులకు, మత విభాగాలకు, జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. శాంతిరక్షణకుకృషిచేయాలనిఅసెంబ్లీ తీర్మానం కోరింది. ఇలాంటి దాడులు గతంలో చాలా జరిగాయనీ, కానీ గడచిన రెండు దశాబ్దాలలో జరిగిన అతిపెద్ద సంఘటన ఇదేనని ఆయన పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి ఘటనను చర్చించేందుకు జమ్మూ కశ్మీరు శాసనసభ అత్యవసర ప్రత్యేక సమావేశం నిర్వహించింది. పలువురు ఎంఎల్‌ఎలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. దాడిని వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీరు ఉపముఖ్యమంత్రి సురిందర్ చౌధరి తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణీ ఓటు ద్వారా తీర్మానం ఆమోదం పొందింది. ఈనెల 22న పహల్గామ్‌లో జరిగిన హత్యాకాండలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. వీరిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. మృతులకు శాసనసభ తొలుత నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సంతాప తీర్మానం చేసింది. ''శాంతి వాతావరణాన్ని పెంపొందించేందుకు, అభివృద్ధికి, అన్ని వర్గాల ప్రజలను మేళవించిసర్వసమ్మిళితమైన పురోగతిని సాధించేందుకు తిరుగులేని చిత్తశుద్ధిని జమ్మూ కశ్మీరు శాసనసభ ప్రకటిస్తున్నది. మతసామరస్యాన్ని దెబ్బతీసే ఉగ్రవాదుల దుశ్చర్యలను ఓడిస్తామని కృతనిశ్చయం ప్రకటిస్తున్నాం, జమ్మూకశ్మీరు ప్రగతి, దేశ ప్రగతికి కట్టుబడి ఉన్నాం'' అని తీర్మానంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి ఇళ్ళకు పంపడంలో తమ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.''జమ్మూకశ్మీరులో భద్రత బాధ్యతరాష్ట్రంలో ఎన్నికైన ప్రభుత్వానిది కాదు, కానీ బాధ్యతగా భావిస్తున్నాం, ఈ ఉగ్రవాద దాడి అవకాశాన్ని అసరాగా తీసుకుని జమ్మూ కశ్మీరుకు రాష్ట్రప్రతిపత్తి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ప్రస్తుత విషాద సమయంలో అడగదలచుకోలేదు,మరో సందర్భంలో అడుగుతాం, అడగడం మానుకోం, ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏ విధంగా రాష్ట్రప్రతిపత్తి పునరుద్ధరించమని కేంద్రాన్ని ఒత్తిడి చేయగలను? అని ఆయన అన్నారు. బైసరన్‌లో దాడి ఘటన కొత్తదేమీ కాదు, కానీ 21 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇలాంటి ఘటన జరిగింది. ఇలాంటి దాడులన్నీ మా దృష్టిలో గత చరిత్ర, కానీ దురదృష్టవశాత్తూ, పహల్గామ్‌లో ఈ దాడి పునరావృతమైంది, ఈ విధమైన దాడి మళ్ళీ ఎప్పుడు జరుగుతుందన్న విషయం మనకు తెలియదు, మరణించినవారి కుటుంబాలకు మాటలద్వారా నేను ఓదార్పు ఇవ్వలేను, నాకు మాటలు కరువయ్యాయి'' అని ఆయన అన్నారు.

## ముంబయి దాడిలో ఉగ్రవాది రాణాకు 12 రోజులు ఎన్‌ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ:** ముంబైలో ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాకు ఢిల్లీ కోర్టు 12 రోజులపాటు ఎన్ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ) కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ఐఎ ప్రత్యేక న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఈ ఉత్తర్వు ఇచ్చారు. ఇంతకు ముందు 18 రోజులు ఎన్ఐఎ కస్టడీలో ఉంచుతూ ఇచ్చిన గడువు పూర్తి కావడంతో మరో 12 రోజులు గడువు పొడిగించారు. వివిధ సాక్ష్యాలను ఇంకా రాబట్టాల్సి ఉందని ఎన్ఐఎ అధికారులు కోర్టుకు తెలియజేశారు. ఎన్ఐఎ తరపున సీనియర్ న్యాయవాది దయన్ క్రిష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేంద్ర మాన్‌లు వాదిస్తుండగా, నిందితుడు రాణా దర్యాప్తుకు సహకరించడం లేదు. న్యాయవాది పీయూశ్ సచ్‌దేవ రాణా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఢిల్లీ లీగల్ సర్వీస్ అథారిటీకి చెందినవారు. ముంబైలో దాడులతోపాటు అనేక దాడులకు అతడు సూత్రధారిగా ఉన్నాడనిఇ అధికారులు కోర్టుకు తెలియజేశారు. రాణాకు వైద్యపరీక్షలు చేయాలని కోర్టు తొలుత ఆదేశించింది. ప్రతి రెండు రోజులకూ తన లాయర్‌ను కలుసుకునేందుకు అతడికి అనుమతి లభించింది.


SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP25X 8375 | VASU MADIKONDA | TATA ACE | 2013 |
| 2 | TS03EM 6678 | KOMMIDI VENU | I10 GRAND 2ND GEN MAGNA DIESEL | 2015 |
| 3 | TS25C 5819 | DARMENDAR RASAMALLA | JOHN DEERE 5042 | 2019 |
| 4 | TS24G 1092 | SRIKANTH KOMMU | ERTIGA ZDI BS4 DIESEL 7 SEATER | 2013 |

AUCTION DATE : 03-05-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

## అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలని కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** కోదాడలోని సర్వే నెంబర్ 149లోని ఎన్ఎస్పి భూమి గవర్నమెంట్ ఆసుపత్రి భూమి, ఎన్‌హెచ్9 భూమి లేఅవుట్‌లోని ఇంటర్నల్ రోడ్స్ భూమి మొత్తం ఆరు ఎకరాల భూమిని వారసులకు పౌతికమ్మి ద్వారా సర్వే నెంబర్ 149/1, 149/2 గా నాగబండి వీరయ్య, నాగబండి వెంకటనర్సయ్యల పేరుతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వగా ప్రభుత్వ భూములను కొదవ పెట్టుట అమ్ముకొనుటకు చేసిన ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అన్యాక్రాంతమవుతున్న భూమిని కాపాడాలని కోరుతూ కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త పొడుగు హుస్సేన్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు దీక్షకు పూనుకున్నారు. దీంతో స్పందించిన అధికారులు మండుటెండలో దీక్ష చేస్తున్న హుస్సేన్‌ను అదనపు కలెక్టర్ రాంబాబు లోపలకు పిలిపించి రిప్రజెంటేషన్ ఇచ్చి రసీదు తీసుకొనుట జరిగిందని, వీటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కుదరవల్లి బసవయ్య, కనగాల నారాయణ, చిలంచర్ల రవీంద్రనాథ్ ఠాగూర్, జనార్ధన్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను సాధించుకుందాం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రపంచ కార్మికుల పర్వదినం మేడేను జయప్రదం చేయాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఎర్రజెండాలను ఎగురవేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఎఐటియుసి మండల అధ్యక్షులు బెజ్జం రమేష్‌లు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆనందరావు, నందిపాటి కనకయ్య, పిట్టా రామకృష్ణ, మాచర్ల రవి, సతీష్, వినోద్, సాహెబ్, యడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు పాల్గొన్నారు.






## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం

### కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం అని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల తీరును పర్యవేక్షించేందుకు భువనగిరి మండలం నందనం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. వసతుల కల్పనపై రైతులను అడిగి తెలుసుకుంటూ, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. రైతులు అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ముందస్తుగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఆనంతరం అధికారులతో మాట్లాడుతూ రైతుల తెచ్చిన ధాన్యాన్ని ప్రతిరోజు తేమ శాతాన్ని పరిశీలించి రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. రిజిస్టర్‌లో రైతు పేరు ధాన్యం వివరాలు సెల్ నెంబరు తప్పనిసరిగా ఉండి తీరాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తూ అదేరోజు రవాణా చేపట్టి మిల్లర్లకు తరలించాలన్నారు. కలెక్టర్ వెంట అధికారులు కొనుగోలు కేంద్రం నిర్వహణ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమస్యల పరిష్కారానికి వచ్చిన బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజల సౌకర్యార్థం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 28 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పి నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చి న ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు.

## ఇంటి నిర్మాణాన్ని అక్రమంగా కూల్చడం అన్యాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లోని 2014 సంవత్సరంలో తాను పుండరీకం ద్వారా 30.2 చదరపు గజాలను గుండా వెంకన్నకు విక్రయించినట్లు అనంతుల మల్లీశ్వరి తెలిపారు. సోమవారం ఆమె ఇంటి కూల్చివేసిన ప్రదేశంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటి స్థలాన్ని డాక్యూమెంట్ నెంబర్ 12698, 2017 సంవత్సరంలో గుండా వెంకన్న, రుద్రంగి కిరణ్ కుమార్ తండ్రి సత్యనారాయణకు విక్రయించినట్లు తెలిపారు. గుండా వెంకన్న, అనంతుల మల్లీశ్వరి నుండి ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసేసమయంలో విద్యానగర్‌కు చెందిన ఆంగోతు భావ్‌సింగ్ సాక్షిగా డాక్యూమెంట్‌పై సంతకం చేశారని తెలిపారు. కానీ ఇటీవల అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా భావ్‌సింగ్ ఫిర్యాదుతో రోడ్డు వైపు నిర్మాణం చేస్తున్నారని ఉద్దేశ్యంతో మున్సిపాలిటి అధికారులు దౌర్జన్యంగా కూల్చివేశారని వాపోయారు. మున్సిపాలిటి మాస్టర్ ప్లాన్ ప్రకారం 50ఫీట్ల రోడ్డు ఉండగా 40ఫీట్ల రోడ్డు వైపున కడుతున్నారనే అక్రమంగా కూల్చివేశారని తమకు న్యాయం చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండా వెంకన్న, రుద్రంగి సత్యనారాయణ ఉన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేది ప్రజలను పోరాటాలలో పాల్గొనేలా చైతన్యం చేసేది ఒక్క ఎర్రజెండా తప్ప ఇతర పార్టీలు కాదని సిపిఎం మాజీ ఎమ్మెల్సీ, మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సోమవారం భువనగిరిలోని సుందరయ్య భవనం నుండి వందలాది మందితో ప్రారంభమైన ప్రజా సమస్యల పాదయాత్ర జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో పరిపాలించిన బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయక ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన పరిస్థితి అందరు గమనించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒకటి రెండు తప్ప మిగతా అమలు చేయడంలో విఫలమయ్యారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య పాల్గొన్నారు.



# రాచకొండ భూములను కాపాడాలి

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** శివన్నగూడెం రిజర్వాయర్ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రాచకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చౌటుప్పల్ నారాయణపురం మండలంలోని ప్రతి ఎకరానికి సాగునీరు తీసుకొచ్చి ఈ ప్రాంత రైతుల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రెవిన్యూ శాఖ నిర్వహించిన తెలంగాణ భూభారతి చట్టం ( భూమి హక్కుల రికార్డు) 2025 మండల స్థాయి అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంతరావుస్వాగతం పలికి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరోజు జిల్లాల విభజన శాస్త్రీయ పద్ధతిలో జరగలేదనీ రాజకీయ అవసరాల కోసం జిల్లాలను కెసిఆర్ విభజించి రాష్ట్రాన్ని 33 ముక్కలు చేసి రాజ్య పరిపాలన చేశారనీ విమర్శించారు. పేద రైతుల భూములు పోవద్దు, పేదలు భూముల సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగొద్దనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ధరణిలో మ్యూటేషన్ చేయడానికి సవాలక్ష సమస్యలు రాచకొండ ప్రాంతంలో ఎన్నో రకాల భూ సమస్యలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులకు పోలీసులు అటవీ అధికారులతో వేధింపులు ఎక్కువయ్యాయిగతంలో మన ప్రభుత్వం లేకపోవడం వల్ల ఏమి చేయలేకపోయాము ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చింది. భూమి ని నమ్ముకున్న ఏ ఒక్క రైతుకు అధికారుల నుండి వేధింపులు ఉండకూడదని ఇక్కడ ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ప్రజల పక్షాన రెవిన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



**ప్రజాపక్షం/హాలియా:** పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త తన గుండెల్లో ఉంటాడని పార్టీకి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుంచుకుంటామని మాజీ సీఎల్పీ నేత ఏఐసీసీ సభ్యుడు కుందూరు జానారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్ నాయక్ కు ఆదివారం రాత్రి హాలియాలో ఆల్ ఇండియా బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా శంకర్ నాయక్ పార్టీకి ఎనలేని కృషి చేశారని శంకర్ నాయక్ లాంటి వాళ్లను పదుల సంఖ్యలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నేటి యువత నీతివంతమైన పాలనకు శ్రీకారం చుట్టాలని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిది అన్నారు. శంకర్ నాయక్ లాంటి నాయకులే ఇందుకు నిదర్శనం అన్నారు. ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించాలని సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం శంకర్ నాయక్ ను కుందూరు జానారెడ్డి ఎంపీ రఘువీర్ రెడ్డి ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. బంజారా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బంజారా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్ నాయక్,కోశాధికారి సక్రు నాయక్,కర్నాటి లింగారెడ్డి,కొండేటి మల్లయ్య, గోపగాని మాధవి ,మేరెడ్డి వెంకట్ రాహుల్, కుందూరు వెంకట్ రెడ్డి, కాల్ సాని చంద్రశేఖర్, కృష్ణా నాయక్, నరేందర్ రెడ్డి చంద్రా రెడ్డి, గౌని రాజా రమేష్ యాదవ్, పాండు నాయక్, సర్దార్ నాయక్, ముని నాయక్‌లు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** అకాల వర్షాల వల్ల పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో అకాల వర్షం కారణంగా రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరగడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పర్యటించి రైతుల యొక్క మామిడి తోటకు వెళ్లి తోట లో పరిశీలించడం జరిగింది. అదేవిధంగా వరి కల్లాలను వానకు తడిసిన వరి ధాన్యమును ఎమ్మెల్యే పరిశీలించడం జరిగింది. అనంతరం ధరూర్ మండల కేంద్రము వరి ధాన్యము కొనుగోలు సెంటర్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సందర్శించి ధాన్యమును పరిశీలించడం జరిగింది. ముఖ్యమంత్రి దృష్టికి వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ప్రతి ఒక రైతును ఆదుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హనమంతు, జిల్లా సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి పవర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1లో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల ప్రకారం ప్లాంట్‌లోని యూనిట్2ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా యూనిట్ 1ను(800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం) మే నెలలో ప్రారంభించేందుకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. కాగా బాయిలర్‌కు ఆయిల్ సరఫరా అవుతున్న క్రమంలో పైపులైన్‌కు ఏర్పాటు చేసిన గ్యాస్ వద్ద లీకేజీ ఏర్పడడంతో ఆయిల్ కింద ఉన్న మెటీరియల్స్‌పై పడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఉద్యోగులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించడంతో వారుక అక్కడికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రాణ నష్టం సంభవించలేదు కాని కేబుల్స్ కాలిపోవడంతో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. దీంతో ట్రయల్ రన్ పనులు పూర్తి కావాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న బ త్తుల లక్ష్మారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ ప్రమాదంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క టీజెన్‌కో సీఎం సం దీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్ఈఎల్ సీఎండీ సదాశివమూర్తి, వైటీపీఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.





## అమరవీరుల స్మారక భవనాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా పోలీస్ కార్యాలయంలో కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో అమరవీరుల స్మారక భవన పునర్నిర్మాణం ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యం.యల్.సి శంకర్ నాయక్ , జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఎస్పి,కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో అమరవీరుల స్మారక భవనాన్నీ నూతన హంగులతో తీర్చి దిద్దినందుకు జిల్లా పోలీస్ శాఖ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో గోనా రెడ్డి,నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి ఏ.ఆర్ డిఎస్పి శ్రీనివాసులు,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, సిఐలు రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి, ఆది రెడ్డి,రాజశేఖర్,కొండల్ రెడ్డి,ఆర్.ఐ సంతోష్, ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్నటువంటి కార్మిక సంఘాల మేడే సన్నాహక కమిటీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే కార్మిక దినోత్సవ మేడేను యాదగిరిగుట్ట పట్టణంలో అన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా మేడే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, తాపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బాల రాజు, పబ్బాల శ్రీరాములు, నాగపురి శ్రీను, ఆటో కార్మిక సంఘం కళ్లెం సిద్దులు, మన్సూర్ పాషా, నాగరాజు, ఆకుల శ్రీను మున్సిపల్ సంఘం పేరబోయిన స్వామి,జహంగీర్ చిన్న వ్యాపారస్తుల సంఘం చందు నాయక్, శ్రీను, ఉంగరాల సంఘం మునుకుంట్ల నరసమ్మ, కోనేరు శ్రీను, లైట్ మోటార్ వెహికల్స్ సంఘం ఒంటెద్దు సంజీవ, పొన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం




### జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 80 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యలపై, హౌజింగ్‌పై దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. తాహసిల్దార్లు పరిశీలించాలని పేర్కొన్నారు. వివిద శాఖలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నవని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 32, హౌజింగ్ 10, మున్సిపాలిటి 6, డిఆర్‌డిఏ 4, డిడబ్ల్యుఓ 3, ఇతర శాఖలకు సంబంధించినవి 25 మొత్తం 80 దరఖాస్తులు వచ్చినవని వీటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి డిప్యూటి సిఇవో శిరిష, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిండెంట్ శ్రీనివాసరాజు, డిఎస్‌వో రాజేశ్వరరావు, డిఎంహెచ్‌వో కోటాచలం, నర్సింహరావు, లత, బాపూజీ, డిఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

# భూ భారతితో సమస్యలు పరిష్కారం

### భూ భారతిపై అవగాహన సదస్సు
### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భూ భారతితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమౌతాయని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని స్వర్ణవేధిక ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సును కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం భవిషత్తులో రైతులు ఎక్కడికి వెళ్ళాల్సిన అవసరం లేదని, అధికారులే తమ గ్రామాలకు వచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టడం జరిగిందని,తదుపరి జిల్లా కి ఒక్కో మండలం తర్వాత జూన్ 2 నుండి రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి చిన్న సమస్యకు రైతులు జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంకు రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తుచేశారు. అంతకుముందు హుజూర్‌నగర్ ఆర్‌డీఓ శ్రీనివాసులు పిపిడి ద్వారా భూ భారతి చట్టం 2025ను గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్‌పిడిఓ లావణ్య,ఇంచార్జ్ తహశీల్దార్ రాజేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్,పిఎసిఎస్ చైర్మన్‌లు దొంగరి వెంకటేశ్వర్లు, నరేందర్ పాల్గొన్నారు.

### అన్ని భూ సమస్యలకు పరిష్కారం
### కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** భూ భారతి చట్టం ద్వారా భూముల అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయన సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంలో 23 సెక్షన్లు 19 రూల్స్ మొత్తం 42 అంశాలను పొందుపరిచినట్లు వాటి ద్వారా భూముల పూర్తి సమస్యలు తాసిల్దార్ కార్యాలయంలో పరిష్కారం అవుతాయని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం రైతులకు చుట్టమని, ఈ చట్టంతో గెట్టు సమస్యలు, పౌతి విరాసత్, సాదాబైనామా, మ్యూటేషన్, వారసత్వం లాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. ఆర్డీవో కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, తహసిల్దార్ నాగ దివ్య, ఎంపీడీవో ఇందిర, ఏవో రమాదేవి, డిప్యూటీ తహసిల్దార్ జయలక్ష్మి, ఆర్ ఐలు ఆసిఫ్, రామారావు పాల్గొన్నారు.





## బాలకృష్ణ చారి సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/డిండి:** సిపిఐ తౌక్లాపూర్ గ్రామశాఖ సినియర్ నాయకులు తంగెల్లపల్లి బాలకృష్ణ చారి సిపిఐ కి చేసిన సేవలు చిరస్మరణీయం ఆదివారం రాత్రి బాలకృష్ణచారి వర్ధంతి సందర్భంగా తౌక్లాపూర్ గ్రామంలోని ఆయన స్మారక స్థూపం వద్ద సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, సహాయ కార్యదర్శులు బయ్యా శ్రీను, ఎనమల్ల నవీన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు నరేష్, మహిళ సమాఖ్య గ్రామశాఖ కార్యదర్శి అనిత, ఏఐవైఎఫ్ గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు మహేష్, ఆదిల్, మల్లేష్, వెంకటేష్, శ్రీను, గోపాల్, శ్రీశైలం, రాములు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామనికి చెందిన ముచ్చర్ల కల్పన రాజు కుమారుడు శ్రేయన్స్ అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్య ఖర్చులు నిమిత్తం 54 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఆపదకు ఆదుకుంటున్న మైనంపల్లి రోహిత్ రావుకు సీఎం రేవంత్ రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు వెంకట్ దేశెట్టి లింగం, బక్కన్న గారి లింగం గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ముగ్గురు మంత్రులకు కాంగ్రెస్ శ్రేణుల ఘనస్వాగతం

**ప్రజాపక్షం/గజ్వేల్:** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారం వద్ద జరిగిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరు కాగా, వారికి కోమటిబండ వద్ద డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, భూం రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, నిమ్మ రంగారెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సత్కరించారు.



## పోలీసు కుటుంబానికి ఆర్థిక భద్రత



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** పోలీసు భద్రత పథకం పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు ఎండి బషీరుద్దీన్ గత సంవత్సరం గుండెపోటుతో మృతిచెందగా ఆయన సతీమణి గోరి బేగంకు భద్రత ఎక్స్‌గ్రేషియా రూ. 8 లక్షల చెక్కును సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు. వారి కుటుంబానికి రావల్సిన అనిన బెనిఫిట్స్ త్వరగా వచ్చేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు. పోలీస్ కుటుంబాల సంక్షేమ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ్ శంకర్ రెడ్డి, ఆర్‌ఐలు పెద్దన్న, అంజన్న, నాగుల్ మీరా, జిల్లా పోలీస్ కార్యాల ఎఒ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వర్మలు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన




**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రజలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి షీటీమ్ నిర్వహిస్తున్న విధులు, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాలపై షిటీం ఏఎస్ఐ శ్రీరాములు సోమవారం గజ్వేల్ లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాలు, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మవద్దని తెలిపారు. అలాగే సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉండాలని, మహిళల భద్రతకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత కాగా, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని, సామాజిక రుగ్మతలు, సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు కూడా ఉందని పేర్కొంటూ దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే, అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు ప్రత్యేక అంబులెన్స్ సేవలు ప్రారంభం



**ప్రజాపక్షం/ జైపూర్:** జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలో ప్రత్యేక అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. కమిషనర్ వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలోని మురికివాడలు, వృద్ధాశ్రమాలు, భవన నిర్మాణ కార్మికులు, హెచ్‌ఐవి బాధితులు, క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న కుటుంబాల వద్దకు ఈ అంబులెన్స్ వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. పది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు భీమారం, జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సేవలను ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో 998 మంది క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని, వారి కుటుంబ సభ్యులతో పాటు గుర్తించిన వారికి స్క్రీనింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా జైపూర్, హాజీపూర్, దండేపల్లి, జన్నారం, మందమర్రి, కాసిపేట, భీమిని, నిర్మల్, కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో ఈ అంబులెన్స్ ద్వారా వైద్య సిబ్బంది సేవలు అందిస్తారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, వైద్యుల ద్వారా తక్షణమే టీకాలు వేస్తారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ముస్తఫా, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, జిల్లా క్షయ ప్రోగ్రాం అధికారి సురేందర్, సాయి రెడ్డి, వేణు, శ్రీకాంత్, బుక్క వెంకటేశ్వర్, జిల్లా మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా భీమారం గ్రామంలో అంబులెన్స్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఒ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇతరులకు కూడా తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** ఆర్థిక ఇబ్బందులు అప్పుల బాధ తట్టుకోలేక వెల్దుర్తి పారిశుద్ధ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వెల్దుర్తి గ్రామానికి చెందిన ముల్కశేకులు (48) గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికుడిగా పని చేస్తున్నాడు మృతుడికి అప్పులు ఉండడం వల్ల ఇంట్లో తరచూ గొడవలు పడడంతో మనస్థాపం చెంది ఈరోజు తెల్లవారు జామున వెల్దుర్తి పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు.

# భూ భారతి చట్టంతో రైతులకు మేలు

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 రైతులకు మేలు చేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం దహేగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి నూతన చట్టంలోని అంశాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ ఎం. దేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025ను ప్రారంభించిందని తెలిపారు. ఈ చట్టంలోని అంశాల ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ప్రతి రైతు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రైతులకు భూమి ఎంతో ముఖ్యమైనదని, వారి కుటుంబం దాని పైనే ఆధారపడి జీవిస్తుందని, రైతులకు ఎలాంటి భూ సమస్యలు లేకుండా ఈ చట్టం ద్వారా పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. భూ భారతి చట్టంలో అటవీ, రెవెన్యూ సరిహద్దు సమస్యలను సంయుక్త సర్వే నిర్వహించి పరిష్కరిస్తారని, రికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకోవడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా ఈ చట్టంలోని అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైనదని పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ తర్వాత ప్రతి గ్రామానికి గ్రామ పాలన అధికారులు వస్తారని, ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలుతో గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం సులభమవుతుందని అన్నారు. ఈ చట్టం రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం 18 రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేసిందని, దీని ద్వారా భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయిందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్ట్ బి లో పెండింగ్‌లో ఉన్న భూములకు పరిష్కారం లభిస్తుందని, ధరణి పోర్టల్‌లో అవకాశం లేని సమస్యలను కూడా ఈ చట్టం ద్వారా పరిష్కరించవచ్చని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం కోసమే భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర్, తహసిల్దార్ కవిత, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూ భారతిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన భూభారతి కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు రెవెన్యూ యంత్రాంగాన్ని కోరారు. సోమవారం జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన తెలంగాణ భూభారతి చట్టం మండలస్థాయి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం భూభారతి ద్వారా లభిస్తుందన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళే భాద్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. సాదాబైనామాలకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదని, భూభారతిలో దీనిని పరిష్కరించనున్నామని, 9.26 వేల సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని, వాటిని న్యాయమైన వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ అవగవాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, తహసీల్దార్ బిక్షపతి, పిట్లం ఏఎంసీ చైర్మెన్ మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## న్యాయసేవలకు వచ్చే కక్షిదారుల క్షేమమే డిఎల్ఎస్ఎ లక్ష్యం


### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జివికె భరతలక్ష్మి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** న్యాయసేవల కొరకు వచ్చే కక్షిదారుల క్షేమమే జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థల ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవల సాధికార సంస్త ఛైర్మన్ జివికె భరతలక్ష్మి అన్నారు. సోమవారం కోర్టు భవన సముదాయంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తాపాన్ని తట్టుకోవటానికి చల్లటి నీరు ఎంతో అవసరమని అలాంటి చల్లటి నీటిని కక్షిదారులు, కోర్టుకు వివిధ పనులపై వచ్చే వారందరికి అందించటం మానవత్వాన్ని చాటుకునే గొప్ప అవకాశం అన్నారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్త ఆద్వర్యంలో ఇలాంటి పనులు చేయటం చాలా సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో న్యాయసేవా సాధికార సంస్త సెక్రెటరి జి. ఉదయ భాస్కర్ రావు, జూనియర్ న్యాయమూర్తులు, సూపరింటెండెంట్ శైలజ, రాజ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిరెడ్డి, మాణిక్ రాజ్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం

### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండలాధికారులు శ్రీనివాసరావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు మండలంలోని ఓత్కులపల్లి గ్రామ రైతులు ఆస్నాద్ శివారులో గల 55 ఎకరాల భూమికి సంబంధించి విరాసత్ పట్టా అమలు చేయాల్సిందిగా దరఖాస్తు చేసినారు. కన్నెపల్లి మండలంలోని కొండగొర్ల సత్తన్న తనకు ముత్తాపూర్ శివారులో కొంత భూమి ఉందని దానికి పట్టా ఇప్పించవలసిందిగా దరఖాస్తు చేసినారు. మంచిర్యాల మండల కేంద్రంలోని నంద్యాల చంద్రమౌళి రెడ్డి మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్, రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు, చట్ట వ్యతిరేక రిజిస్టార్ విధివిధానాలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు అందజేశారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని పల్లె లావణ్య ఎంసిఎ నందు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశానని జిల్లాలోని ఏదైనా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుని ఇప్పించవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. మంచిర్యాల కేంద్రంలోని సబ్బని శ్రీహిత, మందమర్రి పట్టణంలోని పాలేవార్ శ్రీకర్‌లు తాము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసామని కలెక్టరేట్లోని ఏదైనా శాఖలో ఉద్యోగం ఇప్పించవలసిందిగా వేరువేరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారులకు తెలియజేసి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు రూపొందించిన ప్రజాసంబంధ కార్యక్రమమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో 58 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూభారతి 14, ఎంప్లాయిమెంట్04, ఇందిరమ్మ ఇండ్లు06, పెన్షన్ 01, ఇతర సమస్యలు33 ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి, త్వరితగతిన పరిష్కారం చేయలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణికి 114 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జి ఆర్డీఓ స్రవంతి, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సమ్మర్ క్యాంప్, కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** వేసవి సెలవుల్లో అనుమతి లేకుండానే పాఠశాలలో సమ్మర్ క్యాంపు, కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల కోరారు. ఈ మేరకు సోమవారంప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేసి జ్వాల మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉమ్మడి నిజామాబాద్‌కు రెడ్ అలర్ట్ ప్రకటించి ఇంటి నుండి బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేయటం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. విద్యా సంవత్సరం ముగిసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ఇవి ఏవి మాకు పట్టవంటూ నిబంధనలు తుంగలో తొక్కుతూ నగరంలోని హెచ్‌పిఎస్, నిశిత, విశ్వోదయ లాంటి ప్రైవేట్ పాఠశాలలు సమ్మర్ క్యాంపులంటూ విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని ఇలాంటి యాజమాన్యాలపై జిల్లా విద్యాధికారి స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. మరోపక్క ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలల్లో కోచింగ్ సెంటర్లు అడ్వాన్స్ టెన్త్, ఐఐటి, జెఈఈ, నీట్ అంటూ విద్యార్థుల వద్ద నుంచి వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీస విద్యార్హత ఉందో లేదో చూడకుండా తరగతులు బోధిస్తున్నారు. కేవలం ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే జూనియర్ కళాశాలలో తరగతులు బోధించే వారిని సీనియర్లమంటూ కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. ప్రెసిడెన్సీ (ఆరవలి), శ్రీచైతన్య సిబిఎస్‌సి పాఠశాలలు భవనం నిర్మాణ దశలో ఉండగానే ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నిఖిత, ప్రవళిక పాల్గొన్నారు.



## చెక్కు పంపిణీ చేసిన పోలీసు కమిషనర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** గత సంవత్సరం నవంబర్ 27వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించిన రాథోడ్ ప్రతాప్ సింగ్, హెడ్ కానిస్టేబుల్, పోలీసు హెడ్ క్వార్టర్స్, విధులు నిర్వహిస్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరికి భద్రత ఎక్స్‌గ్రేషియా రూపంలో పదహారు లక్షల రూపాయల చెక్కును సోమవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య చేతుల మీదుగా రాథోడ్ ప్రతాప్ సింగ్ సతీమణి రాథోడ్ కౌసల్యకు అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డిసిపి (ఎఆర్) కె. రామచంద్రరావు, ఏ.ఓ అనిసాబేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ వనజ, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పాషా, డిపివో సీనియర్ అసిస్టెంట్ పి. రాజేశ్వర్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ఐసిసి జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 పిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పద్మజ రాణిలకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో రూ.12 కోట్లతో ఇండోర్ సబ్ స్టేషన్

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** పెరుగుతున్న జనాభాకు అణుగుణంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణంలో 12 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవి ఇండోర్ సెల్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో12 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా పటాన్చెరువు పట్టణంలో ఇండోర్ సబ్‌స్టేషణ్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. పాశమైలారం నుండి నేరుగా నూతన సబ్ స్టేషన్ కి ప్రత్యేక లైను వేయడంతో పాటు పటాన్చెరు రామచంద్రాపురం పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌లో వంద కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 132 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎంపిడీఓ యదగిరి విద్యుత్ శాఖ ఎడిఈలు సంజీవ్ ,నాగరాజు, రవికాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నివర్తి దేవ్, అంతిరెడ్డి, అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, షకీల్ ,ఐలేష్, హామీద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మానవ హక్కుల మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ నియామకం

**ప్రజాపక్షం/బీర్‌పూర్:** జాతీయ మానవ హక్కుల కమిటీ జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండధ్యక్షుడిగా చీర్నవేని శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిగా చిక్రం మారుతి , ఉపాధ్యక్షుడిగా గంగాధరి, పూర్ణచందర్‌గౌడ్ ప్రచార కార్యదర్శిగా రామకృష్ణ, గంగాధర్, కోశాధికారిగా యుయ్యాల కిషన్‌గా నియమిస్తు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ సమక్షంలో బీర్‌పూర్ మండల కార్యవర్గ నియామక పత్రాలను అందజేశారు. నియామక సమయంలో మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ప్రజల్లో హక్కుల పట్ల అవగాహన పెంపోందించేలా చర్యలు తీసుకోవాలని నూతన కార్యదర్శిని కోరారు. అనంతరం నూతనంగా నియామకమైన చీర్నవేని శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ తాన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కోలా రాజేషంగౌడ్, జగిత్యాల రూరల్ ప్రధాన కార్యదర్శి మ్యాన్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ కార్మిక దినోత్సవం జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** మే1న ప్రపంచ కార్మిక దినోత్సవంను జయప్రదం చేయాలని సిపిఐ మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి మండలంలోని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని, కార్మికుల కోసం ఒక రోజును 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8గంటల వివిధ కార్యక్రమాలకు విభజించగా దానిని కాదని 12గంటల పని బారాన్ని మోపాలని కేంద్ర ప్రభుత్వం చస్తోందని సిపిఐ మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి అన్నారు. మద్దూరు మండల కేంద్రంలో ప్రజాపక్షం మండల ప్రతినిధితో మాట్లాడుతూ... కార్మికులను కొన్ని ప్రవేటు షాపుల యాజమాన్యాలు 12 గంటలకు పైగ పనిని చేయిస్తూ, పనికి తగిన వేతనం కూడ ఇవ్వకుండా తమ ఇష్టారాజ్యంగా పనిని చేయిస్తున్నారని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక వ్యతిరేక విదానాలపై సంఘటిత పోరాటాలకు సిద్దం కావాలని యాదగిరి పిలుపునిచ్చారు.

## పోలీస్‌స్టేషన్ సందర్శించిన డిసిపి

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ని పెద్దపల్లి డిసిపి కరుణాకర్ రామగుండం ఎసిపి మడత రమేష్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు దస్త్రాలను పరిశీలించి ఎస్ఐఆర్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరించే దిశగా తీసుకోవాలని ఎస్ఐకి సూచించారు. అలాగే పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, వారికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, ముఖ్యమైన ప్రదేశాలు, ఈ ప్రాంతంలోని మావోయిస్టుల, వారి కుటుంబ వివరాలు, పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి. వాటిని ఏ విధంగా నియంత్రణ చేయాలి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. బాధితులకు పోలీస్ అండగా ఉంటూ సత్వర న్యాయం చేస్తారనే నమ్మకం భరోసాకలిగించే విధంగా ప్రవర్తించాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలపై, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎసిపి మడత రమేష్, ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యాధికారిపై కేసు ఉపసంహరించుకోవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** విధి నిర్వహణలో భాగంగా గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీ సందర్భంలో జిల్లా వైద్యాధికారిని దుర్భాషలాడి అధికారిపైనే పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్ 1 యూనియన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆరెల్లి లక్ష్మ ణ్, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి ఆలూరి సీతారామయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైద్యాధికారికి ఆసుపత్రి యాజమాన్యం భేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఆమెపై తప్పుడు ఫిర్యాదును వాపస్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ వాడడం తప్పని, ప్యాక్షనిస్టుల్లా వ్యవహరిస్తూ అధికారులను బెదిరింపులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రి యాజమాన్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట యూనియన్ సలహాదారులు శ్రీనివాస్ వినీత్, సంపూర్ణ, ఉపాధ్యక్షులు అట్టెం నాగమణి, సరస్వతి, వసంత, లక్ష్మి , వీ రేశం, శోభారాణి, ఎల్జిబత్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌లో దారుణ హత్య


**ప్రజాపక్షం /పెద్దపల్లి ప్రతినిధి :** వ్యవసాయ మార్కెట్లో దారుణ హత్య జరిగింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పొలం కుమార్‌ను ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన వేల్పుల సంతోష్ కత్తితో మెడపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. సమాచారం అందుకున్న పెద్దపల్లి డిసిపి పి కరుణాకర్, పెద్దపెల్లి సిఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడితో పాటు ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.


## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల పట్టణ 15వ వార్డు శంకులపల్లి లో మెప్మా ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన, గిరి నాగ భూషణం, ఆడువాల జ్యోతిలక్ష్మ ణ్, గోలి శ్రీనివాస్, బాల ముకుందం, తోట మల్లిఖార్జున్, మెప్మ ఏవో శ్రీనివాస్, ఏఈ అనిల్, చెట్‌పల్లి సుధాకర్, బోడ్ల జగదీష్, కుసరి అనిల్, కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, లైశెట్టి వెంకన్న, కత్రోజ్, గిరి, శరత్‌రావు, ములసపు మహేష్, ఏనుగుల రాజు, కుసరి రాజు, రంగు మహేష్, రవి,రవిశంకర్, గంగాధర్, మామిడి రాజు, రామిరెడ్డి, సాగర్, మధం, శేఖర్, రామిడి పాపయ్య, చిత్తారి రమేష్, నాయకులు రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం





**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన సంఘటన సిద్దిపేట హుస్నాబాద్ రహదారి నంగునూర్ మండలం రాంపూర్ క్రాసింగ జరిగింది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడెం సారయ్య (35), బండోజు గణేశ్‌లు ఇద్దరు వ్యక్తులు ఆదివారం రాత్రి 10 గంటలకు సిద్దిపేట నుండి బస్వాపూర్ వైపు వెళ్తుండగా నంగునూర్ మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద వరంగల్ బిఆర్ఎస్ సభకు వెళ్లి తిరిగి వస్తున్న తుఫాన్ వాహనం బైక్‌ను ఢీకొనటంతో తాడెం సారయ్య అక్కడికక్కడే మృతిచెందారు. బండోజు గణేశ్‌ను కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. ఈవిషయాన్ని తెలుసుకున్న సిద్దిదేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ అనిల్‌తో పాటు రాజగోపాల్‌పేట పోలీసులు అక్కడకు చేరుకొని తీవ్రగాయాలకు గురైన చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నక్రమంలో మార్గమధ్యలో మృతి చెందారు. రాజగోపాల్‌పేట పోలీసులు మృతిచెందిన తాడేం సారయ్య, బండోజు గణేశ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# భూ భారతితో రైతులకు మేలు

### జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పారదర్శకత, జవాబు దారీతనంతో పని చేసేలా ఈ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయస్థానం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్లపై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పిల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజులలోగా మ్యూటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు అందించడం జరుగుతుందని అన్నారు. భూ భారతి లో సులభమైన మోడల్స్ మాత్రమే ఉండి సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, తహసీల్దార్ నుండి సిసిఎల్ఏ వరకు ఆపిల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి, మేడిపల్లి మండల్ తహసీల్దార్ వసంత, ఎంపిడిఒ, రైతులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారంపై 4రోజుల్లో సమాచారం

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో జనవరి 30వ తేదిన ఉపాధి హామీ పథకం పనుల్లో మట్టి తవ్వుతున్న క్రమంలో మట్టి దిబ్బలు, రాళ్లు మిరిగి పడిన సంఘటనలో ఉపాధి హామీ కూలీలు కందారపు సరోజన, అన్నాడి మమత, తన కూతురు ఇద్దరు అక్కడిఅక్కడే మృతిచెందగా ఇంద్రాల రేనుక, మరో ఇద్దరు కూలీలు తీవ్రగాయాలు జరిగాయి. తీవ్రంగా గాయపడిన రేనుకను కాలు నుజ్జునుజ్జుకాగ కాలు తొలగించారు. ఈ సంఘటనను మానవహక్కుల కౌన్సిల్ జాతీయ చైర్మన్ శ్రీనివాస్‌రావు అదేశాలమేరకు సిద్దిపేట జిలా అధ్యక్షుడు పెందోట భూ శంకరాచారి సభ్యులతో కలిసి బాధితుల కుటుంబ సభ్యులను కలిసి పరమార్శించారు. సంఘటన వివరాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ రెడ్ లెటర్‌ద్వారా 4.2.25నాడు స్థానిక ఆర్‌డిఓ జిల్లా కలెక్టర్‌ను సిఎం కార్యాలయానికి బా ధితులకు చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు గాయపడినవారికి రూ.10లక్షలు నష్టపరిహారం ఇస్తూ వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కలించానలని కోరనైనది. అధికారుల నుంచి ఏలాంటి స్పందన లే క పోవడంతో ఢిల్లీ మానవహక్కుల కమిషన్ బాధిత కుంటుబ సభ్యులకు న్యాయం జరక్కపోవడంతో వెంటనే స్పందిచి బాధితులకు సష్టహర జా ప్యంపై నాల్గు రోజుల్లో పూర్తిసమాచారంఇవ్వాలని కలెక్టర్‌ను కోరింది.

## మే 1 నుంచి సమ్మర్ క్యాంప్

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం మే 1 నుంచి జూన్ 10వరకు ఉచితంగా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవులలో జిల్లాలోని అన్ని గ్రామాలలో 1 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థుల కోసం 400 మంది వాలంటీర్లతో 305 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గం.వరకు సమ్మర్ క్యాంప్ ఉంటుందని అన్నారు. ఈ సమ్మర్ క్యాంపుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు ఉండదని, పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, వాలంటీర్లు విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగే విధంగా గైడెన్స్ ఇస్తారని, సమ్మర్ క్యాంపులో అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పిల్లలపై మంచి ప్రభావం పడే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు గొప్ప లక్ష్యాలను ఏర్పరచు కోవడం నేర్పాలని, సమ్మర్ క్యాంపు ఉల్లాస వంతంగా నిర్వహిస్తూ జీవితానికి అవసరమైన ముఖ్య పాఠాలను బోధించడం, క్రీడలు, నీతి కథలు చెప్పడం, చదువు ప్రాముఖ్యత వివరించడం, విలువలు, మోరల్స్ బోధిస్తామని కలెక్టర్ తెలిపారు. సమ్మర్‌లో జరిగే సమ్మర్ క్యాంపును 1 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా సమ్మర్ క్యాంప్‌కు పంపాలని, వాలంటీర్లకు గౌరవ వేతనం కూడా ఇవ్వడం జరుగుతుందని ఈ సమ్మర్ క్యాంప్‌ను అందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కరీంనగర్ బస్టాండ్‌లో పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ బస్టాండ్‌లో చోటు చేసుకునే దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సోమవారం ఒక పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ అవుట్‌పోస్టును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ బస్టాండులో ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి, దొంగతనాల నియంత్రణకు ఈ అవుట్‌పోస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సిసి కెమెరాలను కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామని తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో మరో 15 సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులను కోరినట్లు వెల్లడించారు. ఈ పోలీసు అవుట్‌పోస్టులో 24గంటల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్టాండులో ప్రయాణికులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఈ అవుట్‌పోస్టును సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా జేబు, దొంగల చిత్రాలను కనిపించేలా ప్రత్యేక బోర్డులపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు దొంగతనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారని కమిషనర్ గుర్తు చేశారు. అతని వద్ద నుంచి 150 గ్రాముల బంగారం, 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తమ లగేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎసిపి వెంకటస్వామి, కరీంనగర్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐ రాజన్న, ఆర్‌టిసి అధికారులు ఎస్. భూపతి రెడ్డి (డిప్యూటీ రీజినల్ మేనేజర్, ఆపరేషన్స్, కరీంనగర్ రీజియన్), డిపో మేనేజర్‌లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఎటిఎం జి.సురేష్, కార్గో మేనేజర్ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులకేనా?

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబు ధ్వజం



**ప్రజాపక్షం/సైదాపూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అమ్మనగుర్తి, గుండ్లపల్లిలో గ్రామశాఖ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ నాయకులకేనా అని ప్రశ్నించారు. గ్రామాలలో కార్యకర్తలు సంక్షేమ పథకాలు అందక ఆవేదన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు అని పనిచేయమన్నారని, తీరా సమయం వచ్చాక ఎగనామం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తో పాటుగా కమ్యూనిస్టు కార్యకర్తలకు గ్రామానికి ఒక్కొక్కటి చొప్పున ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అది జరగని పక్షంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని, తద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ మాదిరిగా వ్యవహరించవద్దని, కలుపుకుని పోయేలాగా ఉండాలన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి సైదాపూర్ మండలంలో కమ్యూనిస్టులకు న్యాయం చేయాలని కోరారు. రానున్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడం కోసం గ్రామ గ్రామాన శాఖ మహాసభలను నిర్వహిస్తున్నామని, వచ్చే నెల 10న మండల మహాసభ నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామిలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు లంక దాసరి కళ్యాణ్, బాషవేణి ఓదెలు, ముష్కె రవి, కొమ్ముల రాజు, ముష్కె కమలాకర్, ముష్కె రాజు, బాషవేణి రాజు, గొర్రె ఓదెలు తదితరులున్నారు. గుండ్లపల్లి గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొమ్ముల రాజు, సహాయ కార్యదర్శిగా ముష్కె కమలాకర్ మరో 9మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అమ్మనగుర్తి శాఖ కార్యదర్శిగా బాషవేణి రాజు, సహాయ కార్యదర్శిగా ముష్కె రాజు, మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## రవీంద్ర అభ్యాస పాఠశాలలకు గుర్తింపు ఇవ్వొద్దు

### ఎఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా సమితి డిఇఒకు వినతి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించిన అభ్యాస, రవీంద్ర పాఠశాలలకు గుర్తింపు ఇవ్వకూడదని ఎఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా విద్యా శాఖాధికారిని కోరారు. నిబంధనలకు విరుద్ధంగాఉన్న ఆ పాఠశాలలకు అనుమతులు ఇవ్వద్దని జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రాముకు సోమవారం నాయకులు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ మాట్లాడుతూ మెట్పల్లి పట్టణ(మండల) కేంద్రంలోని ఇటీవల కాలంలో నూతన పాఠశాల ప్రారంభానికి దరఖాస్తు చేసుకున్నటువంటి అభ్యాస, రవీంద్ర పాఠశాలలు తప్పుడు ధృవపత్రాలు అందించినట్లు ఎఐఎస్ఎఫ్ దృష్టికి వచ్చిందని తెలిపారు. సరైన బిల్డింగు, గదులు, ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, ప్లే గ్రౌండ్ కనీస మౌలిక సదుపాయాలకు అనుగుణంగా బిల్డింగులు లేవని కనీసం పిల్లలకు అసెంబ్లీ సమయంలో ప్రార్థన చేయడానికి కూడా స్థలం లేదని, అట్లాగే కనీసం మోటర్ సైకిల్ కూడా వెళ్లడానికి అనుకూలంగా లేదని పేర్కొన్నారు. అక్కడ రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్య, హాస్పిటల్ బిల్డింగు పక్కనే ఏవైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే కనీసం అగ్నిమాపక యంత్ర వాహనం వచ్చే పరిస్థితి కూడా లేదని డీ ఈ ఓ దృష్టికి తీసుకువచ్చమని అక్రమ్ తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అనుమతుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటికీ అనుమతులు ఇవ్వకూడదని ప్రధానంగా ఏఐఎస్ఎఫ్ పక్షాన అయన డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు ఎఐఎస్ఎఫ్ వ్యతిరేకం కాదు విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నా పాఠశాలలకు ఎఐఎస్ఎఫ్ వ్యతిరేకమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు అరవింద్, నవీన్, సులేమాన్, దిల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక దినోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

### ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకుమే డే 139వ దినోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ మే1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా జరుపుకోవాలని అన్నారు. అమెరికాలోని చికాగో మహానగరంలో ఆనాటి నియంత నిరంకుశ బ్రిటిష్ పాలనలో పని గంటలు తగ్గించాలని పోరాటంలో రక్తం చిందించారని గుర్తు చేశారు. ప్రతి మనిషి రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాలని పని భారం తగ్గించాలని పోరాడి సాధించుకున్నారుని సంక్షేమ పథకాలతో పాటు పోరాడి సా ధించుకున్న 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోట్లుగా కుదించి నేడు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వ్యక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చారు అని అన్నారు. కార్మికులు రాజ్యాంగం ప్రకారం కల్పించిన చట్టాల ప్రకారం ఎనిమిది గంటల పని పాటు కనీస వేతనాలు సంక్షేమ పథకాలు అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పని భద్రత ఇఎస్ఐ పిఎఫ్ పెన్షన్ ఇవ్వాలని ప్రపంచ కార్మికుల చికాగో అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మేడే జెండాలను వాడవాడలా గ్రామాల్లో అన్ని మండల కేంద్రాల్లో జెండాలు అరుణ పథకాలు ఎగురవేస్తూ కార్మికులను చైతన్య పరచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, ఎఐటియుసి మండల కన్వీనర్ రాచర్ల సురేష్, గురజాల శేఖర్, నిమ్మ గంగాధర్, బైర కమలాకర్, క్యాస శంకరయ్య, వడ్లూరి మధు, సుంకే ప్రకాష్, కట్కూరు మల్లయ్య, ఆత్మకూరి రాజేశం, సిగిరి రాజ్ కుమార్, వడ్డేపల్లి ఆనందం, బొమ్మన నరసయ్య, బొమ్మన చింటూ, బొమ్మన ప్రదీప్, లింగయ్య, దొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం


### అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సత్పతి




**ప్రజాపక్షం/వీణవంక:** భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుందని, రైతులు భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం వీణవంక మండలం చల్లూరులోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం 2025 రూపొందించిందని తెలిపారు. భూభారతి చట్టం ప్రకారం సమస్యను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. అధికారి పరిష్కరించిన భూ సమస్యపై సంబంధిత అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు. కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలుంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ అవసరం లేకుండా అప్పీలు వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. గతంలో తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే చిన్న సమస్యలు సైతం కలెక్టర్ దగ్గరికి వచ్చేవన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు ఉండడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు సైతం బాధ్యతలు అప్పగించారని, దీని వల్ల చిన్న సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. భూమికి భూదార్ సంఖ్య కేటాయింపుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, తద్వారా భూ ఆక్రమణలు అరికట్టవచ్చన్నారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూభారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. ధరణిలో ఇప్పటికే ధరఖాస్తు చేసిన వారి సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రమేష్ బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

### మంత్రి సీతక్కకు ప్రభుత్వ విప్ అడ్లూరి వినతి

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు



**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. లక్ష్మ ణ్ కుమార్ ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్ సింగ్ ఠాకూర్‌లతో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మపురి నియోజకవర్గం లో సిఆర్ఆర్ గ్రాంట్ కింద పలు వంతెన పనులకు నిధు లు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామం నుండి పందులగుట్ట వరకు వంతెన నిర్మాణానికి రూ.లు 2కోట్లు, అలాగే ధర్మారం తెనుగువాడ నుండి ఎండపెల్లి ఎక్స్ రోడ్డు వ రకు బీటి రోడ్డు నిర్మాణానికి రూ.లు 3కోట్ల 20లక్షలు, మొత్తంగా రూ.లు 5కోట్ల 20లక్షల నిధులు మంజూరు చేయాలని విప్ లక్ష్మ ణ్ కుమార్ మంత్రి సీతక్కను కోరారు.

ఫోకస్

# యువతరంగం

## యువత ముందు ఎన్నో సవాళ్లు




నేటి ఆధునిక యుగంలో యువత ఎన్నో సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నది. నిరుద్యోగిత ప్రధాన సమస్యల్లోనే అత్యంత కీలకమైనది. చదువులు పూర్తిచేసిన తర్వాత అనేక మంది యువత ఉద్యోగం లేక నిరుద్యోగంగా ఉండిపోతున్నారు. ఇది నిరాశను కలిగిస్తుంది. ఆర్థిక ఒత్తిడి కూడా యువతను నిరుత్సాహపరుస్తున్నది. చదువు, జీవన ఖర్చులు, కుటుంబ బాధ్యతలు వంటివి యువతపై ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. తత్ఫలితంగా మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఒత్తిడి, నిరుత్సాహం, డిప్రెషన్ లాంటి మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది నిషేధిత పదార్థాలకు బానిసరవుతున్నారు. వ్యసన పరుగులుగా మారుతున్నారు. మత్తు పదార్థాలు, మద్యం, సిగరెట్లు వంటివి యువతను వ్యసనాల బారిన పడేలా చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కూడా యువతపై ఎక్కువగా ఉంది. సోషల్ మీడియా ద్వారా యువతలో తప్పుడు అభిప్రాయాలు, ఆకాంక్షలు పెరుగుతున్నాయి. ఇది ఆత్మనూన్యత భావన కలిగిస్తున్నది. విద్యా వ్యవస్థ లోపాలు సైతం యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రాక్టికల్ నైపుణ్యాలకన్నా సాంప్రదాయ విద్యపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల, యువత నైపుణ్యాల్లో వెనుకబడుతున్నారు. యువతలో కొంతమంది సవ్యంగా రాజకీయ వ్యవస్థను అర్థం చేసుకోలేకపోతున్నారు లేదా దానిపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. రాజకీయ పరమైన మార్పులు రాకపోవడానికి, కుటుంబ పాలనలు కొనసాగడానికి ఇదో ప్రధాన కారణం. ఇలాంటి సవాలక్ష సమస్యలతో యువత నిరంతరం పోరాడుతునే ఉంది.

## మార్గదర్శకులు..

యవ్వనంలో ఉన్న నాయకులు లేదా మార్గనిర్దేశం చేసే వ్యక్తులే యువ మార్గదర్శకులు. వీరు తమ తోటివారికి లేదా చిన్నవారికి ఆదర్శంగా నిలుస్తారు, వారికి సహాయం చేస్తారు మరియు సరైన దిశలో నడిపిస్తారు. యువ మార్గదర్శకులు వివిధ రంగాల్లో ఉండవచ్చు. పాఠశాలల్లో లేదా కళాశాలల్లో తమ సహచరులకు చదువులో సహాయం చేసే వారు, మంచి అలవాట్లు నేర్పే వారు.. క్రీడా జట్లలో తమ జట్టు సభ్యులను ప్రోత్సహించేవారు.. వ్యూహాలు పంచుకునే వారు... సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేసేవారు.. ఇతరులను ప్రేరేపించేవారు. ఇలా ఎన్నో రకాలుగా యువకులు అనేకులు భావితరాలకు మార్గదర్శకం చేస్తున్నారు. తమ కళ ద్వారా ఇతరులకు స్ఫూర్తినిచ్చే యువ కళాకారులు. సాంకేతికత, ఆవిష్కరణలు: కొత్త ఆలోచనలతో ఇతరులను ఆకర్షించే యువ శాస్త్రవేత్తలు లేదా ఆవిష్కర్తలు.. వీరంతా స్ఫూర్తిప్రదాతలే. తమ విజయాలు మరియు ప్రయత్నాల ద్వారా ఇతరులను ప్రోత్సహించేవారే. ఇలాంటి యువతీ యువకులు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తారు. తమ చర్యల ద్వారా ఇతరులకు నాయకత్వం వహించడం నేర్పుతారు. సానుకూల మార్పును తీసుకువస్తారు: తమ చొరవ, కృషి ద్వారా సమాజంలో మంచిని పెంపొందిస్తారు. నమ్మకాన్ని పెంచుతారు. తమ మద్దతు, ప్రోత్సాహంతో ఇతరులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయం చేస్తారు. మీరు కూడా ఒక యువ మార్గదర్శకులు కావచ్చు, మీ చుట్టూ ఉన్నవారికి సహాయం చేయడం, వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవచ్చు.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## ఉపాధికి ఎన్నో పథకాలు..

పది ఆలోచనలకంటే ఒక ప్రయత్నం మంచిది. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో, ఉపాధి పొందడానికి మార్గాలు అన్వేషించడం మేలు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి.

ప్రభుత్వ పథకాలు

**ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై):** పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి ఈ పథకం ఉద్దేశించబడింది.

**దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికెవై):** గ్రామీణ ప్రాంతాల్లోని పేద యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం దీని లక్ష్యం.

**ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన (పిఎంఆర్‌వై):** విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందిస్తుంది.

**ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పిఎంఇజిపి):** గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కొత్త స్వయం ఉపాధి వెంచర్లను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించడం దీని లక్ష్యం.

**నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్ఎటిఎస్):** సాంకేతికంగా అర్హత కలిగిన యువతకు వారి పని రంగంలో ఆచరణాత్మక జ్ఞానం మరియు నైపుణ్యాలను అందించే ఒక సంవత్సరం శిక్షణా కార్యక్రమం ఇది.

**నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్ఎపిఎస్):** అప్రెంటిస్‌షిప్‌ను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం యొక్క కొత్త పథకం.

**సీఖో ఔర్ కమావో (నేర్చుకో... సంపాదించుకో):** మైనారిటీ యువతకు వారి విద్యార్హతలు, ప్రస్తుత ఆర్థిక పోకడలు, మార్కెట్ సామర్థ్యం ఆధారంగా వివిధ ఆధునిక/సాంప్రదాయ నైపుణ్యాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం.

**స్టార్టప్ ఇండియా:** యువతలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి, కొత్త వ్యాపారాలను ప్రారంభించడానికి సహాయం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. స్టార్టప్‌లు వాటిలో ఒక భాగం.

### ఉపాధి కల్పించే ముఖ్య రంగాలు..

సేవల రంగం భారతదేశంలో యువతకు అతిపెద్ద ఉపాధి కల్పించే రంగాలలో ఒకటిగా ఉంది.

వ్యవసాయ రంగం ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువకులకు ప్రధాన ఉపాధి వనరుగా ఉంది. అయితే ఈ రంగంలో యువత నిశ్చితార్థం తగ్గుతోంది.

తయారీ రంగం కూడా ఉపాధి కల్పనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది.

నిర్మాణ రంగం కూడా గణనీయమైన సంఖ్యలో యువకులకు ఉపాధిని అందిస్తోంది.

ఐటి, డిజిటల్ సేవల రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తోంది.

గిగ్ ఎకానమీ కూడా అభివృద్ధి చెందుతోంది, ఇది యువతకు మరింత అనువైన ఉపాధి అవకాశాలను అందిస్తోంది.




### ఉపాధికి ఎదురవుతున్న సవాళ్లు..

అధిక నిరుద్యోగిత రేటు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మరియు విద్యావంతులైన యువతలో ఒక పెద్ద సవాలుగా ఉంది. చాలా మంది యువతకు సరైన నైపుణ్యాలు లేకపోవడం వల్ల ఉద్యోగాలు పొందడం కష్టమవుతోంది .స్త్రీలలో శ్రామిక శక్తి భాగస్వామ్యం తక్కువగా ఉంది. అనేక ఉద్యోగాలు తక్కువ వేతనాలు మరియు అసంఘటిత రంగంలో ఉండటం కూడా ఒక సమస్య.

### తీసుకోవాల్సిన చర్యలు..

విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నాణ్యతను మెరుగుపరచడం చాలా ముఖ్యం. పరిశ్రమ మరియు విద్యా సంస్థల మధ్య సహకారాన్ని పెంచడం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించవచ్చు. వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, కొత్త వ్యాపారాల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం ద్వారా మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చు. మహిళల కోసం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఉద్యోగ భద్రత, మంచి పని పరిస్థితులను నిర్ధారించడం చాలా అవసరం. భారతదేశ యువ జనాభా దేశాభివృద్ధికి ఒక గొప్ప వరం. సరైన విద్య, నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఈ యువ శక్తిని పూర్తిగా ఉపయోగించుకోవచ్చు.






## ఉద్యమిస్తున్న యువత

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో, వేరువేరు అంశాలపై యువతరం ఉద్యమాలను నిర్వహిస్తోంది. యువత తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మార్పు తీసుకురావడానికి ఉద్యమాల్లో ఎలా పాల్గొంటున్నారో చూడటం ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రపంచ యువజన ఉద్యమాలు చాలా వైవిధ్యమైనవి. అనేక రకాల కారణాల కోసం ఏర్పడ్డాయి. నిజానికి యువజన ఉద్యమాలకు చారిత్రక ప్రాముఖ్యత ఉంది. చరిత్రను తరచిచూస్తే యువత ఉద్యమాలు ముఖ్యమైన పాత్ర పోషించడం కనిపిస్తుంది. పాత తరం వారి ఆలోచనలను సవాలు చేస్తూ, సామాజిక మరియు రాజకీయ మార్పులకు వారు తరచుగా ముందున్నారు. ఈ ఉద్యమాలు శాంతి, పర్యావరణం, పౌర హక్కులు, విద్య, ఆర్థిక న్యాయం, అనేక ఇతర సమస్యలపై దృష్టి సారించాయి. నేటి యువత ఉద్యమాలు సాంఘిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ సాధనాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి, తద్వారా వారు వేగంగా సమీకరించగలుగుతున్నారు. తమ సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయగలుగుతున్నారు. ఈ ఉద్యమాలు కొన్నిసార్లు గణనీయమైన సామాజిక, రాజకీయ మార్పులకు దారితీస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో యువత ఉద్యమమే, ప్రధాని షేక్ హసీనాను పదవి కోల్పోయి, దేశం నుంచి పలాయనం చిత్తగించేలా చేసింది. అనేక దేశాల్లో యువజన ఉద్యమాలు ఆయా దేశాల్లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక విధానాలను మార్చాయి ప్రజల ఆలోచనలను ప్రభావితం చేశాయి. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ (Fridays for Future): గ్రెటా థన్‌బర్గ్ (Greta Thunberg) ప్రారంభించిన ఉద్యమం వాతావరణ మార్పులపై తక్షణ చర్య తీసుకోవాలని ప్రపంచ నాయకులను డిమాండ్ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది యువకులు ఇందులో పాల్గొన్నారు. ఎర్త్ ఫస్ట్! (Earth First!)అనేది మరింత తీవ్రమైన పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యక్ష చర్యను నమ్మే ఉద్యమం.

### పౌర హక్కులు, సామాజిక న్యాయ ఉద్యమాలు..

**అమెరికా పౌర హక్కుల ఉద్యమంలో విద్యార్థులు:** 1960లలో, నల్లజాతి విద్యార్థులు వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు, సిట్-ఇన్‌లు, ఇతర ప్రత్యక్ష చర్యలలో కీలక పాత్ర పోషించారు.

**బ్లాక్ లైవ్స్ మ్యాటర్** (Black Lives Matter): పోలీసుల దుష్ప్రవర్తన, జాతి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఈ ఉద్యమంలో యువకులు ముందున్నారు.

### రాజకీయ మార్పు కోసం ఉద్యమాలు..

**అరబ్ స్ప్రింగ్** (Arab Spring): 2010 దశకం ప్రారంభంలో మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో జరిగిన ఈ ఉద్యమాలలో నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యువకులు ముఖ్యమైన పాత్ర పోషించారు.

**హాంగ్‌కాంగ్ నిరసనలు** (Hong Kong Protests): వివిధ రాజకీయ మరియు సామాజిక సమస్యలపై జరిగిన ఈ నిరసనలలో విద్యార్థులు, యువకులు ప్రముఖంగా పాల్గొన్నారు.

**విద్యార్థి ఉద్యమాలు:** ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు విద్య యొక్క నాణ్యత, అందుబాటు, ఇతర సమస్యలపై తరచుగా ఉద్యమాలు చేస్తున్నారు.


**శాంతి ఉద్యమాలు:** యుద్ధం, హింసకు వ్యతిరేకంగా యువకులు నిరంతరం గళం విప్పుతునే ఉన్నారు.

### ప్రస్తుత పోకడలు..

నేడు, సాంఘిక మాధ్యమాలు యువతను సమీకరించడానికి, వారి సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడానికి శక్తివంతమైన సాధనంగా మారాయి. వాతావరణ మార్పులు, సామాజిక న్యాయం, మానసిక ఆరోగ్యం వంటి సమస్యలపై యువత ఎక్కువగా దృష్టి సారిస్తోంది. అంతర్జాతీయ సహకారం పెరుగుతోంది. వివిధ దేశాల యువకులు ఒకే సమస్యలపై కలిసి పనిచేస్తున్నారు. ఇది ఆహ్వానించదగిన మంచి పరిణామం.

## నేషనల్ హైవే భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి


ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగపూర్-అమరావతి నేషనల్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వందనం , కొదుమూరు గ్రామ రైతుల తో కలిసి నేషనల్ హైవే అధికారులు, జిల్లా కలెక్టర్‌ని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండపర్తి మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వెళ్ళేందుకు అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు ఇవ్వాలని, రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న వ్యవసాయ బావులకు, హార్టికల్చర్ పంటలైన పామాయిల్ , సుబాబుల్ దీర్ఘకాలిక పంటలకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరానికి నష్టపరిహారం బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం రూ.25 లక్షల నుంచి రూ.30లక్షలుకు పెంచాలని డిమాండ్ చేశారు. స్పందించిన కలెక్టర్ అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు పంట నష్టపరిహారం ఇచ్చేందు అంగీకారం తెలిపారు. మిగతా సమస్యలు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపుడి రవి, జిల్లా కోశాధికారి దొబ్బల వెంగళరావు, జిల్లా నాయకులు కొల్లి సీతయ్య , పెంట్యాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంట్యాల అప్పారావు, రైతులు రేగళ్ల వెంకటేశ్వర్లు, మధుసూధన్ రెడ్డి, జనగాం వెంకటేశ్వర్లు, నీరుడు గోవిందరావు, వేముల సతీష్, చిట్టిమోదు లింగయ్య, కంసాని కిరణ్, కూచిపుడి వెంకటేశ్వర్లు, ఆవుల సైదులు, నారపోగు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

సిపిఐ నేతలు మొహ్మద్ మౌలానా, దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతూ సిపిఐకి పూర్వ వైభవం తీసుకువద్దామని పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని జలగంనగర్‌లో అక్కడి సిపిఐ ఆధ్వర్యంలో వార్డుశాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. గతంలో ఈ ప్రాంతం సిపిఐకి పెట్టని కోటగా నిలుస్తూ ప్రజల పక్షాన పోరాడిందన్నారు. కార్పొరేట్ రాజకీయాలతో వన్నె తగ్గినప్పటికీ నిఖార్సైన కామ్రేడ్స్ పార్టీకి రక్షణ కవచంలా ఉన్నారన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో ఆ ఒరవడిని కొనసాగిస్తూ ప్రజలకు ఎర్రజెండా సాక్షిగా అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఐక్యంగా సంఘటితమై బలీయమైన శక్తిగా అవతరించాలని పిలుపునిచ్చారు. అనంతరం 16మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా రావూరి రామచంద్రయ్య, సహాయకార్యదర్శిగా ఎన్ నాగేశ్వర రావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ గద్ద నాయక్, రావుల శ్రీనివాస్, దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు

# మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం దేశవ్యాప్తంగా మే 20 జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఎఐటియుసి కార్యకర్తల సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందన్నారు. 2025-26 బడ్జెట్‌లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందన్నారు. సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్, పెట్టుబడిదారీ సంస్థలకు వేలకోట్ల రాయితీలు ప్రకటించిందన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యలు మరింత తీవ్ర రూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా అమలు చేస్తుందన్నారు. వీటికి వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్స్ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించారన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మే 1న జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు తమ యూనియన్ అడ్డాల వద్ద జెండాలు ఆవిష్కరించుకొని మేడే అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు అనస ప్రసాద్, సంఘీ ఏలేందర్, తాళ్లపల్లి జాన్ పాల్ గోవర్ధన్, ఎండి యాకూబ్, ఉప్పుల రవి, కలకోట రాజు, నాగవెల్లి శంకర్, యుగానందు చారి, నల్ల తీగల కుమార్, జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు

## అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత

ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధానకార్యదర్శి దాసు

**ప్రజాపక్షం/వేమనపల్లి/మంచిర్యాల :** అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా సోమవారం వేమనపల్లిలో మేడు ఉత్సవాఆల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని, ఎన్‌హెచ్‌ఎం వర్కర్లు, 2వ ఎఎన్ఎం, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక దినోత్సవం మే 1న జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు తమ యూనియన్ అడ్డాల వద్ద కార్మిక జెండాలు ఆవిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు దేవనబోయిన బాపు, అందే పురుషోత్తం, చిన్న శంకర్, నాగయ్య, మంజుల, కళావతి, శ్రీవాణి, తేజస్విని, మల్లేష్, తిరుపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## హక్కుల రక్షణకు ఉద్యమాలు

ఎఐటియుసి నేతలు సత్యనారాయణ, రాములు, ఇమ్రాన్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :**హక్కుల రక్షణకు ఉద్యమాలు చేయాలని ఎఐటియుసి యాదాద్రి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటువరం చేస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల మెప్పు కోసమే కార్మిక చట్టాలను కుదించాలని ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని దేశవ్యాప్తంగా కేంద్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సహాయ కార్యదర్శులు కూరేళ్ల మచ్చగిరి, గనబోయిన వెంకటేష్, గోపగాని రాజు, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, పల్లె శ్రీనివాస్, పుట్ట రమేష్, కౌన్సిల్ సభ్యులు చొప్పరి సత్తయ్య, దుబ్బాక సంజీవ, దాసరి లక్ష్మయ్య, పాపగళ్ల శంకరయ్య, ముదిగొండ బస్వయ్య, గౌరవంతల శ్రీనివాస్, పురుగుల రవి, ఎస్‌కె మన్సూర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక చట్టాల రద్దుకు పోరాడదాం





ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు నల్ల కార్మిక చట్టాల రద్దుకు ఐక్యంగా పోరాడుదామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ పెన్షనర్ల భవన్‌లో ఐక్య కార్మిక సంఘాల జిల్లా సన్నాహాక సదస్సు బొమ్మెన సురేష్ సిఐటియు, టియుసిఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి హరిత అధ్యక్షతన సోమవారం జరిగింది. సదస్సుకు ఎస్.విలాస్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాల అమలును తీవ్రతరం చేసిందన్నారు. స్కీం వర్కర్లయిన ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైంది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని పోరాటాలు చేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలని మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్నిరంగాల ఉద్యోగ, కార్మికులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌చారి, టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి , ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి సూర్యశివాజీ, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు ఖాజామొయినుద్దీన్ హాజరై మాట్లాడారు.

**కాగజ్ నగర్ :** కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశాయి. మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని రిటైర్మెంట్ ఎంప్లాయిస్ భవన్‌లో కార్మిక సంఘాల జిల్లా సదస్సు జరిగింది. సమావేశంలో బోగే ఉపేందర్ మాట్లాతేడూ కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని కోరారు. స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చాంద్‌పాషా, కార్మిక సంఘాల నాయకులు సత్యనారాయణ, సుధాకర్, కృష్ణమాచారి, తిరుపతి, పొచ్చన్న, భీమ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నీటి కష్టాలు తీర్చిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని 7వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో గత రెండు రోజుల నుండి తాగునీరు రాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజీవ్ కాలనీకి ఆనుకుని ఉన్న వ్యవసాయ పంట కాలువ నిర్మాణం జరుగుతున్న సమయంలో కాలనీకి తాగునీరందించే పైపు పగిలిపోయింది. ఈ నేపథ్యంలో కాలనీ వాసులకు గత రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు షరీఫ్, ఎ.రామారావు, పార్థసారధిలు సొంత ఖర్చులతో పగిలిన నీటి పైపుకు రాత్రి, పగలు శ్రమించి మరమ్మతులు చేయించారు. వేసవి కాలం కావటంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరా జరగటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నీటి సరఫరా యథాతథంగా జరగటంతో మహ్మద్ షరీఫ్, రామారావు, పార్థసారధిలకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వం రైతువద్ద ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వం రైతు వద్ద నుండి వడ్లను నేరుగా కొనుగోలు చేయాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ , సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమితి సింగారంలోని రైతు వడ్లు కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న వడ్లను కొంటామని చెప్పి ప్రకటించినది, ప్రతి సన్న వడ్లు కొంటామని చెప్పినటువంటి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు కొనరని వారు ప్రశ్నించారు. ఆరు కాలం కష్టపడి శ్రమించి పండించినటువంటి పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వం పంటను కొనుగోలు చేయకపోవడం వలన రైతు దిగాలుతో ఇబ్బంది పడుతున్నాడని ,అధికారులకు ఈ విషయం తెలిసిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలని రైతుల నుండి నేరుగా ప్రభుత్వం సన్నవడ్లు ను కొనుగోలు చేసి వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని, లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. రైతులు యనమల సుధాకర్, పి. శ్రీలత, వెంకటేశ్వర్ల గుండి, నారాయణ, నరసింహారావు, సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు జక్కుల రాజబాబు, ఎస్డి ఉమర్, రైతులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ షాపుల ద్వారా అమలు చేయబోతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించి, ముత్తగూడెంలో బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. అర్హులైన వారికి త్వరలో రేషన్ కార్డులు మంజూరు అవుతాయిని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, గుడూరు మాధవరెడ్డి, అధికారులు పాల్గొన్నా రు.

## వేతనాలు పెంపు ప్రభుత్వ హామీని అమలుపరచాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం ఐకెపి వివో ఏలు 10,000 వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని అట్టి హామీని అమలు పరచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఖాతాలలో జమ చేయాలని, ఐకెపి సిబ్బంది వేధింపులు ఆపాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలను వివోఏల వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని, నాణ్యమైన ట్యాబ్ లను అందించాలని, బలవంతపు రుణాలను అంటగట్టే విధానాన్ని ఆపాలని, ఆర్‌జిబి సభ్యుల వివరాలకు సమయాన్ని ఇవ్వాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ కలెక్టరేట్లో శ్రీజకు వినతి పత్రాన్ని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కల్లూరు మండలం వివోఏలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సీతామహాలక్ష్మి, ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా ఐకెపి వివో ఏల కన్వీనర్ వేము నాగమణి, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన జన విజ్ఞాన వేదిక వేసవి శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ సంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కొల్లికొండ మహేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రముఖ కవి, గాయకులు రౌతు రవి దేశమును ప్రేమించుమన్న అన్న గురజాడ గీతాన్ని నేర్పించారు.మిరాకిల్ ఎక్స్ పోజర్ ను ఎస్‌విఆర్ పురుషోత్తం, అలవాల నాగేంద్రం, అప్పారావు, వి. మోహన్ నిర్వహించారు. గాజు పెంకులపై నడవడం, అరచేతిలో హారతి కర్పూరం వెలిగించి మింగడం తదితర వాటిపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, ఎల్‌వి రెడ్డి, శివన్నారాయణ, అరుణశ్రీ, వి. మోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో పక్షపాతం వద్దు: ఐటిడిఎ పిఒ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం:** గిరిజన సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ అధికారులు పెద్ద ఎత్తున కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏలో నిర్వహించిన గిరిజన దర్బారుకుహాజరైన ఆయన పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరతం ఆయన మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పూర్తిగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని పరిష్కారానికి నోచుకోని వాటిపై సరైన నివేదికలు అందించాలన్నారు. మరో ప్రక్క రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులు జాబితా తయారీలో అధికారులు ఎలాంటి పక్షపాతధోరణికి లోనుకాకుండా నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ డేవిడ్ రాజు, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## వేగం పుంజుకోని
# ధాన్యం కొనుగోళ్లు

* జిల్లాలో పలు ప్రాంతాల్లో కళ్లాల్లోనే ధాన్యం * మబ్బులేస్తున్న ఆకాశం, ఆందోళనలో అన్నదాత * ఇప్పటి వరకు 10,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు * ఒక్క క్వింటాకు కూడా జమకాని రూ.500 బోనస్ * జిల్లాలో దళారుల హవా * క్వింటా పచ్చి ధాన్యం రూ.1600





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇంకా వేగం పుంజుకోలేదు. దీంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లపై ఆధారపడ్డ రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ఒక ప్రక్క పక్షం రోజులుగా ఆకాశం మబ్బు లు పడుతూ ఎండను కాస్తూ ఉంది. అక్కడక్కడా వర్షం కూడా పడుతోంది. పలు చోట్ల ధాన్యపు రాసులపై టా ర్పాలిన్లు, బరకాలు కప్పి ఉంచారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండి ంచిన ధాన్యం వర్షార్పణం అవుతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా అన్ని ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వేగంగా కొనుగోళ్లు చేస్తే మేలని పలువురురైతులు అంటున్నారు.

**10 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే:** జిల్లాలో ఇప్పటి వరకు1305 మంది రైతుల వద్ద నుండి కేవలం 10900 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో ఏగ్రేడ్, బిగ్రేడ్ ధాన్యం కూడా ఉన్నాయి. కాగా 1305 మంది రైతుల వద్ద నుండి ధాన్యం కొన్నప్పటికీ కేవలం 341 మంది రైతులకు చెందిన ఖాతాల్లోకి రూ.6 కోట్ల 63 లక్షల నగదును జమ చేశారు. మిగతా రైతుల్లో ఖాతాల్లో ఇంకా జమ చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 67వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయాల్సినే ఉంచనాలతో రంగంలోనికి దిగిన అధికారులు కొనుగోళ్ల విషయం వేగం పెంచడం లేదనే వాదన బలంగా ఉంది.

**రూ.500బోనస్‌ఆలస్యం:** సన్నాలు క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. కాగా ఇప్పటి వరకు సుమారు 10900 మెట్రి క్ టన్నులు కొనుగోళ్లు చేసినప్పటికీ ఆయా రైతుల ఖాతాల్లో బోనస్ నగదు జమకావడం లేదు. ఇదే విషయాన్ని సివిల్ సప్లై అధికారులను వివరణ కోరితే తమ లాగిన్ నుండి ప్రభుత్వ లాగిన్‌కు పూర్తి వివరాలు చేరాయని, మరోరెండుమూడురోజుల్లో మొత్తంబోనస్‌ఒకేసా రివిడదలై రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పుకొచ్చారు.

**జిల్లాలో దళారుల హవా:** జిల్లాలో ధాన్యం దళారుల హవా కొనసాగుతోంది. కళ్లాల్లో నుండే ఎత్తుకెళ్లిపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మడం ఇష్టం లేని వారు దళారులకు అమ్ముకుంటున్నారు. కళ్లాల్లోనే క్వింటా పచ్చిధాన్యం రూ.1600లకు తెగనమ్ముకుంటున్నారు. ధాన్యం కేంద్రాలకు వెళ్లాలంటే ఆరబెట్టి, కాపలాకాసి ఎత్తి, ఎగుమతి, దిగుమతి చేసి కాటాలు వేసి డబ్బులు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తుందని, కోసింది కోసినట్లు క్వింటా రూ.1600లకు అమ్ముకుంటే శ్రమైన తగ్గుతుందని రైతులు అంటున్నారు. మరో ప్రక్క పురుగులు, ఎరువులు ఉద్దరిచ్చిన వ్యాపారులు ముందస్తు ఒప్పందం ప్రకారం తక్కువ ధరకే రైతుల వద్ద నుండి తన్నుకుపోతున్నారు. ఇప్పటికైనా రైతులకు అవగాహన కల్పి ంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేలా చూ డాలని పలువురు రైతు శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

## లారీలకోసం రైతుల పడిగాపులు



**ప్రజాపక్షం/కల్లూరు:** దాల్వా వారి సాగు చేసిన రైతులు ధాన్యం నూర్పుడిలు చేసి అమ్మకానికి పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, చెన్నూరు, తాళ్లూరు వెంకటాపురం తాలూకా బంజర, మర్లపాడు, తెలగవరం తదితర గ్రామాలలో రైతులు ధాన్యం నిల్వ చేయ లేక కాపాడుకోలేక లారీల కోసం గత వారం రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తూ ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజు ఉదయం ఆరబోసి సాయంత్రం వర్షానికి తడవకుండా పరదాలు కప్పి ప్రతిరోజు నానా తంటాలు పడుతున్నారు. ధాన్యం రాశులు తూర్పాల బట్టి అమ్మేందుకు కల్లాలలో అంతా సిద్ధం చేసుకున్నా కూడా కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడం వలన పైగా అకాల వర్షాలు ప్రతిరోజు కురుస్తున్నందున రైతులు ధాన్యం పరిస్థితి ఏమవుతుందో ఏమో నాని వాపోతున్నారు. అధికారులు చర్య తీసుకుని స్పందించి ధాన్యమును కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

### సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటా లే మార్గమని సిపి ఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపా రు. నగరంలో సమస్యలను గుర్తిం చి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు సూచి ంచారు. సిపి ఐ ఖమ్మం నగర 53, 56, 58 డివిజన్ల సంయుక్త సమావేశం సోమవారం స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సైదా అధ్యక్షతన జరిగిన స మావేశంలో జానిమియా మాట్లాడుతూ ఖమ్మం నగరం దశాబ్ద కాలంలో విస్తరించిందని జిల్లాలోని నాలుగింట ఒక వంతు జనాభా ఖమ్మం నగరంలోనే జీవిస్తున్నారని ఆ యన తెలిపారు. తాగునీరు, రహదారులు , నివాస స్థలాల సమ స్య తీవ్ర ంగా ఉందన్నారు. వీటికి తోడు గత ప్ర భుత్వం దశాబ్ద కాలం పాటు రేషన్ కార్డు లు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జానిమియా తెలిపారు. నగరంలో పేదలను గుర్తించి వారందరికి నివాస స్థలాలు పంపిణీ చేయడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లను మ ంజూరు చేయాలని జానిమి యా డిమాండ్ చేశారు. నగరంలో డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి సమస్యలపరిష్కారానికి పోరాటాలు, ఆందోళనలు ని ర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూడా అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గసభ్యులు,కార్పొరేటర్‌బిజి క్లెమెంట్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు , నగర సహా య కార్యదర్శి , పట్టణనాయకులు,తదితరులుపాల్గొన్నారు.

## పకడ్బందీగా ‘నీట్’ ప్రవేశ పరీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం :** వైద్య కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం మే నాలుగున జరిగే నీట్ యుజి ప్రవేశ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసి నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అదనపు డిసిపి ప్రసాదరావు తో కలిసి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మంజిల్లా పరిధిలో మే నాలుగున జరిగే నీట్ యుజి ప్రవేశ పరీక్ష రాసే 2, 739 మంది విద్యార్థుల కోసం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిసిటివి మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. మే నాలుగున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతివ్వాలని మధ్యాహ్నం 1.30 నిమిషాలకు గేట్ మూసి వేయడం జరుగుతుందన్నారు. 1.40 నిమిషాల లోపు విద్యార్థులు డాక్యుమెంట్ వెరిఫికేషన్ (ఐడి కార్డు అలాటెడ్ సెంటర్) పూర్తి చేసుకుని పరీక్ష హాల్‌కు చేరుకోవాలని సూచించారు. నీట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా నోడల్ అధికారి నరేంద్ర కుమార్, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ,ట్రాన్స్‌కో ఎస్ఇ , తహాసీల్దార్లు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి:** కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సం ఘం పరిధిలో గల లక్ష్మీదేవిపల్లి మం డలం లోని అనిశెట్టి పల్లిలోధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం సొసైటి చైర్మన్ మండె వీర హను మంతరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్ల డుతూ ప్ర భుత్వం ఇస్తున్న క్వింటాకు 500 రూపాయల బోనస్‌ను ప్రతి రైతుకు అందించటమే లక్ష్యంగా మా సంఘ పరిధిలో మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించటం జరుగు తుంద ని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశం ను సద్వి నియోగం చేసుకోని ప్రభుత్వ మద్దతు ధర, బోనస్‌ను పొందాలని అన్నారు. రైతులు తప్పని సరిగా ధాన్యం తేమ 17 శాతం వచ్చే వరకు ఆరబె ట్టుకొని, ఎఇఒ వద్ద టోకేన్ తీసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొనిరావాలని అన్నారు .కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్,సంఘసెక్రటరి, రైతులుతదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చేందుకు ఎఐటియుసి కృషి

### డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య



**ప్రజాపక్షం/ఇల్లెందు:** గుర్తింపు సంఘం ఎన్నికలముందు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఎఐటియుసి పనిచేస్తుందని ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య పేర్కొన్నారు. కోయగూడెం ఉపరితల గని వద్ద సోమవారం ఉదయం షిఫ్ట్‌లో ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ సభలో మాట్లాడారు. యూనియన్ కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు జనరల్ మజ్దూర్లు యూ నియన్‌లో చేరగా వారికి ఎఐటియుసికేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య యూనియన్ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ మధ్యకాలంలో డైరెక్టర్, చైర్మన్ స్థాయిలో జరిగిన సమావేశంలో పెట్టిన డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరిస్తూ నేడు జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్‌లుగా మార్చి ఉత్తర్వులు జారీ చేశారని, మొట్ట మొదటి సారిగా 1998లో ఎఐటియుసిగుర్తింపు సంఘంగా ఎన్నికైనప్పుడు సింగరేణి కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టారని, అప్పట్లో కేవలం 2000లోపు ర్యాంకు సాధించిన ఉద్యోగుల పిల్లలకు మాత్రమే వర్తింపజేసేవారని 6000స్కాలర్‌షిప్ ఇచ్చారని తెలిపారు. 2010లో సవరిస్తూ 10వేలు ఇస్తున్నారని, 2000ర్యాంకు నుంచి 8000ర్యా ంకు వరకు పెంచి, 10వేల నుంచి 16వేలు పెంచి యాజమాన్యం ఉత్తర్వులు జారీచేయడం జరిగిందన్నారు.బ్రాంచి కార్యదర్శి , ఉపాధ్యక్షుడు , సహాయకార్యదర్శి , షిఫ్ట్ ఇంచార్జిలు , తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకురాలు తూము సుశీలమ్మ మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** దివంగత సిపిఐ నాయకుడు, అమరజీవి తూము ప్రకాశరావు సతీమణి, మాజీ సర్పంచ్ తూము సుశీలమ్మ (83)గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. బోనకల్ మండ లం రాయన్నపేట గ్రామానికి చెందిన సుశీలమ్మ ఉదయం లేవగానే తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే ప్రాణాలు వదిలారు. 1970 , 1980 దశకంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం పని చే సిన ప్రముఖుల్లో తూము ప్రకాశరావు ఒకరు. ప్రకాశరావు మరణం తర్వాత కమ్యూనిస్టు పార్టీకి ఆ కుటుంబం దన్నుగా నిలిచింది. ముఖ్యంగా సుశీల మ్మ తనదైన పద్ధతిలో కుటుంబాన్ని కాపాడుకుంటూనే పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చి నిలబడ్డారు. సుశీలమ్మ మనవలు బత్తినేని రాకేష్, ప్రకాష్ లు బత్తినేని చారిటబుల్ ట్రస్టు పేరుతో తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం విభిన్న రకాలసేవలను అందిస్తున్నారు. సుశీలమ్మ మృతి వార్త తెలియగానే సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శిదండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు తదితరులు సుశీలమ్మ మృతదేహంపై అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు అశ్రునయనాల మధ్య సుశీలమ్మ అంత్యక్రియలను బోనకల్ మండలం రాయన్నపేటలో నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,మండల కార్యదర్శి యంగళ ఆనందరావు, మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు , టిడిపి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం, ఎస్‌కెఎం జాతీయ కార్యవర్గ సభ్యులు నలమల వెంకటేశ్వరరావు, ప్ర ముఖ వైద్యులు పారుపల్లి గోర్కీ, సిపిఎం నాయకులు దొండపాటి నా గేశ్వరరావు, కిలారు సురేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉ న్నారు. వివిధ పార్టీల నాయకులు , సిపిఐ సీనియర్ నాయకులు ఆర్‌ఎంపిల సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. బత్తినేని చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు బత్తినేని నాగప్రసాద్, నీరజ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతులకు ‘భూ భద్రత’

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

### అశ్వారావుపేటలో వందపడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** ఆనాటి ధరణితో రైతులకు ఏర్పడిన కష్టాలు ఈనాటి భూ భారతితో రైతులకు సుఖాలు చేకూరుతాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతిచట్టంపై అవగాహన సదస్సును స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ నందు సోమవారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ముందుగా అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి ఆవరణంలో రూ.37.5కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదవాడి కన్నీరు తుడిచే విధంగా ప్రజలందరికీ ఉపయోగపడే నిజమైన చట్టాన్ని ఈ భూ భారతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేశామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 5.45లక్షల దరఖాస్తులను పరిష్కారం చేశామన్నారు. భూ సమస్యల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగనవసరం లేకుండా తహసీల్దార్లు ప్రతి గ్రామంలో రెవెన్యూ సభలు నిర్వహించడం ద్వారా దరఖాస్తులను సేకరించి వాటిని పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో వచ్చిన దరఖాస్తులను జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పరిష్కారాలు చూపుతామన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా మే 2వ తేదీ నుండి హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15నాటికి పరిష్కరిస్తామన్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో సుజాతనగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా 3500ఇండ్లను మంజూరు చేశామని, 20లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించటమే ఈ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం 8లక్షల19 వేల కోట్లు అప్పు మిగిలించినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎన్ని తలెత్తినా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి అమలులోకి వచ్చిందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని భూ సమస్యల పరిష్కారం దిశగా నియోజకవర్గ రివ్యూ మీటింగ్‌లో మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సుమారు 300మంది రైతులు చేసుకున్న దరఖాస్తులకు పరిష్కారమవుతాయన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా రైతులకు నమ్మకం, ధైర్యం భద్రత ఇవ్వ డం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంలో ఒక్కో సె క్షన్ ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిరోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్‌డిఒ మధు, మున్సిపల్ కమీషనర్ సుజాత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సిపిని కలిసిన వరల్డ్ పీస్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ బాధ్యులు వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లోని వారి కార్యాలయంలో కలిసి సంస్థ చేపడుతున్న శాంతి కార్యక్రమాలను సిపికి వివరించిగా మంచి కార్యక్రమాలు చేపడుతున్న సంస్థకు సహకారం అందిస్తామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 29న నిర్వహిస్తున్న మన పండుగలు కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ బి.సురేష్ లాల్, వ్యవస్థాపకులు మొహమ్మద్ సిరాజుద్దీన్, కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**పజాపక్షం/మహాదేవపూర్ :** యువత సన్మారంగలో నడచి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే అన్నారు.సోమవారం పలిమెల మండల కేంద్రంలో జిల్లా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాలు గడ్చిరోలి,బీజాపూర్,ములుగు,భూపాలపల్లి జిల్లాల పరిధిలోని క్రీడాకారులకు ప్రజా భరోసా వాలీబాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం,ఉత్సాహం కలుగుతుం దన్నారు. సరిహద్దు ప్రజలు యువతతో మమేకమవ్వడమే ప్రజా భరోసా క్రీడల ఉద్దేశమన్నారు. యువత మంచి విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత భవిష్యత్తు కోసం కష్టపడా లన్నారు. క్రీడలో మహారాష్ట్ర, గర్చిరోలి, ఛత్తీస్ గడ్, బీజాపూర్, ములుగు, భూపాలపల్లికి చెందిన 105 టీంలు పా ల్గొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్,ఏఆర్ అదనపు ఎస్‌పి వేముల శ్రీనివాస్, కాటారం డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, మహాదేవపూర్ కాటారం సిఐలు రాంచందర్ రావు,నాగార్జున రావు,ఎస్సైలు రమేష్,పవన్ కుమార్, తమాషారెడ్డి, మహేందర్,క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉపాధి పని దినాలను పెంచాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని దినాలను పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో కర్రె లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, సంవ త్సరానికి 200 రోజులు పని దినాలు పెంచాలని, పనివేళలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు టెంటు, వాటర్, మెడికల్ కిట్లు అందించాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనికి రెండు లక్షల కోట్లు కేటాయించి, గ్రామీణ పేదలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా రైతుల వ్యవసాయ పనులకు పెట్టుబడి భారం తగ్గాలంటే గ్రామీణ ఉపాధి పని రైతుల వ్యవసాయ పనులకు అనుసంధానం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కారం

### అదనపు కలెక్టర్లు పింకేష్, రోహిత్ సింగ్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జనగామ జిల్లా అదనపు క లెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి దరఖాస్తులను అధికారులకు కలిసి స్వీకరించారు. స్టేషన్‌ఘనపూర్ మండలానికి పలువురు వివిధ సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఇలా సుమారు 58 మంది వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో అధికారులకు ధరఖాస్తులు అందజేశారు. వచ్చిన దరఖాస్తులపై ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో సమీక్షి ంచారు. ప్రజావాణి దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తుల విషయంలో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ మన్సూర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జయ శంకర్‌భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజావా ణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిం చాల ని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కా ర్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవె న్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మా ట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం సమర్పి ంచిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించేందు కు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కారం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవి, అన్ని శాఖల జిల్లా అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/తొర్రూరు :** మండలంలోని వెలికట్ట గ్రామం, పెద్దవంగర మండలం కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తనిఖీ చేసి ధాన్యానికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, వేసవి కాలం నేపథ్యంలో కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, ధాన్యానికి సంబంధించిన రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు త్వరగా వారి ఖాతాలో జమ అయ్యే విధంగా సంబంధిత కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా గన్ని సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, స్థానిక తహశీల్దార్‌లు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై అసత్య ప్రచారం సరికాదు

### మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** బిఆర్‌ఎస్ రజితోత్సవ సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కెసిఆర్ అసత్య ప్రచారాలు చేశారని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కెసిఆర్ అధికారంలో ఉన్నపుడు ప్రజా స్వామ్య వ్య వస్థను భ్రష్టు పట్టించారని, ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా ధర్నాచౌక్‌ను ఎత్తివేశానని, అక్రమ కేసులు పెట్టారన్నారు. రాజకీయ పబ్బం గడుపు కోవడానికే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి అంటున్నారని, 10ఏళ్ల పాల నలో వారి అవినీతి, అక్రమాలకు అధికారులను వాడుకున్నారని,అప్పుడు వత్తాసు అధికారులు కొందరు దేశం విడిచి పారిపో గా మరికొందరు జైలుకు వెళ్తున్నారన్నారు. 10ఏళ్లలో చేయలేనివి 16నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసే ముందు ఆధారాలు చూసుకొని మాట్లాడాలని, ఇప్పటికైనా అసత్య ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు నాగరాజు,నాయిని, రేవూరి మాట్లాడుతూ సభలో మొత్తం కాంగ్రెస్‌ని దూషిస్తూ అబద్ధాలు, నిందలు మోపుతూ, అసత్య ప్రచారాలు చేసిన మాజీ సిఎం కేసీఆర్..140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌ని నాయకులను నిన్న సభలో అవహేళన చేశాడన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు వెళుతున్న తరంలో ప్రజల్లో ఆదరణ కోల్పోతున్న బిఆర్‌ఎస్ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం మీద బురద జల్లుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, అమెర్ అలీఖాన్, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబఎల్లి స్వర్ణ,మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, వరద రాజేశ్వర్ రావు, గ్రంధాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎండి రియాజ్, పిసిసి జనరల్ సెక్రటరీ కూచన రవళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన

### రాజకీయ విమర్శల్లో అవాస్తవ ప్రచారాలు సరికాదు
### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** అప్రకటిత కరెంట్ కోతలు లేకుండా చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో రూ.2.14కోట్లతో 33/11 విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి శంకుస్థాపన చేసారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ పాల్గొన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలు చేసి, సాంకేతిక అవసరాలు పూర్తిచేశామని చెప్పారు. రాజకీయ విమర్శల్లో అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. గృహాలకు పవర్ కట్ లేకుండా చర్యలు తీసుకున్నామని, సాంకేతిక అవసరాలకు మాత్రమే పవర్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎక్కడైనా పవర్ కట్ ఉంటే చెప్పాలన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చిన వారిని సన్మానించారు.

## సంస్థాగత నిర్మాణంతోనే కాంగ్రెస్ పటిష్ఠం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** సంస్థాగత నిర్మాణంతోనే కాంగ్రెస్ పటిష్ఠమవుతుందని, నాయకులు,పార్టీ శ్రేణులు సంస్థాగత నిర్మాణం చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం పై సోమవారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మకొండ జిల్లా, వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపిలు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా నుండి ప్రాతినిధ్యం వహి ంచే టిపిసిసి నాయకులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులతో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేం దర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా అబ్జర్వర్లుగా కే.వినయ్‌రెడ్డి, మాక్సూద్ అహ్మద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్లు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మా ణం లో భాగంగా ఖాళీగా ఉన్న అన్ని కార్పొరేషన్ సంస్థలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్టు, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సోమవారం జిల్లా స్థాయి సమావేశంలో, గ్రామశాఖ,మండల, పట్టణ, బ్లాక్ స్థాయి కమిటీలకు సుమారు 5గురి పేర్లతో ప్రతిపాదనలు పం పాలని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే వారిని సూచించాలన్నారు.హన్మకొండ, వరంగల్‌జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లు బస్వరాజు సారయ్య,అమీర్ అలీఖాన్, ఎంఎల్‌ఏలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు,మాజీ ఎంపిలు సిరిసిల్ల రాజయ్య, పసునూరి దయాకర్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, డిసిసిబి డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పిసిసి నేతలు దొమ్మాటి సాంబయ్య, కూచన రవళి పాల్గొన్నారు.

## చారిత్రక సభలకు వేదిక వరంగల్

### బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** బిఆర్‌ఎస్ రజితోత్సవ సభ విజయవంతం అయిందని, తాము అనుకున్నట్లే ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారని మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం బిఆర్ ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే మరో చారిత్రక సభకు వరంగల్ వేదికగా నిలిచిందన్నారు.60 సంవత్సరాల తెలంగాణ కలను సహకారం చేసింది కెసిఆర్ అని, దేశంలోనే తెలంగాణను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపారని, ఇప్పుడు 16 నెలలో ప్రజల తరపున ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామన్నారు. నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సభను విజయవంతం చేసిన తెల ంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నడూ కూడా డ్యూటీలు చేయని ఆర్‌టిఒలు మొన్న రోడ్ల పై డ్యూటీలుచేసి చెకింగ్‌లు చేశారని,స్కూల్ బస్సులకు ఫైన్‌లు వేయటం, వరంగల్ స్కూల్ యజమానులు స్వచ్ఛందంగా బస్సులు ఇస్తే వారికీ ఇబ్బందులు పెట్టడం జరిగిందన్నారు. తన నియోజకవర్గంలో ఒక్క స్కూల్ యజమాని బస్సు ఇవ్వకుండా చేశారు. కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలు సభ లు పెడతారు...కానీ ఇలా చెడగొట్టే పని చేయటం కరెక్ట్ కాదు అని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏనాడూ ఎవరు సభ పెట్టు కున్నా ఇబ్బంది పెట్టలేదు అని,సభకు భద్రత కల్పించడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ 25 సంవత్సరాల ఉత్సవానికి 120 ఎకరాల్లో సభ ఏర్పాటు చేసి కెసిఆర్ సూచనలతో సభను నిర్వహించామని, సభ కోసం రైతులు భూములు ఇచ్చారని, ప్రభుత్వం మేము పర్మిషన్ కోసం అప్లై చేసి 10 రోజులు గడిచినా పర్మిషన్ రాలేదు అని, పర్మిషన్ ఇవ్వకుంటే కోర్టు ద్వారా పర్మిషన్ తెచ్చుకున్నామన్నారు. వరంగల్‌లో భూపాలపల్లిలో ఎన్నడూ లేని విధ ంగా జాబ్ మేళా... బస్సులు పెట్టి... భోజనం పెట్టారని, సభను విఫలయం చేయాలనీ చూశారని, కానీ జనం తరలి వచ్చారన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ న్కాలు ఎల్, వాసుదేవరెడ్డి, జోరిక రమేష్, భరథ కుమార్‌రెడ్డి, పులి రజినీకాంత్, యాకూబ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిప్పలు తప్పించేందుకే భూభారతి

### అవగాహన సదస్సులో మంత్రి పొన్నం




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** కొత్త ఆర్‌ఓఆర్ చట్టం భూభారతి రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ శ్రీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంగర బిడ్డ మాజీ ప్రధాని పివి నరసింహారావు ఎన్నో భూసంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ధరణి చట్టం వచ్చిన తరువాత అనేక భూ సమ స్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎంఆర్‌ఓలకు అధికారాలు కల్పించి మండల స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారమయ్యే మార్గం భూభారతిలో ఉందన్నారు. అధార్‌లాగా భూములకు భూధార్ అందించనున్నట్లు తెలిపారు. 2014 తరువాత పహనీలు లేక ఏండ్ల క్రితం అమ్ముకున్న వారిపేర ధరణి రికార్డులలో కనిపించాయన్నారు. సుమారు 40లక్షలు భూసమస్యలు ధరణి వల్ల వచ్చాయన్నారు. భూ రికార్డులలో పొరపాట్ల వల్ల అనేక వేధింపులు ఆత్మహత్యలు జరిగినట్లు చెప్పారు. భూభారతితో నిజమైన హక్కు దారుడికి భూమి చెందుతుందని తెలిపారు. అనంతరం ఎస్‌సి కాక్పొరేషన్ ద్వారా 22మంది లబ్ధిదారులకు వందశాతం సబ్సిడీతో రూ.50వేల చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్‌డిఒరాథోడ్ రమేష్, తహసీల్ధార్, ప్రవీణ్, ఎంపిడిఒ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం 2025 ద్వారా భూ సంబంధ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. భూ భారతి చట్టంపై తొర్రూరు, పెద్దవంగర మండలాల రైతులకు రెవెన్యూ సదస్సును తొర్రూరులోని రైతు వేదికలో అవగాహన జిల్లా కలెక్టర్ అద్వై త్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేశ్ తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి ఆర్డీఓ గణేశ్ పీపీటీ చదివి రైతులకు, ప్రజలకు భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం 2025పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన సులభతరమైన సామాన్యరైతులు, ప్రజలు, బడుగు, బలహీన వర్గాల భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త నూతన భూ భారతి చట్టం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకోవడం కోసం పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామని రైతులు, ప్రజలు, అన్ని వర్గాల వారు ఈ నూతన రెవెన్యూ చట్టంపై అవగాహన పెంచుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎవరు రెవెన్యూ రికార్డులు నిర్వహణ సిబ్బంది లేక పోవడం సమస్యలు అనేకంగా మిగిలిపోయాయి అని, ప్రస్తుత రెవెన్యూ చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ సదస్సులో ఏడీ ఎస్‌ఎల్‌ఆర్ ఎ.నర్సింహామూర్తి, స్థానిక తహశీల్దార్లు మహేందర్, శ్రీనివాస్, ఎంపీడీఓలు వేణుమాధవ్, పూర్ణచందర్‌రెడ్డి, ఏడీఏ విజయ్ చంద్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక

#### సామాన్య ప్రజల సత్వర సేవలకు భూ భారతి
#### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** క్షేత్ర స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం పణాళికతో ముందుకు సాగుతున్నామని సామాన్య ప్రజల సత్వర సేవలకు భూభారతి చట్టమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మహాదేవపూర్ పలిమెల మండల కేంద్రంల్లోని రైతు వేదికలలో నిర్వహించిన భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై అవగాహన కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నూతన చట్టం ధరణి చట్టంలోని వ్యత్యాసాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రభుత్వం భూ సమస్యల పరరిష్కారానికి అవసరమైన ధరణి చట్టస్థానంలో నూతన చట్టం తెచ్చేందుకు అన్ని జిల్లాలలో, రైతులు, మేధావులు,ప్రజల సలహాలు సూచనలను పరిగణలోకి తీసుకుని పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో అమలౌతున్న చట్టాలను కూలంకషంగా అధ్యయనం చేసి భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టంపై తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ఆటా పాటా ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మహాదేవపూర్, పలిమెల తహసీల్దార్లు ప్రహ్లాద్ రాథోడ్, అనీల్, ఎంపిడిఒ వెకటేశ్వర్లు, శ్రీనివాస్, వ్యవసాయ అధికారి శ్రీపాల్, నాయబ్ తమసీల్దార్ కృష్ణ, పిఎసిఎస్ చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు,మాజీ ఎంపిపి రాణీ బాయి రామారావు, నాయకులు వామన్ రావు,కట్కం అశోక్, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మేడేను ఘనంగా నిర్వహించాలి

### ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్
### కెటికె 1లో మేడే పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో అన్ని మైన్స్, డిపార్టమెంట్‌లలో కార్మికులు మేడే వేడు కలను ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఏరి యాలోని కెటికె వన్ ఇంక్లైన్లో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ చేశారు. రమేష్ మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలో అన్ని గనులు, డిపార్టుమెంట్లలో మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం కార్మికులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ సదయ్య, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఫిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కెటికె ఒసి3లో మేడే పోస్టర్ ఆవిష్కరణ :** కెటికె ఒసి 3 అండర్ గ్రౌండ్ మైన్‌లో ఎఐటియుసి ఫిట్ సెక్రటరీ ఎల్.శంకర్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎం.విజేందర్ చేతుల మీదుగా ఎఐటియుసి మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, షిఫ్ట్ ఇన్ చార్జిలు, పిట్ కమిటీ సభ్యులు, క్యాంటీన్ కమిటీ సభ్యులు, మైన్స్ కమిటీ సభ్యులు,సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు. భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ లో ఎఐటియుసి ఫిట్ సెక్రటరీ నల్ల రమేష్ అధ్యక్షతన కాంట్రాక్ట్ కార్మికుల ఇన్‌చార్జి నూకల చంద్రమౌళి, తాళ్ల పోషం లు ఏఐటియుసి మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు నల్లవేణి సతీష్, గుండేటి, రవికుమార్, పిట్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, డి శ్రీనివాస్, అరుణ్, శ్రీనివాస్ కార్యకర్తలు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

### మేడే విజయవంతం చేయాలి

#### బిల్డింగ్ కన్స్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్

మే 1న జరిగే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బిల్డింగ్ కన్స్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం భూపాలపల్లి కొమురయ్య భవన్‌లో ఎఐటియుసి బిల్డింగ్ కన్స్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదల వెంకటేష్ హాజరై మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా నిర్మాణరంగంలో పనిచేస్తున్న భవననిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున భూపాలపల్లికి తరలివచ్చి మే డే 1న మేడేను ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లపెల్లి సతీష్, రాణి, మేకల సమ్మయ్య, రాకేష్, భైరవేణి ఓదేలు, జోడి స్వామి, బండారి లావణ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి ముందుకు సాగాలి

### ఇందిరమ్మ కమిటీల్లో నామినేటెడ్ పోస్టులు సిపిఐకి కేటాయించాలి
### ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలిసిన సిపిఐ నేత అజయ్‌సారధి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి ఆధ్వర్యంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎమ్మెల్యే మురళీనాయక్ దృ ష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ కమిటీల్లో సిపిఐకి స్థానం కల్పించాలని, భవిష్యత్‌లో నామినేటెడ్ పోస్టు ల్లో సిపిఐకి భాగస్వామ్యం కల్పించాలని ఆయన ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపి ఐ కాంగ్రెస్ కలిసి కట్టుగా పనిచేసి ఘన విజయాలు సాధించామని, భవిష్యత్‌లో ఒకరికొకరు సమన్వయంతో ముందుకు సాగాలని వారు తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకా ల్లో సిపిఐ నేతలను కా ర్యకర్తలను భాగస్వామ్యం చేసుకుని రానున్న సర్ప ంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ రానున్న కాలంలో సిపిఐని కలుపుకుని సంక్షేమ పథకాల్లో అన్ని విధాలుగా కలిసికట్టుగా ముందుకు సాగుతామన్నారు. అలాగే డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డిని కూడా కలసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలతో సిపిఐ నియోజకవర్గ నాయకులు పెరుగుకు మార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగాచారి, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, మా మిండ్ల సాంబలక్ష్మి , చొప్పరి శేఖర్, భైసస్వామి, లింగ్యానాయక్, వెలుగు శ్రావణ్, తూటి వెంకట్‌రెడ్డి, చిర్ర సత్యానారాయణ, ఎండి ఫాతిమ, కమ టం ఉపేందర్, జలగం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## 2028 నుంచి ఐపిఎల్‌లో 94 మ్యాచ్‌లు?




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి (2028) ఐపిఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్‌లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్‌లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

### ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది

ప్రస్తుతం ప్రతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఒకే గ్రూప్‌లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్‌లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి.

## అదరగొట్టిన.. గుజరాత్ బ్యాటర్లు!



### రాజస్థాన్ లక్ష్యం 210

వరుస విజయాలతో జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్ మరోసారి భారీ స్కోర్ కొట్టింది. శుభ్‌మన్ గిల్(84)కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. జోస్ బట్లర్(50 నాటౌట్) తన విధ్వంసాన్ని కొనసాగించి అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. ఆఖర్లో వాషింగ్టన్ సుందర్(13) ధనాధన్ ఆడగా.. ఆర్చర్ వేసిన 20వ ఓవర్లో రాహుల్ తెవాటియా(9) సిక్సర్ బాదడంతో గుజరాత్ స్కోర్ 200 దాటింది. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి బట్లర్ రెండు పరుగులు తీయగా గిల్ బృందం నిర్ణీత ఓవర్లలో 209 పరుగులు చేసింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన రాజస్థాన్ విజయంతో పరువు కాపాడుకుంటుందా? గుజరాత్ బౌలర్లకు దాసోహం అవుతుందా? అనేది చూడాలి. జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు తేలిపోయారు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు చెలరేగగా భారీగా పరుగులిచ్చారు. టాస్ ఓడిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(39) ఎప్పటిలానే శుభారంభం ఇచ్చారు. పవర్ ప్లేలో రాజస్థాన్ బౌలర్లను చీల్చి చెండాడుతూ స్కోర్ బోర్డును ఉరికించారు. దాంతో, గుజరాత్ పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 53 పరుగులు చేసింది. 6వ ఓవర్ తర్వాత జోరు పెంచిన గిల్ హసరంగ ఓవర్లో సింగిల్ తీసి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో సుదర్శన్ సైతం దంచేయగసాగాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ఎట్టకేలకు థీక్షణ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో సుదర్శన్ పెద్ద షాట్ ఆడబోగా.. రియాన్ పరాగ్ క్యాచ్ సూపర్‌గా అందుకున్నాడు. దాంతో, 93 వద్ద గుజరాత్ తొలి వికెట్ పడింది.

### 26 బంతుల్లోనే ఫిఫ్టీ

సుదర్శన్ ఔటయ్యాక జోస్ బట్లర్(50 నాటౌట్) జతగా గిల్ వీరవిహారం చేశాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్నఅతడిని థీక్షణ ఔట్ చేసి రాజస్థాన్‌కు బ్రేకిచ్చాడు. కానీ, ఆ తర్వాత బట్లర్ బాదుడు షురూ చేశాడు. స్వీప్ షాట్లతో అలరిస్తూ స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించిన బట్లర్ ఆఖరి ఓవర్లో డబుల్స్ తీసి 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ సీజన్‌లో అతడికిది నాలుగో ఫిఫ్టీ. గుజరాత్ బ్యాటర్లలో వాషింగ్టన్ సుందర్(13) రాణించాడు. దాంతో, ప్రత్యర్థికి 210 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది గిల్ బృందం.

## జింబాబ్వేకు తైజుల్ షాక్




స్వదేశంలో జింబాబ్వేతో జరగుతున్నరెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టుబిగిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి నుంచి తేరుకున్న బంగ్లా.. తైజుల్ ఇస్లాం(560) విజృంభణతో జింబాబ్వేను సమర్థంగా కట్టడి చేసింది. టాస్ గెలిచిన పర్యటక జట్టుకు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(21), బెన్ కర్రాన్(21)లు శుభారంభం ఇవ్వగా.. జింబాబ్వే స్కోర్ దూసుకెళ్లింది. అయితే.. బెన్నెట్‌ను ఔట్ చేసిన తంజిమ్ హసన్ బంగ్లాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత నిక్ వెల్చ్(54), సీన్ విలియమ్స్(67)లు అర్ధ శతకాలతో చెలరేగి ఆతిథ్య జట్టు బౌలర్లను అలిసిపోయేలా చేశారు. దాంతో, టీ సమయానికి 2 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసిన పర్యాటక జట్టు పటిష్ట స్థితిలో ఉంది. అయితే.. ఆ తర్వాత సీన్ మారిపోయింది. టీ సెషన్ తర్వాత మళ్లీ బంతి అందుకున్న తైజుల్ ఇస్లాం(560) జింబాబ్వేను గట్టి దెబ్బకొట్టాడు. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విజృంభణతో ఆఖరి సెషన్‌లో అనూహ్యంగా 7 వికెట్లు కోల్పోయింది. ప్రధాన ఆటగాళ్లు పెవిలియన్ చేరిన వేళ వికెట్ కీపర్ తఫజ్వా స్సిగా(18 నాటౌట్), బ్లెస్సింగ్ ముజరబని(2 నాటౌట్)లు ఆలౌట్ ప్రమాదాన్ని తప్పించారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్లు కోల్పోయి 227 రన్స్ చేసింది. బంగ్లా బౌలర్లలో నయీం హసన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

## 'మెగాస్టార్'కి సిస్టర్‌గా సీనియర్ హీరోయిన్?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ రాబోతుంది. ఐతే, ఈ మూవీలో స్టార్ హీరోయిన్ నయనతార నటించనున్నట్లు, ఆమె భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా మరో క్రేజీ రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగాస్టార్ కి సిస్టర్ రోల్ ఉందని.. ఈ పాత్ర చాలా ఎంటర్టైనింగ్ టోన్‌లో సాగుతుందని.. ఈ పాత్రలో సీనియర్ హీరోయిన్ జ్యోతిక నటించబోతుందని టాక్ నడుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి. కాగా ప్రస్తుతం వైజాగ్‌లో అనిల్ రావిపూడి తన టీమ్‌తో సెకండ్ హాఫ్ స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నాడు. సెకండ్ హాఫ్ లో చిరంజీవి పాత్రకి ప్రత్యేకమైన యాస మరియు బాడీ లాంగ్వేజ్‌ను అనిల్ రావిపూడి డిజైన్ చేస్తున్నారట. అదేవిధంగా సినిమాలో పూర్తిగా కామెడీపై దృష్టి సారిస్తున్నారు. ఇక ఈ సినిమా గురించి మెగాస్టార్ ఆ మధ్య మాట్లాడుతూ.. 'ఈ సినిమా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమని.. ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని చిరు ఆల్ రెడీ చెప్పారు. అన్నట్టు, అనిల్ రావిపూడి చెప్పే సీన్స్ గురించి కూడా మెగాస్టార్ చెబుతూ.. 'సినిమాలో ఆయా సన్నివేశాల గురించి అనిల్ రావిపూడి నాకు చెబుతుంటే కడుపుబ్బా నవ్వుతున్నాను. ఈ సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది' అని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తారని చిరు తెలిపారు.

# రీల్

## అప్పట్లో నా ఎత్తు అతి పెద్ద సమస్య

– మీనాక్షి చౌదరి



టాల్ బ్యూటీ మీనాక్షి చౌదరి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సాలిడ్ హిట్ కొట్టింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగా ఒక రాజు' సినిమాలో నటిస్తోంది. ఐతే, మీనాక్షి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు చెప్పింది. ఇంతకీ, మీనాక్షి చౌదరి ఏం చెప్పింది అంటే 'నా చిన్నతనంలో ఇతరులతో మాట్లాడడానికి నేను చాలా ఇబ్బంది పడేదాన్ని. ఎందుకంటే కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. ఈ కారణంగా నాతో చాలా మంది డిస్టెన్స్ మెయింటైన్ చేసేవారు' అంటూ చెప్పుకొచ్చింది. మీనాక్షి చౌదరి ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి అప్పట్లో నా ఎత్తు నాకు అతి పెద్ద సమస్య. ఆ సమయంలో నాకు చాలా బాధగా కూడా అనిపించేది. ఇక ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరీక్షించుకో అని సలహా ఇచ్చారు. దీంతో అందాల పోటీల్లో పాల్గొన్నాను. ఇండస్ట్రీకి వచ్చాను. ఇక్కడ వచ్చిన ప్రతి ఆఫర్ సద్వినియోగం చేసుకున్నాను' అని మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది.

## ఆయనతో మాట్లాడనిదే ఏమీ తోచదు

– మోహన్ లాల్



హీరో మోహన్‌లాల్ వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకుంటూ ఇటు తెలుగు ప్రేక్షకుల్నీ సైతం మెప్పిస్తున్నారు. అయితే, తాజాగా ఆయన కొన్ని ఆసక్తికర విశేషాలు చెప్పుకొచ్చారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. 'నలభై ఎనిమిదేళ్ల కెరీర్‌లో నేను సినిమాను ప్రేమించినంతగా దేన్నీ ప్రేమించలేదు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే నాలుగైదు చిత్రాలకు ఓకే చెబుతుంటా. నిజానికి నాకు విశ్రాంతి తీసుకోవడం, ఖాళీగా ఉండటమంటే అస్సలు నచ్చదు. అందుకే, ఎప్పుడూ సినిమాల్లో బిజీగా ఉంటాను' అంటూ మోహన్ లాల్ చెప్పుకొచ్చారు. మోహన్ లాల్ తన కోరిక గురించి మాట్లాడుతూ.. 'మమ్ముట్టి నా ప్రాణ స్నేహితుడు. తనతో కలిసి దాదాపు యాభై సినిమాల్లో నటించాను . ఇంకా మరిన్ని చిత్రాల్లో కలిసి పని చేయాలనేదే నా కోరిక. రోజుకి ఒక్కసారైనా తనతో మాట్లాడనిదే నాకేమీ తోచదు. మా మధ్య పోటీ ఉంది అని అందరూ అనుకుంటారు. కానీ, మా మధ్య మంచి స్నేహం ఉంది' అని మోహన్ లాల్ చెప్పారు. అలాగే, తాను అయ్యప్ప స్వామి భక్తుణ్ని. అప్పుడప్పుడు మాల వేసుకుని.. కాలినడకన శబరిమల వెళ్లి ఇరుముడి సమర్పించి వస్తుంటా' అని మోహన్ లాల్ తెలిపారు.

## రాష్ట్రంలో 31 పట్టణాల మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పన

ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ తయారీ

తుది దశలో 11 పురపాలిక మాస్టర్‌ప్లాన్‌లు

మరో 20 పురపాలికల మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పనకు కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పట్టణ ప్రాంతాలలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు లేకుండా విస్తరిస్తున్న పట్టణాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులు తొలగించి, భవిష్యత్‌లో చేపట్టే అభివృద్ధి పనుల కోసం రాష్ట్రవ్యాప్తంగా దశల వారిగా పట్టణాలలో మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెల్సిందే. అందులో భాగంగా హెచ్‌ఎండిఏ వెలుపల ఉన్న 20 పట్టణాలలో ఈ మాస్టర్‌ప్లాన్ రూపకల్పన సాగుతోంది. మాస్టర్ ప్లాన్‌ల ముసాయిదాలను ఈ ఏడాది ఆగస్టు 15లోగా తుది రూపు ఇవ్వడానికి మున్సిపల్ శాఖలోని డిటిసిపి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా పట్టణాల జిఐఎస్ మ్యాపింగ్ కోసం డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నారు. దీనివల్ల నగర ప్రణాళిక, గ్రామీణ అభివృద్ధి సంచాలకులు (డిటిసిపి) మ్యాపింగ్ ద్వారా మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**ఎంపిక చేసిన 20 పురపాలికలు..**

అర్మూర్, బదేపల్లి, భైంసా, బోధన్, గద్వాల్, జనగాం, కాగజ్‌నగర్, కోదాడ, కోరుట్ల, ఖమ్మం, మంచిర్యాల్, మందమర్రి, మేదక్, మేట్‌పల్లి, పాల్వంచ, సిరిసిల్ల, తాండూరు, వికారాబాద్, వనపర్తి, జహీరాబాద్ ఉన్నాయి. ఈ మాస్టర్ ప్లాన్‌లను అటల్ మిషన్ ఫర్ రిజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్(అమృత్) II ప్రణాళిక కింద రూపొందిస్తున్నారు. 2024 జూలైలో దీనికి పరిపాలనా అనుమతి లభించింది. 20 పురపాలికలలో 17కి ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌లు సిద్ధమయ్యాయి. ఇందులో అర్మూర్, బదేపల్లి, కోదాడ నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలుగా ఉన్నాయి. 50,000 నుండి ఒక లక్ష జనాభా ఉన్న పురపాలికలను అమృత్ II ద్వారా మాస్టర్‌ప్లాన్‌లు రూపొందిస్తున్నారు. డ్రోన్ సాంకేతికత ద్వారా జియోడేటాబేస్ తయారీకి, బేస్ మ్యాప్ సిద్ధం చేయడానికి సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. బేస్ మ్యాప్ తయారీ అనంతరం ప్రాథమిక, ద్వితీయ సర్వేల ద్వారా ప్రస్తుత మౌలిక సదుపాయాల వివరాలను సేకరిస్తారు.

అనంతరం ఈ డేటాను విశ్లేషించి, ప్రస్తుత భూ ఆధారితంగా మ్యాపింగ్ చేస్తారు. తదుపరి ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు వాటిపై సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నారు.

**చివరి దశలో మొదటి దశ మాస్టర్‌ప్లాన్ ప్రణాళికలు..**

అమృత్ I దశలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధి బయట ఉన్న 11 పట్టణాల కోసం మాస్టర్ ప్లాన్‌లను సిద్ధం చేశారు. వీటిలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ, సిద్దిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం ఉన్నాయి. ఇందులో నల్లగొండ, వరంగల్, నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌లు పూర్తి చేసి ఆమోదించారు. ఖమ్మం, మహబూబ్ నగర్, సూర్యాపేట, కరీంనగర్, మిర్యాలగూడలకు సంబంధించిన ప్లాన్‌ల రూపకల్పన చివరిదశలో ఉన్నాయి. మిగిలిన పట్టణాల మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు.



నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణా రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రామకృష్ణారావుకి అభినందనలు తెలిపారు.
ప్రజాపక్షం/హైదరాబాద్ :

## బాధిత మహిళలకు జాతీయ కమిషన్ అండ

జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కార్

ప్రజాపక్షం/హైదరాబాద్: బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా నిలుస్తుందని జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్ అన్నారు. హైదరాబాద్ టూరిజం ప్లాజాలో సోమవారం ఏర్పాటు చేసిన మహిళా బహిరంగ విచారణలో ఆమె పాల్గొని కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో మొదటి సారిగా బహిరంగ విచారణను ఏర్పాటు చేసి మహిళా బాధితుల నుండి 60 వరకు దరఖాస్తులు స్వీకరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కమిషన్ హైదరాబాద్ పరిధిలో 2022 నుండి 2024 ఉన్న కేసులలో సత్వరమే 30 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఎక్కడ కూడా అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపకుండా మహిళా కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. అన్ని రాష్ట్రాలలో నెలలో నాలుగు సార్లు కమిషన్ బాధిత మహిళల వద్దకు వెళ్లి సత్వర న్యాయం చేసి అండగా నిలుస్తున్నామని అన్నారు.

పెండింగ్ కేసుల అంశాలను నివేదిక రూపంలో సత్వరమే అందించాలని పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ విశ్వ ప్రసాద్, అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, డిసిపి లావణ్య, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వర రావు, వయోవృద్ధుల శాఖ అధికారి రాజేందర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆశన్న, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, బాధిత మహిళా కుటుంబాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యత అధికారులదే

(మొదటి పేజీ తరువాయి)

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్‌ఎంఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూభారత్ చట్టం అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ చదివి వినిపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ తమ భూ సమస్యలకు సంబంధించి ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాగా వాటికి భూభారతి చట్టం ద్వారా ఉన్న పరిష్కారం మార్గాలను ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక తహసిల్దార్ జగత్ సింగ్ తెలియజేశారు. రైతులు ఈ చట్టానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. పలువురు రైతులు ధరణి పోర్టల్ ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు, భూ సమస్యల పరిష్కారం కోసం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా లభించనున్న పరిష్కారం గురించి సభా వేదిక వద్ద మంత్రుల సమక్షంలో వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే విధంగా చట్టాలను అమల్లోకి తీసుకువస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను అందులోని అంశాలను పరిశీలించి, రాష్ట్రవ్యాప్తంగా మేధావులు, రైతులు సలహాలు సూచనలతో రూపొందించిన మార్గదర్శకాలతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.భూ సమస్యలు ఉన్న మీ ఇంటి వద్దకే రెవెన్యూ అధికారులను పంపించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తారన్నారు.

సాదా బైనమా అంశాలను ధరణిలో పొందు పరచలేదన్నారు. ధరణి విషయమై భూ సమస్యల పరిష్కారం కోసం కోర్టుల వరకు వెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 30వ తేదీ నాటికి అన్ని మండలాల్లో భూభారతి చట్టంపై రైతు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో పైలెట్‌గా ఒక మండలాన్ని ఎంపిక చేసుకొని భూ భారతి చట్టం ద్వారా పరిష్కార మార్గాలను అధికారులు తెలియజేస్తారన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ప్రభుత్వం మండలాల్లో భూభారతి చట్టం సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ మూడవ తేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రతి భూ సమస్యల పరిష్కారానికి చట్టం ద్వారా అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చట్టాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అధికారులు ఎక్కడైనా తప్పు చేసినట్లయితే చర్యలు ఉంటాయన్నారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. పేదవాడి ప్రభుత్వము. సన్న బియ్యం మాదిరిగానే భూభారతి చట్టంతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఎన్ని ఇబ్బందులు ఉన్నా చిత్తశుద్ధితో ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు ను ప్రారంభించగా గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టులు పూర్తి చేస్తుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతుకు భూమికి విడదీయని బంధం ఉంటుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం ఎంతోమంది మేధావులు, రైతులు, ఎన్నో వర్గాల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు చేసినదే ఈ చట్టం అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సబ్సిడీ రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## 'శ్రీ చైతన్య' రాంగ్ రూట్

(మొదటి పేజీ తరువాయి)

ధ్యేయంగా వ్యాపారం చే స్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరీంనగర్ పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన మేకల రోహిత్ అనే విద్యార్థి ఇంటర్మీడియట్ చదువుతూ జెఇఇ మెయిన్స్ ఫలితాలలో 18196వ ర్యాంకు, రిజర్వ్‌డ్ కోటా, శారీరక వైకల్యం రిజర్వేషన్ కోటాలో 17వ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ ఫలితాల అనంతరం ఇదే ర్యాంకును శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం బారీ హోర్డింగులు, ప్రకటనల ద్వారా ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు తాము నాణ్యమైన విద్యనందిస్తున్నామంటూ మభ్య పెడుతున్నారు. కేవలం వ్యాపార దృష్టితో సాధారణ ర్యాంకులు కాకుండా రిజర్వేషన్ ర్యాంకులను చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే సదరు మేకల్ రోహిత్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో రెండు సబ్జెక్ట్‌లు ఫెయిలయ్యాడు. అదీ కాకుండా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్ట్ ఫెయిలయ్యాడు. ఈ మూడు సబ్జెక్టుల్లో సదరు విద్యార్థి ఫలితాల మీద దృష్టిసారించకుండా కేవలం అతని జేఈఈ మెయిన్స్ ఫలితమైన రిజర్వేషన్ 17 వ ర్యాంకును కళాశాల వాడుకోవడం విశేషం. ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిలయిన విద్యార్థి సప్లమెంటరీలో, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో కలిపి రెండు పర్యాయాలు ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉన్నప్పటికీ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం మూలంగా సదరు విద్యార్థి జేఈఈ 17 ర్యాంకు ప్రయోజనం పొందలేకపోతున్నాడు. శ్రీ చైతన్య కళాశాల కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించేంత విద్యాబోధన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. నాణ్యమైన విద్య.. ర్యాంకులు దేవుడెరుగు కానీ కేవలం పాస్ చేయించడమే కష్టమవుతోందని తెలుస్తోంది. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ సదరు ఎస్సీ విద్యార్థి ఉన్నతికి తోడ్పడితే..అదే విద్యార్థి భవిష్యత్తుపై దృష్టిసారించకుండా అతడు రిజర్వేషన్ కోటాల సాధించిన ర్యాంకును వాడుకుని అడ్మిషన్ల పేరుతో కళాశాల ప్రచారం చేసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఆలోచన లేకుండా కేవలం ర్యాంకుల పేరుతో అడ్మిషన్లు పొంది లబ్ధిపొందాలని యాజమాన్యం తహ తహలాడుతుంది. సదరు విద్యార్థి ఇంటర్‌లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణుడైతే జేఈఈ ఫలితాలలో వచ్చిన 17వ ర్యాంకుతో ఉన్నతస్థితిలో ఉండేవాడు..

### ప్రాక్టికల్స్‌లోనూ వింతలు!

సాదారణంగా ఇంటర్మీడియట్‌లో ప్రాక్టికల్స్ అంతా కళాశాల యాజమాన్యం చేతిలో మార్కులుంటాయని అందరికీ తెలిసిన విషయమే.. అయితే సదరు జేఈఈ మెయిన్స్‌లో 17 ర్యాంకు సాధించిన మేకల రోహిత్‌కు ఇంటర్మీడియట్‌లో కెమిస్ట్రీలో 30 మార్కులకు గాను 15, ఫిజిక్స్‌లో 30 మార్కులకు గాను 20 మార్కులు వేసారు. సదరు విద్యార్థులకు ఐఐటి జేఈఈలో సీటు రావాలంటే 65 శాతం మార్కులుండాలి. అంటే 650 మార్కులపైన రావాలి... అయితే ఆ దృక్పదం సైతం లేకుండా సదరు విద్యార్థి ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గించడం వారికే చెల్లింది. మరో విషయమేమిటంటే కళాశాలకు సంబంధం లేని విద్యార్థి సాధించిన ర్యాంకు ఫోటో పెట్టుకుని సైతం ప్రచారం చేశారు. ఖమ్మంకు చెందిన పి.ఈశ్వర్ ముకేష్ కుమార్ జేఈఈ అడ్వాన్స్‌లో 1275 వ ర్యాంకు సాధించారు. ఈ విషయాలపై శ్రీ చైతన్య కళాశాల డీన్ జగన్మోహన్ రెడ్డిని ప్రజాపక్షం ప్రతినిధి సంప్రదిస్తే మేకల్ రోహిత్ రెండు సబ్జెక్టులు ఫెయిలవ్వడం వాస్తవమేనని, అతడు స్లోలర్నర్ అని చెప్పడం విశేషం. ఈశ్వర్ ముకేష్ తమ లెక్చరర్ బంధువు అని, అతడు షార్ట్ టర్మ్ కోచింగ్‌లో మెటీరియల్ తీసుకుని ఇంట్లో కూర్చుని చదివి ర్యాంకు సాధించాడని చెప్పడం మరో విశేషం. కాగా స్లో లర్నర్ అయిన అత్యంత పోటీ పరీక్ష జేఈఈ మెయిన్స్‌లో రోహిత్‌కు 18 వేల ర్యాంకు, రిజర్వేషన్ కోటాలో 17 వర్యాంకు ఎలా సాధ్యమైందనే ప్రశ్నకు సమాధానం లేదు. కేవలం వారి ఫోటోలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్లు పొందడం తప్ప విద్యార్థుల భవితకు బాటలు వేయడంలో పూర్తిగా విఫలమైందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com